ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కరీంనగర్


: fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 68 పేజీలు: 8+16 వెల: 6.50

విక్టరీ పెరేడ్‌కు రావాలని మోడీకి పుతిన్ ఆహ్వానం 5

బెంగాల్‌లో వక్ఫ్ చట్టం అమలు చేయం: మమత



## సిమెంట్ మంటలు
### కాకపెడుతున్న ఇనుము

సొంతింటి కల మరింత భారం

### కృత్రిమ కొరత సృష్టిస్తున్న 'సిండికేటు'!

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** తెలంగాణలో ఓవైపు రియల్‌ఎస్టేట్ కుదేలై నిర్మాణరంగంలో స్థబ్దత నెలకొంటే మరోవైపు సిమెంట్, ఇనుము ధరలు పెరిగి ఇళ్ల నిర్మించుకునేవారికి ఆర్థిక భారం పెరిగిపోతున్నది. సిమెంట్, ఇనుము, ఇటుక ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. సిమెంట్ వివిధ బ్రాండుల బట్టి రూ.70 నుంచి రూ.100 వరకు పెరిగాయి. ఇనుము ధర టన్నుకు రూ.4వేల నుంచి రూ.5వేలకు పెరిగింది. బ్రాండులను బట్టి పెరుగుదల ఉంది. ఇనుము ధర ఏప్రిల్ మొదటి వారం వరకు టన్నుకు 56వేలు ఉంటే ప్రస్తుతం దాని ధర 60వేలకు చేరింది. టాటా గ్రూప్ వంటి మన్నిక ఇనుము ధర టన్నుకు మరింత ఎక్కువైంది. ప్రస్తుతం తెలంగాణలో నిర్మాణరంగం మందకోడిగా ఉంది. వేసవిలో కాస్తాకూస్తో నిర్మాణాలు చేసే కాలం కావడంతో నిర్మాణాలు ప్రారంభమైనాయి. దీనితో ఒక్కసారిగా ధరలు పెరగడంతో సొంత ఇళ్ళు నిర్మించుకోవాలనే కలలుకనేవారు బడ్జెట్ భారం >>2

## సిద్దిపేటకు విస్తరించిన బర్డ్ ఫ్లూ వైరస్

50 వేల కోళ్లను చంపి వేయాలని అధికారుల నిర్ణయం



**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ బర్డ్ ఫ్లూ విస్తరిస్తోంది. తాజాగా సిద్ధిపేట జిల్లాలో కోళ్లకు ఈ వైరస్ వ్యాపించింది. జిల్లాలోని తొగుట మండలంలోని కాన్గల్ గ్రామ శివారులోని కోళ్ల ఫాంలో గత కొన్ని రోజులుగా కోళ్ల మృత్యువాత పడుతుండటంపై హైదరాబాద్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో హుటాహుటిగా ఆ శాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు సిద్ధిపేట జిల్లా అధికారులు ఫాంలోని కోళ్ల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కి పంపించగా బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ అయింది. ఇక, కాన్గల్ గ్రామ శివారులోని కోళ్ల ఫాంలో పరిసరాల్లో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కోళ్ల ఫామ్‌లో పని చేస్తున్న వారికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూతో ఇప్పటికే 20 వేలకు పైగా కోళ్ల మృతి చెందినట్లు తెలిపారు. మిగిలిన 50 వేల కోళ్లను చంపి వేయ్యాలని అధికారుల నిర్ణయం తీసుకున్నారు. 20 టీంలుగా ఏర్పడి కోళ్లను చంపేసి పూడ్చేస్తున్నారు. అలాగే, కిలో మీటర్ పరిధిలో ఏవైనా కోళ్ల ఫారాలు ఉంటే ఆ కోళ్లను కూడా చంపెయ్యాలని పశువైద్యాధికారులు చెప్తున్నారు. బర్డ్ ఫ్లూపై జిల్లా పశుసంవర్ధక కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

## తెలంగాణలో బిజెపిని
# అడుగుపెట్టనివ్వం

### గాంధీ వారసులు, గాడ్సే వారసుల మధ్యనే పొలిటికల్ వార్

రాహుల్ ఇచ్చిన హామీలను తెలంగాణలో అమలు చేశాం

### సిడబ్ల్యుసి విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్9:** అహ్మదాబాద్ సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపిని లక్ష్యంగా చేసుకుని ప్రసంగించారు. గాంధీ వారసులకు, గాడ్సే వారసుల మధ్య రాజకీయపోరాటం కొనసాగుతోందని, ఈ పోరాటంలో గాంధేయ వాదులదేని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ, సర్దార్‌వల్లభాయ్ పటేల్‌ల గడ్డపైన, సబర్మతీ నది ఒడ్డున రెండు రోజులుగా మనం మేథో మదన (చింతన్ బైఠక్) సదస్సు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అధి కారం చేపట్టిన తర్వాత దేశంలో మోడీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున మనం ఇక్కడ సమావేశమయ్యామని అన్నారు. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్‌గాంధీ నాయకత్వంలో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గాడ్సే ఆలోచన విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గాడ్సే వారసుల ఆలోచనధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబ సభ్యులు, రాహుల్ గాంధీ మిత్రులు, దేశ నలుమూలల ఉన్న ప్రతి ఒక్కరూ మోడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మోడీ రైతులకు వ్యతిరే కంగా నల్ల చట్టాలు తెచ్చారు.. వాటికి వ్యతిరేకంగా రైతులు 14నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదు.మోడీ >>2



## 2 రోజులు వానలు

హైదరాబాద్ వాతావరణ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. చక్రవాత ఆవర్తనం, క్యూంబిలోనింబస్ మేఘాలతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది దీని ప్రభావంతో గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో పైన ఇచ్చిన జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, హైదరాబాద్, యాదాద్రి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. >>2

## దేశానికి గుర్తింపు కోసం
# జైనమతం విశేష కృషి

మహామంత్ర దివస్‌లో ప్రధాని నరేంద్ర మోడీ



ఢిల్లీలో బుధవారం జరిగిన మహామంత్ర దివస్‌లో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

**న్యూఢిల్లీ:** భారత దేశానికి గుర్తింపు తీసుకురావడంలో.. జైన మతం వెలకట్టలేని పాత్రను పోషించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచానికి సవాళ్లుగా మారిన ఉగ్రవాదం, యుద్ధం, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలకు.. జైన మత విలువలు సమాధానం ఇవ్వగలవన్నారు. నవకర మహామంత్ర దివస్ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రాచీన మతానికి చెందిన సంప్రదాయాన్ని, వారసత్వాన్ని, ప్రబోధనలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ తెలిపారు. పార్లమెంట్ బిల్డింగ్ లో జైన తీర్థంకరుల విగ్రహాలు ఉన్నట్లు చెప్పారు. జైన మతంలో ఉన్న అనేకాంతవాదం గురించి ఆయన ప్రస్తావించారు. నిజం అనేది అనేక రూపాల్లో వ్యక్తం అవుతుందన్నారు. జైన మతంలో ఒకరిపై ఒకరు ఆధారపడుతారన్న వాస్తవాన్ని గుర్తింపు ఉందని, అందుకే వాళ్లు స్వల్ప స్థాయిలో కూడా హింసను ఆమోదించరన్నారు. శాంతి, సామర్యం, పర్యావరణ పరిరక్షణలో ఇదే కీలకం అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి జైన సాహిత్యం వెన్నుముకగా నిలుస్తుందన్నారు.



## బంగ్లాకు భారత్ షాక్!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** భారత్‌కు సముద్ర ప్రాంతం లేదని అందువల్ల బంగాళాఖాతంపై సమగ్రపర్యవేక్షణఅధికారాలు బంగ్లాదేశ్‌కే ఉన్నాయంటూ ఆదేశ కేర్‌టేకర్‌చీఫ్ మహ్మద్ యూనస్‌చేసిన వ్యాఖ్యలపై భారత్ భారీ షాక్ ఇచ్చింది. బంగ్లా ఎగుమతులకోసం 2020లో ఇచ్చిన ట్రాన్షిప్‌మెంట్ సదుపాయం రద్దుచేస్తూ కేంద్ర పరోక్ష పన్నులబోర్డు కస్టమ్స్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2020 జూన్ 29న ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దుచేయాలనినిర్ణయించారు. అయితే భారత్‌లోకి ఇప్పటికే ప్రవేశించిన కార్గో రవాణాకు అనుమతి ఉంటుందని వెల్లడించింది. 2020 ఉత్తర్వులప్రకారం బంగ్లాదేశ్‌కు చెందినెగుమతులు భారత్‌మీదుగా భూ,జల,వాయుమార్గాల్లో నేపాల్ భూటాన్, మైన్మార్ వెళ్లేందుకు అనుమతి ఉంది. ఇపుడు దీనిని రద్దుచేయడం వల్ల బంగ్లాకు గట్టిషాక్ ఇచ్చినట్లయిందని >>2



## బ్యాలెట్‌తోనే ఎన్నికలు జరపాలి..
## గోల్‌మాల్ ఇవిఎంలు ఇక మనకొద్దు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఏదో రోజు దేశాన్ని అమ్మేస్తారు...

మతతత్వ విధానంతో నాడు వలసపాలకులు.. నేడు సంఘ్‌పాలకులకు లబ్ధి

### సిడబ్ల్యుసి విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న మల్లికార్జున ఖర్గే

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** దేశంలో కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంతో సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్ళుతుందని ఇలాగే కొనసాగితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని ఏదో ఒకరోజు అమ్మేస్తారని అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం గుజరాత్‌లోని సర్ధార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ మెమోరియల్ వద్ద నిర్వహించిన సిడబ్ల్యుసి సమావేశంలో ఆయన పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధానాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలోని సామాన్య ప్రజల సొమ్మును కొందరు సంపన్న స్నేహితులకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతోందని ఆరోపించారు. ఏకఛత్రాధిపత్యంతో నడిచే వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించి పేదలను మరింత పేదలుగా చేయిస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలోని పలు ప్రభుత్వరంగ సంస్థలను నరేంద్రమోడీ ఇష్టారాజ్యంగా స్నేహితులకు కట్టబెట్టడాన్ని అందరూ కళ్లారా చూస్తున్నారని అన్నారు. ఈ దేశాన్ని కుల్లగుత్తాగా అమ్మేసే రోజు మరెంతో దూరంలో లేదని ఆయన ఆవేదన చెందారు. పదకొండేళ్ళుగా బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏదో ఒక రీతిలో భారత రాజ్యాంగంపై దాడి చేస్తోందని సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ సంస్థలు, సూత్రాలపై దాడి చేస్తోంది. వాటిని రక్షించడానికి మనం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్‌పై అమెరికా విధిస్తున్న 26 శాతం సుంకాలపై పార్లమెంటులో చర్చించాలని తాము పట్టుబట్టినా, వారు పట్టించుకోలేదన్నారు. భారతదేశం తటస్థ విధానంకు పూర్తిగా తిలోదాకాలు వదిలారని అమెరికాకు మోకరిల్లుతున్నారని దుయ్యబట్టారు. నిరుద్యోగం కారణంగా విదేశాలకు వెళ్తున్న యువతను బంధించి వెనక్కి పంపించడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటాన్ని తప్పుబట్టారు. మతతత్వ విధానాలతో వలస వచ్చిన విదేశీ పాలకులు స్వతంత్రానికి పూర్వం లబ్ధిపొందేవారని ఇప్పుడు మన దేశంలోని మతతత్వం పునాదులపై రాజకీయాలు చేస్తూ ప్రజలను విభజించి సంఘపర్‌వార్ శక్తులు ఎన్నికల్లో గెలిచి మన పాలకులే ఆ పనిని చేస్తున్నారని ఖర్గే దుయ్యబట్టారు. బ్యాలెట్ పేపర్‌తో దేశంలో ఎన్నికలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్షాలను మోసపూరితంగా ఓడించారని ఖర్గే వాపోయారు. యావత్ ప్రపంచం ఇవిఎంల నుంచి బ్యాలెట్ పేపర్ వైపుగా మారుతుంటే, ఇంకా దేశంలో ఇవిఎంలను >>2



## పెంచిన పెట్రో, గ్యాస్
# ధరలను వెనక్కి తీసుకోవాలి

కేంద్ర మంత్రికి కెటిఆర్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్9:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వంటి దేశాలతో పోలిస్తే మన దేశంలోనే పెట్రోల్ ధరలు అధికంగా ఉండటం శోచనీయమని అన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి గురువారం కేటీఆర్ లేఖ రాశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలను తగ్గించకపోవడం విమర్శలకు తావిస్తోందని అన్నారు. కేంద్రం విధిస్తోన్న సెస్సుల కారణంగా రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మినిమం గవర్నమెంట్, మ్యాగ్జిమమ్ గవర్నెన్స్' అనేది కేవలం నినాదంగా మిగిలిపోయిందని, 'మ్యాగ్జిమమ్ ట్యాక్సేషన్, మినిమమ్ రిలీఫ్' అన్న చందంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. పెట్రోల్ ధరలను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. పన్నుల రూపంలో రాష్ట్రాలకు రావాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దేశ ఆర్థికాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర నిధులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. అధిక ఆదాయం సమకూరుస్తున్న రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు. పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని >>2

## నేడు మంచిరేవులకు ముఖ్యమంత్రి రేవంత్

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనం ప్రారంభించనున్న సిఎం

**నార్సింగి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామానికి నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు. మంచిరేవులలో నిర్మించిన "యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనం"ను ప్రారంభించబోతున్నారు. గతసంవత్సరం పోలీసు >>2



### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం..
## ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు

అమెరికాలో గ్రీన్‌కార్డు పొందాలనుకున్న ఎస్ఐబి మాజీ బాస్ ఆశలకు గండి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోకీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వుండి ఏడాదికిపైగా అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్‌రావు పాస్‌పోర్టును విదేశాంగ శాఖరద్దు చేసింది. ఈ మేరకు పాస్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించింది. పాస్‌పోర్టు రద్దుతో అమెరికాలో గ్రీన్‌కార్డు పొంది అక్కడే శాశ్వతంగా వుండాలనుకున్న ప్రభాకర్‌రావు ఆశలకు గండి పడగా భారత్‌కు ఆయనను తీసుకురావాలనుకుంటున్న పోలీసు అధికారులకు ఊతం లభించింది. రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపి, పోలీసు శాఖలో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రధారిగా వున్న నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్‌రావును భారత్‌కు రప్పించి విచారించాలని భావిస్తున్న పోలీసులకు బలం చేకూరింది. ప్రభాకర్ రావుపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించే విషయంలో ఇంటర్‌పోల్‌ను ఒప్పించి, కొన్ని రోజుల క్రితం నోటీసు జారీ చేసేలా చూసిన పోలీసులు తాజాగా ఆయన పాస్ పోర్టు కూడారద్దు చేయించగలిగారు. ఫోన్‌ట్యాపింగ్ కేసు >>2

## హైసెక్యూరిటీ నెంబర్లు ప్లేట్లు లేకపోతే వాహనాలు సీజ్ 2

సెప్టెంబరు 30వ వరకు గడువు, సర్కార్ కీలక నిర్ణయం




పార్లమెంటు వక్ఫ్ బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ గువాహతిలో బుధవారం నిరసన ప్రదర్శన చేస్తున్న ఆల్ అస్సాం మైనారిటీ స్టూడెంట్స్ యూనియన్ కార్యకర్తలు

# సిమెంట్ మంటలు

>> పెరుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.సోమవారం రోజున అకస్మాత్తుగా ధరలు పెరగంతో రిటైల్ వ్యాపారులతో వినియోగదారులు ఘర్షణ పడుతున్నారు. సిమెంటు ధరలు గత రెండేళ్ళుగా నిలకడగా ఉన్నాయి. అల్ట్రాటెక్ బస్తాకు 290 రూపాయలకు ఏప్రిల్ మొదటి వారం వరకు దొరికేది కానీ ప్రస్తుతం దాని బస్తా ధర రూ.360కి చేరింది. భారతి సిమెంట్ రూ.265దొరికేది ప్రస్తుతం మార్కెట్‌లో రూ.320కి లభ్యం అవుతోంది. రాంకో సిమెంట్ రూ.255కు లభ్యమయ్యేది పెరిగిన తరువాత మార్కెట్‌లో దీని ధర బస్తాకు రూ.320 అమ్ముతున్నారు. నల్గగొండ, కృష్ణ,పల్నాడు,గుంటూరు సూర్యపేట, నల్గొండ ప్రాంతాల్లోని 30కిపైగా సిమెంటు పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల నిర్వహణ, ముడి సరుకుధరలు పెరగడం వల్లనే ధరలు పెంచినట్లు సిమెంట్ కంపెనీ యజమానులు తెలుపుతున్నారు. ఇటుక ధర కూడా రూ.1035కు చేరంది. ఇసుక ధరలో కూడా తరుచూ మార్పులు జరుగుతున్నాయి. గృహనిర్మాణాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ భవనాలు,రోడ్లు,బ్రిడ్జిలు, కాలువల నిర్మాణం పనులపై కూడా సిమెంట్ ఇనుము ధరల పెరుగుదల ప్రభావం చూపబోతుంది. నిర్మాణ వ్యయం ముందు అనుకున్నదాని కంటే ఇబ్బడి ముబ్బడిగాపెరుగుతోందని ఇటు కాంట్రాక్టర్లు కూడా ఆందోళన పడుతున్నారు,. ఇందిరమ్మ ఇళ్ళను కూడా ప్రభుత్వం చేపట్టాలని ప్రాధాన్యత అంశంగా తీసుకొంది. 2025-26లో 12571కోట్ల రూపాయలు నిధులు కేటాయించింది. ఒక్కొక్క నియోజకవర్గంలో వేల సంఖ్యలో నిర్మించాలని కసరత్తుచేస్తున్నారు. దీనిపై ఎలాంటి ప్రభావం వుంటుందో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సిమెంట్ కంపెనీలతో మాట్లాడి సబ్సిడిపిఐ ఇప్పిస్తుందా అని అంతా ఎదురు చూస్తున్నారు. స్లాబ్ పద్దతిలో ఇంటి కోటా కేటాయించి అంతలోనే సిమెంట్ వినియోగించలని ఆంక్షలు విధింపులు చేస్తారా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కూడా వేగవంతం చేయడంతో ఇనుము సిమెంట్ ధరల ప్రభావం కూడా పడే అవకాశం ఉంది.రూ.23వేలకోట్లు నీటిపారుదలరంగంకుకేటాయించినా అందులో జీతభత్యాలు పోను మిగిలిన ఆ కొంతకు పెరిగిన సిమెంట్ ఇసుక ధరలు ఎంతవరకు వాటి నిర్మాణ వేగంకు ప్రతిబంధకం వేస్తుందో అని ఆందోళనలో ఉన్నారు.

# 2 రోజులు వానలు

>> గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవ్వడంతో పాటు ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ, సిద్దిపేట, హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబ్ బాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

# ధరలను వెనక్కి తీసుకోవాలి

>> విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్‌పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు.గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్ల పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం "మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్"గా మారిందని విమర్శించారు.మోడీ చెప్పిన 'అచ్చే దిన్' అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా? సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ పశ్నించారు. దేశంలోని కోట్లాది ప్రజల తరపున రాసిన ఈ లేఖలో, ప్రజల తరపున కొన్ని డిమాండ్లను కేంద్రమంత్రి ముందు కేటీఆర్ ఉంచారు.

# మంచిరేవులకు ముఖ్యమంత్రి రేవంత్

>> అకాడమిలో ఏర్పాటు చేసిన పాసింగ్ ఔట్ పరేడ్ సమావేశానికి వచ్చిన సీఏం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు అందిస్తున్న సేవలు అమోఘమని కితాబునిచ్చారు. హోంగార్డు నుంచి కానిస్టేబుల్, ఎస్.ఐ, ఏసీపి ఇలా అందరి పిల్లలు ఒకే దగ్గర, నాణ్యమైన విద్యను చదివేలా పాఠశాలను ప్రారంభిస్తామని హామీనిచ్చారు. వెను వెంటనే అవసరమైన నిధులు కూడా మంజూరు చేసి, తరుచూ ఈ భవన నిర్మాణపు పనులు ఎంత వరకు వచ్చాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఏం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో త్వరగానే మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనం పూర్తయ్యింది. సైనిక్ స్కూల్స్‌కన్నా మెరుగైన వసతులు, ఆధునిక టెక్నాలజీని జోడిస్తూ విద్యను అందించే ఏర్పాట్లు ఈ పాఠశాలలో చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ పోలీసుల పిల్లలకు చదువుల ప్రారంభించాలన్న తపనతో ఈ భవనంను ప్రారంభించడం జరుగుతుంది. గురువారం ఉదయం 9.గంటలకు సీఏం రేవంత్‌రెడ్డి ఈ భవనంను మంత్రులు, సంబంధిత పోలీసు అధికారులతో కలిసి ప్రారంభించబోతున్నారు. సీఏం హాజరయ్యే సమావేశం కావడంతో మంచిరేవులలో పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు.

# రేవంత్ రెడ్డిపై ఎపి మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్9:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రేవంత్ రెడ్డి గాడ్సేతో పోల్చుతూ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రేవంత్ రెడ్డి తన ఎన్నికల హామీలను నెరవేర్చలేని అసమర్థ ముఖ్యమంత్రి అని విమర్శించారు. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఆయన మోదీని గాడ్సేతో పోల్చారని అన్నారు. తుమ్మితే ఊడిపోయే పదవిని కాపాడుకోవడం కోసం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజల దృష్టిని మరల్చడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడం కోసం ఆయన స్థాయికి మించి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీని అడ్డుకోవడం నెహ్రూ,ఇందిరా,రాజీవ్,సోనియా,రాహుల్ గాంధీ కుటుంబానికే సాధ్యం కాలేదని, ఇక గాంధీ కుటుంబం మోచేతి నీళ్ల తాగే రేవంత్ వల్ల ఏమవుతుందని ఎద్దేవా చేశారు.

# బంగ్లాకు భారత్ షాక్!

>> నిపుణులు చెపుతున్నారు. టెక్స్‌టైల్స్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాల ఎగుమతి దారులు ఈ రద్దు ఎంతో మేలుచేస్తుందని అంచనా వేస్తున్నారు. ఇక యూనస్ వ్యాఖ్యలపై విదేశాంగమంత్రి జైశంకర్ కౌంటర్ ఇచ్చారు. బంగాళాఖాతలో భారత్‌కు పొడవైన తీరరేఖ ఉందన్నారు. చైనాలో పర్యటించిన తాత్కాలిక సారధి యూనస్ మాట్లాడుతూ భారత్‌లోని ఈశాన్యరాష్ట్రాలు పూర్తిగా భూపరివేష్టితమై ఉన్నందున బంగాళా ఖాతానికి మేమే సంరక్షకులమని ఇదొక పెద్దప్రయోజనాలకు అవకాశం కల్పిస్తోందని, అందుకే మా దేశంలో పెట్టుబడులుప ఎట్టండని యూనస్‌చైనాను ఆహ్వానిస్తూ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తదనంతరం బిమ్‌స్టెక్ సదస్సు సందర్భంగా థాయిలాండ్ వచ్చిన యూనస్‌ప్రధానిమోడీతో భేటీ కావడం అక్రమ వలసలు, మైనార్టీలపై దాడులు, హసీనా అప్పగింతవంటి అంశాలు చర్చకు వచ్చాయి.

# బ్యాలెట్‌తోనే ఎన్నికలు జరపాలి..

>> వినియోగిస్తుండటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇవిఎంలతో జరుగుతున్నదంతా మోసమేనని ఖర్గే ఆరోపించారు. యావత్ దేశంలోని యువతరం గళమెత్తి మాకు బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు కావాలి అని తప్పకుండా అంటారని మల్లికార్జునఖర్గే జోస్యంచెప్పారు. ఇవిఎంల గురించి మేం ప్రశ్నిస్తే, వాళ్లు నిరూపించమని అడుగుతారని కానీ నానాటి నమ్మకం పోతున్నదని అన్నారు. అధికార పార్టీకి లబ్ధి చేకూరేలా, విపక్ష పార్టీలకు నష్టం జరిగేలా వాళ్లు ఇవిఎంలలో మార్పులు చేయించుకున్నారు. మహారాష్ట్ర లాగే హరియాణాలో జరిగింది ఇలాగే అని ఆయన కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిపై విమర్శలు చేశారు. ఓటర్ల జాబితాలను తప్పులతడకగా ఇష్టానుసారంగా తయారు చేస్తున్నారు. మహారాష్ట్రలో బిజెపికి 90 శాతం అసెంబ్లీ సీట్లు రావడం వెనుక మతలబు ఇవిఎంలే అని ఆయన అన్నారు. గతంలో ఎన్నడూ ఆ పార్టీకి అన్ని సీట్లు రానే లేదని గుర్తుచేశారు. ఇదంతా మోసం వల్లే సాధ్యమైందని ఆరోపించారు వాళ్లు ప్రజాస్వామ్యాన్ని కాల రాస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు విమర్శించారు. మేం తప్పకుండా నిజాన్ని బయటపెడతాం,దొంగ తప్పకుండా దొరుకుతాడు,మా న్యాయవాదులు, నాయకులు దానిపై పనిచేస్తున్నారనని, ప్రస్తుతం మనం రెండో స్వాతంత్ర్య ఉద్యమం చేస్తున్నామని మల్లికార్జున ఖర్గే అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 10-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల త్రయోదశి రా1.02
పూర్వఫల్గుణి మ.12.26
వర్జ్యం రా.8.27 - రా.10.14
దు.ఉ.10.05-10.55, 2) మ.3.03-3.53
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** ముఖ్యుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**మిథునం:**అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వృత్తివ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ధనలాభం

**కర్కాటకం :** బంధువులతో కలిసి సంతోషంగా గడుపుతారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**సింహం:**పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. నూతన వస్తులాభాలు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆకస్మిక ప్రయాణలు లాభిస్తాయి.

**తుల :**చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్తులాభం

**వృశ్చికం:**ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. శ్రమకు తగ్గిన ఫలితం కష్టమే.

**మకరం:** ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** అనుకోని అతిథులనుండి శుభవార్తలు అందుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి. వస్తు సేకరణ.

**మీనం:**ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. కీలక నిర్ణయాలలో జాప్యం జరిగినా నిదానంగా తీసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అడుగుపెట్టనివ్వం

>> మణిపూర్‌లో మంటలు రాజేశారు. దేశ మూల వాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోడీ చేశారు అని దుయ్యబట్టారు. మరో వైపు, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారు అని గుర్తు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు కుల గణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్ గాంధీ హామీలు ఇచ్చారు అని తెలిపారు. రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం తెలంగాణలో కుల గణన చేసి చూపించాం అని పేర్కొన్నారు.కుల గణనపై రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడతారనే భయంతో ఆయనకు లోక్‌సభలో మోడీ మైక్ ఇవ్వలేదు అని చెప్పారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ హామీ ఇచ్చారు. 11 సంవత్సరాలు దాటిపోయింది. ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలి. మోడీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయి. ప్రతి ఏటా 2 కోట్ల యువకులకు ఉద్యోగాలు రాలేదు అని ఆరోపించారు. దేశంలోని మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోడీ వ్యతిరేక పోరాటంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గాంధీ ఆలోచనధారతో ఉన్నవారంతా గాడ్సే వారసులను, మోడీని ఓడించాలి పిలుపునిచ్చారు.రైతులు, యువత, మహిళల కోసం సీడబ్ల్యూసీలో సాగిన చర్చలపై ఆశతో స్ఫూర్తితో తిరిగి తెలంగాణకు వెళ్లి బిజెపిని ఖతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని, తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం అని స్పష్టంగా చెప్పారు. గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది అని చెప్పారు.అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది, మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇచ్చారు. తెలంగాణను మాకు సోనియా గాంధీ అందించింది అని చెప్పారు. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా, సోనియా గాంధీ నాయకత్వంలో మేం బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. బీజేపీని అడ్డుకుంటాం. వారిని ఎవరూ క్షమించరు అని చెప్పారు. గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారు.కానీ బ్రిటిష్‌వాళ్లు ఎప్పుడూ గాంధీజీ మీద లాఠీ ప్రయోగం చేయలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారు. బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులు. బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలి అని పిలుపునిచ్చారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్దంగా ఉండాలి తెలంగాణలో బీజేపీని అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకొని వెళుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాహుల్‌గాంధీ మాట ఇస్తే అమలు చేసి తీరుతామని, రాహుల్‌గాంధీ గ్యారంటీ అంటే కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు సోనియాగాంధీ,రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని, ప్రజల సమస్యలపై రాహుల్‌గాంధీకి పూర్తి అవగాహన ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# పాస్‌పోర్టు రద్దు

>> వెలుగులోకి రాకముందే ప్ర భాకర్ రావు అమెరికాకు ఉడాయించడం తెలిసిందే. గత ఏడాది మార్చి నెలలో ఈ స్కాం రట్టవగా ఫిబ్రవరి నెలలోనే ఆయన అమెరికాకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆయనను వెనక్కు రప్పించేందుకు ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు చేయని ప్రయత్నం లేదు. ఒక దశలో తాను భారత్‌కు వచ్చి విచారణకు సహకరిస్తానని కో ర్టుకు తెలిపిన ప్రభాకర్ రావు ఆ తరువాత ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతకు ముందు వర్చువల్‌గా తాను విచారణకు హాజరవు తానని పోలీసులకు సమాచారం అందించారు. ఆయన తరపున కోర్టులో పలు పిటిషన్లు దాఖలు కాగా ఇందులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలో వుంది. ఇదే సమయంలో పోలీసులు కూడా పట్టువదలకుండా ఆయనపై నాంపల్లి కోర్టు నుంచి అరెస్టు వారంట్ జారీ చేయించి. దీని ఆధారంగా సిఐడి నుంచి, సిబిఐకి లేఖ రాయి ంచి అక్కడి నుంచి ఇంటర్‌పోల్‌కు మరో లేఖ రాయించి ఆఖరుకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించారు. రెడ్ కార్నర్ నోటీసు జారీ అవడంతో ప్రభాకర్ రావు తప్పని సరిగా అమెరికా నుంచి భారత్‌కు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన భారత్ సహా ఏ దేశంలో వెళ్లినా రెడ్ కార్నర్ నోటీసు కారణంగా అక్కడి పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని భారత్‌కు అప్పగిస్తారు. మీడియా అధినేత శ్రవణ్ రావు ఇటీవలే భారత్‌కు రాగా శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులు ఇలాగే అదుపులోకి తీ సుకున్నారు. ఇక ప్రభాకర్ రావు విషయానికి వస్తే ఆయన అమెరికాలోని తన బంధువుల సహకారంతో గ్రీన్ కార్డును పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సిబిఐ ద్వారా అమెరికా రాయబార కార్యాలయానికి లేఖ రాసి ప్రభాకర్ రావుపై వున్న ఫోన్ ట్యాపింగ్ కేసు వివరాలను వెల్లడించి, ఆ యనకు గ్రీన్ కార్డు ఇవ్వరాదని కోరారు. ఆయన పాస్ పోర్టును భారత్‌లో రద్దు చేయనున్నట్లు అందులో వివరించారు. దీంతో పాటు విదేశాంగ శాఖకు పోలీసులు మరో లేఖ రాసి ప్రభాకర్ రావు పాస్ పోర్టును రద్దు చేయాలని కోరారు. పోలీసుల ప్రయత్నాలు ఫలించి పాస్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఈ విషయంలో అధికారికంగా నిర్ణయం తీసుకుంది. ప్రభాకర్ రావు పాస్ పోర్టును రద్దు చేయడంతో పాటు ఈ విషయమై హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించింది.

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ప్రభాకర్ రావు పోలీసు విచారణ నుంచి తప్పించుకునేందుకు అన్ని దారులు మూసుకు పోవడం తో ఆయన తప్పనిసరిగా భారత్‌కు రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మొదట రెడ్ కార్నర్ నోటీసు జారీ కాగా ఇప్పుడు పాస్ పోర్టు రద్దయ్యింది. దీంతో అమెరికాలో వున్నఆయన గౌరవంగా పోలీసుల ఎదుట హాజరై విచారణకు సహకరించాల్సిన అవసరం ఏర్పడింది. ఒకవేళఆయన ఇప్పుడు కూడా భారత్‌కు రాకుంటే సిబిఐ అధి కారులు రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఆయనను అరెస్టు చేసే వీలుంది. అయితే హైకోర్టులో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో వుండడం ఆయనకు కొంతమేర ఊరటనిచ్చేదిలా వుంది. అయితే దీనిని కొట్టి వేయాలని పోలీసు శాఖ కౌంటర్ దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు తీర్పు ఆయనకు వ్యతి రేకంగా వస్తే మాత్రం పోలీసులు కచ్చితంగా అమెరికాకు వెళ్లి అరెస్టు చేసే వీలుందని తెలుస్తోంది.

# హైదరాబాద్‌కు చేరుకున్న సుప్రీం కోర్టు ఎంపవర్డ్ కమిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్9:** సుప్రీం కమిటీ(పర్యావరణ, అటవీ శాఖల సాధికారిక కమిటీ) బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకుంది.తాజ్ కృష్ణ హోటల్‌లో కమిటీ చైర్మన్ సిద్ధాంత దాస్, మరో ముగ్గురు సభ్యులు బస చేశారు. కమిటీ చైర్మన్,సభ్యులు గురువారం ఉదయం 9 గంటలకు ఆ హోటల్ నుంచి నుంచి బయలుదేరి 10 గంటలకు గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకోనుంది.

సుప్రీంకోర్టు పరిధిలోని ఈ సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకంచె గచ్చిబౌలి భూముల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి వాస్తవ పరిస్థితుల అధ్యయనం చేయనుంది.మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం కానుంది.కమిటీ సాయంత్రం ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానుంది.

# గ్రూప్-1 పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు ఖరారు చేసిన టిజిపిఎస్సీ


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్9:** తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలను టీజీపీఎస్సీ(తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ప్రకటించింది. ఈ మేరకు ఏప్రిల్ 16,17,19,21 తేదీల్లో నాంపల్లిలో గల సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీలో సర్టిఫికెట్‌ల పరిశీలన ఉంటుందని వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైనటువంటి అభ్యర్థుల జాబితా ఉంటుందని కమిషన్ తెలిపింది. ఎంపికైన అభ్యర్థులు వారికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వెరిఫికేషన్‌కు హాజరవ్వాలని సూచించింది. మొత్తం 563 పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# మరో మూడు రోజుల వైద్యుల పర్యవేక్షణలోనే పవన్ చిన్న కుమారుడు

**విజయవాడ ఏప్రిల్ 09 ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ కి సింగపూర్‌లో చికిత్స కొనసాగుతోంది. మంగళవారం అక్కడ జరిగిన అగ్నిప్రమాదంలో బాలుడి కాళ్లు, చేతులకు గాయాలు కావడం ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లిన విషయంతెలిసిందే . ఈ నేపథ్యంలో సింగపూర్ వెళ్లిన పవన్ ఆస్పత్రికి చేరుకున్నారు. మార్క్‌శంకర్‌ను చూసిన అనంతరం వైద్యులతో ఆయన మాట్లాడారు. మార్క్ కోలుకుంటున్నాడని ఊపిరితిత్తుల్లో పొగ పట్టేయడం మూలంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందులపై పరీక్షలు చేస్తున్నామని వైద్యులు పవన్‌కు తెలిపారు. మార్క్ శంకర్‌కు తొలుత అత్యవసర వార్డులో చికిత్స అందించిన వైద్యులు బుదవారం ఉదయం గదికి మార్చారు. మరో మూడు రోజులపాటు పర్యవేక్షణలో ఉంచి పలు పరీక్షలు చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు.

**పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని జనసేన పూజలు....**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని విజయనగరం జిల్లా రాజాంలోని జనసేన నాయకులు ఆకాంక్షించారు. ఈ మేరకు శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోగిరి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు. సింగపూర్‌లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలసిందే.



అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ ఇతర కాంగ్రెస్ సీనియర్ ఇతర నాయకులు.



సిరిసిల్లలో బుధవారం హనుమాన్ స్వాములకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి కెటిఆర్

# సిరిసిల్లలో హనుమాన్ పూజలో పాల్గొన్న కెటిఆర్

**సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 09, ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన హనుమాన్ పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు పాల్గొన్నారు. బుదవారం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ఆద్వర్యంలో హనుమాన్ పూజల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కెటిఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ స్వాములతో కలిసి బిక్షను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, బిఆర్ఎస్ జిల్లా అద్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అద్యక్షుడు జిందం చక్రపాణి, న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# హైసెక్యూరిటీ నెంబర్లు ప్లేట్లు లేకపోతే వాహనాలు సీజ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్9:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇక రాష్ట్రంలోని అన్ని వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం రాత్రి అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్1వ తేదీకి ముందు రిజిస్ట్రరైన అన్ని వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్లు ప్లేట్లు(హెచ్ఎస్ఆర్‌పి) లేకపోతే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. నెంబర్ ప్లేట్ల కోసం వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నది. వచ్చే సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు ఇచ్చింది. గడువు ముగిసిన తర్వాతే కేసులు నమోదు చేయడం,వాహనాలను సీజ్ చేయడం వంటివి చేస్తామని రవాణా శాఖ స్పష్టం చేసింది. ఇన్స్యూరెన్స్,పీయూసి సర్టిఫికేట్ ఇవ్వకుండా కూడా నిబంధనలు విధించింది. టూవీలర్స్ రూ.320-380, త్రీవీలర్స్‌రూ. 350-450, ఫోర్ వీలర్స్‌కు రూ.590-700,కమర్షియల్ వాహనాలకు రూ.600-రూ. 800 చెల్లించాలి. హెచ్ఎస్ఆర్‌పి నంబర్ ప్లేట్లు అంటే, అల్యూమినియం, రెట్రో రిఫ్లెక్టివ్ షీట్లు ఉపయోగించి నాన్-టాంపరబుల్ డిజైన్‌లో రూపొందిస్తారు. ఎక్కువ రోజులు నాణ్యంగా ఉంటాయి. దొంగిలించినా సులభంగా వాహనాలను ట్రాక్ చేయవచ్చు.రాత్రిపూట కాంతిని ప్రతిబింబిస్తాయి కాబట్టి రోడ్డు భద్రతలో సహాయపడుతుంది. ఇందులోని రేడియో ఫ్రీక్వెన్సీ ఇడెంటిఫికేషన్ చిప్‌లో వాహన సమాచారం స్టోర్ అవతుంది. దీని ద్వారా నంబర్ ప్లేట్‌ను సులభంగా స్కాన్ చేయవచ్చు.

# తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసైకి పితృవియోగం

## సిఎంతో సహా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల సంతాపాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌కు బుధవారం పితృవియోగం కలిగింది. తమిళసై తండ్రి హరికృష్ణన్ నాడర్ అనంతకృష్ణ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు బుధవారం తుదిశ్వాసను విడిచారు. తెలం గాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండసురేఖ, ఇతర కాంగ్రెస్ మంత్రులు, నేతలు సంతాపం వ్యక్తంచేశారు. తమిళసై తండ్రి హరికృష్ణన్ నాడర్ అనంతకృష్ణన్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఒక పర్యాయం ఎంపిగా కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎన్నికైనారు. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తన సంతాప సం దేశంలో మహాత్ముడి సిద్దాంతాలను జీవితాంతం ఆచరించిన దేశభక్తుడని తమిళభాషా ప్రేమికుడని కొనియాడారు.

కొండ సురేఖ ఎక్స్‌వేదికపై స్పం దిస్తూ హరికృష్ణన్ నాడార్ మృతి కాంగ్రెస్‌పార్టీకి తీవ్రమైై లోటుగా ఆమె అభివర్ణించారు. తండ్రిని కోల్పోయిన దు:ఖంలో ఉన్న మాజీ గవర్నర్ తమిళసైకి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. తమిళసై తండ్రి మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. తమిళనాడు సిఎం స్టాలిన్ ఇతర బిజెపి నేతలు అనంతకృష్ణన్ పార్థివ దేహానికి నివాళ్లు అర్పించారు.

# ముంబాయి పేలుళ్ల సూత్రధారి రాణా భారత్‌కు అప్పగింత

## లాస్‌ఏంజిల్స్ నుంచి ఢిల్లీ బయలుదేరిన ప్రత్యేక విమానం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన 2008 ముంబాయి ఉగ్రవాదుల దాడుల ఘటనలో సూత్రధారి పాకిస్తాన్...కెనేడియన్ తావుర్ రాణా (64)ను అమెరికా ఎట్టకేలకు అప్పగించింది. 16 ఏళ్లుగా అమెరికాలోని లాస్ ఎంజిల్స్‌లో గల మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో వున్న రాణాను బుధవారం నాడు అమెరికాలోని ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అధికారులు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులకు అప్పగించారు. రాణాను ప్రత్యేక విమానంలో లాస్ ఎం జిల్స్ నుంచి ఢిల్లీకి తరలిస్తున్నారు. గురువారం ఉదయం ఈ విమానం ఢిల్లీకి చేరనుంది. దేశంలో ఉగ్రవాదు దాడిలో అతిపెద్దదిగా నిలిచిన 2008 ముం బాయి దాడులు యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేయడం తెలిసిందే. ఈ దాడుల్లో 173 మంది చనిపోగా 308 మంది గాయపడ్డారు. ఉగ్రవాదులు దక్షిణ ముంబాయిలో ఎనిమిదిచోట్ల దాడులు చేశారు.. ఛత్రపతి శివాజి టర్మినస్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్‌మహల్ పా ్య లెస్ టవర్, లియోపాల్డ్ కేఫ్, కామా హస్పిటల్, యూదు మతస్తుల ప్రార్థనా మందిరం వున్న నారీమన్ హౌస్, మెట్రో సినిమా హాల్, టైమ్స్ ఆఫ్ ఇండియా భవనం వద్ద వున్న సెయింట్ జేవియర్ కాలేజిలు ఉగ్రవాదుల దాడులకు గురయ్యాయి. దీంతో పాటు ముం బాయి పోర్టు ప్రాంతంలోని మాజగాన్‌లో విల్ పార్టీలో ఒక టాక్సీ లో పేలుడు జరిగింది. ఉగ్రవా దుల దాడుల్లో హేమంత్ కర్కరే అనే సీనియర్ ఐపిఎస్ అధికారితో పాటు ఉగ్రవాదుల హిట్‌లిస్టులో వున్న విజయ్ సలాస్కర్ సహా 18 మంది పోలీసులు వీర మరణం పొందారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి స్పీడ్ బోట్‌లో ముంబాయిలోని కోలాడకు చేరుకుని నాలుగు బృందాలుగా విడిపోయారు. అనంతరం టాక్సీలలో ముందుగా నిర్ణయించుకున్న గమ్యస్థానాలకు చేరుకున్నారు. రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ఛత్రపతి టెర్మినల్ రైల్వే స్టేషన్ వద్ద ఎకె 47తో విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. అనంతరం ఉగ్రవాదుల దాడులు మూడు రోజుల పాటు సాగింది. ఉగ్రవాదుల పై ఎన్ఎస్‌జి కమోండోలు ఎదురుదాడికి దిగడంతో పది మందిలో తొమ్మిది మంది మరణించగా అజ్మల్ కసబ్ మాత్రమే ప్రాణాలతో పట్టుబడ్డాడు. ఈ ఘటనలో పట్టుబడ్డ కసబ్‌ను 2012 నవంబర్ 21వ తేదీన తీహార్ జైల్లో ఉరితీశారు. ఈ కేసు విచారణ నాలుగేళ్ల పాటు జరిగింది. కేసు విచారణ జరిగినంత కా లం కసబ్ తీహార్ జైల్లోనే వున్నాడు. కాగా ఈ దాడికి పాకిస్తాన్‌కు చెందిన గజ ఉగ్రవాది పాకిస్తాన్, కెనేడియన్ తావుర్ రాణా సూత్ర ధారిగా తేలింది. ఇతను మరో గజ ఉగ్రవాది డేవిడ్ కోలమెన్ హెడ్లీకి సన్నిహితుడు, మిలటరీలో కొంతకాలం వైద్యు డుగా పనిచేసిన రాణా ఆ తరువాత పా క్‌లోని ఐఎస్ఐలో చేరి భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. లష్కర్ ఏ తోయిబాలో చురుకుగా వుండేవాడు. రాణా రు భారత్‌కు అప్పగించాలని భారత్ అమెరికాను 2009 నుంచి కోరుతోంది. ఇతను 2009లోనే అమెరికా పోలీసులకు పట్టుబడ్డాడు. గత బైడెన్ సర్కారు ఇందుకు అం గీకరించగా దీనికి సంబంధించిన ప్రక్రియ ఇటీవలే పూర్తయ్యింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారుల బృందం రాణాను భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రత్యేక విమానంలో లాస్ ఎంజిల్స్‌కు రెండు రోజుల క్రితమే వెళ్లింది. రాణాను బుధవారం అప్పగించడంతో అతన్ని తీసుకురాసాగారు. రాణాను భారత్‌కు తీసుకువస్తు న్న విమా నం ఇంధనం కోసం మధ్యలో యూరప్‌లోని ఓ నగరంలో కొద్దిసేపు ఆగనుంది. అనంతరం నేరుగా ఢిల్లీకి చేరుకుంటుంది. ఈ విమానం భారత్‌కు రాగానే రాణాను ఎన్ఐఎ అధికారులు తీహార్ జైలుకు తరలించి 2008 నాటి బాంబు పేలుడు కేసుపై విచారణను వేగవంతం చేయనున్నారు.



ముంబాయి పేలుళ్ల సూత్రధారి రాణా

## నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు జాబితా

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు అధికారులు నిమగ్నమయ్యారు. రెండు విడతల్లో కలిపి 4.50 లక్షల మంది లబ్ధిదారులతో జాబితా రూపొందించి ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను ప్రకటించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే జూన్ నాటికి పిల్లర్ల వరకు నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారుల ఖాతాలో సొమ్ము జమచేయాలని సర్కారు యోచిస్తోంది. ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను అధికారులు తయారు చేస్తున్నారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. అలా 72వేల మంది లబ్ధిదా రుల జాబితాను రూపొందించారు. మొదటి విడతలో కొన్ని తప్పులు జరిగా యని గుర్తించారు అధికారులు. వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో నుంచి 42 వేల మందికే ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చారు. మిగిలిన 30 వేల మందిపై మళ్లీ విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండో జాబితాలో తప్పులు జరగకుండా చూడాలని జిల్లా అధికారులకు గృహనిర్మాణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు సిబ్బందికి మార్గదర్శకాలు ఇచ్చారు. రెండోజాబితాలో పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో జల్లెడ పట్టాలని అధికారులు తెలిపారు.

## నేడు ముంబైలో పర్యటించనున్న మంత్రి జూపల్లి

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 10న ముంబైలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటిం చనున్నారు. ముంబై పోవైలేక్‌లో 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్న 20వ దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్, వర్క్ షాప్‌లో ఆయన పాల్గొనున్నారు. పర్యాటక రంగంలో రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను సమీకరించడం తద్వారా 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

## ఎల్‌బినగర్ కోర్టులో మోహన్ బాబుకు చుక్కెదురు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబుకు జల్‌పల్లిలోని తన నివాసం విషయంలో కుమారుడు మంచు మనోజ్‌తో తలెత్తిన వివాదంలో ఎల్‌బి నగర్ కోర్టులో చుక్కెదురయ్యింది. తన కుమారుడు మంచు మనోజ్ జల్‌పల్లిలోని తన ఇంట్లోకి రాకుండా వుండే విధంగా ఎల్‌బినగర్ కోర్టు నుంచి ఉత్తర్వులు పొందగా ఈ ఉత్తర్వులను ఇదే కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో కోర్టు గుమాస్తా తప్పిదానికి పాల్పడినట్లు గుర్తించిన కోర్టు అతనికి మెమో జారీ చేసింది. మరోవైపు జల్‌పల్లిలోని నివాసం వద్ద బుధవారం కూడా హైడ్రామా కొనసాగింది. ఈ కేసులో మోహన్‌బాబుతో పాటు ఆయన తనయుడు మంచు మనోజ్‌ను విచారణకు రావాలని రాచకొండ పోలీసులు నోటీసులు జారీ చేశారు.

# రెవెన్యూమంత్రితో గొడవలు లేవు, ఆశాఖతోనే..

## జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**హైదారబాద్,ఏప్రిల్9,ప్రభాతవార్త:** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో నాకు ఏలాంటి గొడవలు లేవని రెవెన్యూ శాఖతోనే విభేదాలు ఉన్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ మన్‌హటన్ భూములు ప్రభుత్వానిదే అని బిఆర్ఎస్ హయాంలో నెల్లూరుకు చెందిన వ్యక్తికి కేటాయించారని ఆయన తెలిపారు. నారాయణపేటకు చెందిన ఎమ్మెల్యే వాకాటి శ్రీహరికి మంత్రి పదవి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. నారాయణపేట సభలోనే ఏడాది క్రితం ప్రకటించారని గుర్తుచేసుకున్నారు. అనిరుధ్ రెడ్డి గతంలో కూడా హైడ్రాకు వ్యతిరేకంగా గొంతు విప్పారు. ఒకవైపు హైడ్రా పేరుతో నోటిసులు ఇస్తారని మరోవైపు చర్యలుతీసుకోరని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రా కమీషనర్ ఎమ్మెల్యేగా ఉన్న తన ఫోనే ఎత్తలేదంటే ఆయన ప్రజల ఫోన్ ఎత్తుతారా? వారి సమస్యలు పట్టించుకొంటారని గతంలో ఆయన కమీషనర్ రంగనాథ్‌పై కూడా అసహనం వ్యక్తంచేశారు. మాన్‌హాటన్ భూముల వివాదంపై ఫిర్యాదు చేయడానికి హైడ్రా కార్యాలయంకు వెళ్ళితే నా ఫిర్యాదు స్వీకరించి రశీదు ఇవ్వలేదని తెలిపారు. రశీదు ఇవ్వకపోతే ఫిర్యాదుపై చర్యలు లు తీసుకున్నారో లేదో ఎలా తెలుస్తుందని ఆయన ప్రశ్నించారు.

# ఆతిథ్య రంగంలో పెట్టుబడులకు ఎపి సరైన వేదిక

## దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్‌లో ఎపిమంత్రి కందుల దుర్గేష్

### - తొలి రోజు దాదాపు 20కి పైగా ప్రముఖ సంస్థలతో భేటీలు.. ఎపికి రమ్మని ఆహ్వానాలు ఇన్వెస్టర్లకు పూర్తి భరోసా కల్పిస్తామని హామీ



20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్‌లో పెట్టుబడిదారులతో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ముంబయి పర్యటనకు వెళ్లిన మంత్రి కందుల దుర్గేష్ బృందం బుధవారం దాదాపు 20కి పైగా ప్రఖ్యాత హోటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ముంబయిలోని ది వెస్టిన్ ముంబయి పొవై లేక్ లో ఏప్రిల్ 810 వరకు జరుగుతున్న దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్ లో భాగంగా మారియట్, ఐహెచ్ జీ, ఐహెచ్ సీఎల్, అకార్, చాలెట్, ఇమాజికా వరల్డ్ ఎంటర్ టైన్ మెంట్ లిమిటెడ్, హామా, బీఎన్ కే గ్రూప్, వెంటివ్ హాస్పిటాలిటీ, పార్క్ హోటల్స్, లెమన్ ట్రీ, వెస్టిన్, బ్లాక్‌స్టోన్, హిల్టన్,సుబా హోటల్స్, ది బీచ్ ఎహెచ్ఎస్, అంబుజా నోటియా, ఎస్ఆర్ టీ హోటల్స్, రాయల్ ఆర్కిడ్ వంటి జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత సంస్థలతో భేటీ అయ్యారు. అదే విధంగా ఆతిథ్య రంగంలోని కీలక వాటాదారులు, పరిశ్రమ నాయకులు, హోటల్ పెట్టుబడిదారులు, డెవలపర్లు, ఆపరేటర్లు మరియు దక్షిణాసియా అంతటా ఉన్న ఇతర నిపుణులను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోందని, కేంద్ర ప్రభుత్వ సహకారం తమకు మెండుగా ఉందని తెలుపుతూ పర్యాటకులకు గమ్యస్థానాలుగా ఉన్న విశాఖపట్నం, తిరుపతి,అమరావతి,రాజమండ్రి వంటి ప్రధాన నగరాల్లో లగ్జరీ రిసార్ట్స్, హోటల్స్ నెలకొల్పాలని ఆహ్వానించారు. ఈ క్రమంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ సరైన వేదిక అని, పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వారికి వెల్లడించారు. ప్రభుత్వం తరపున కల్పించే మెరుగైన రాయితీలను వివరించారు. పరిశ్రమలకు ఇచ్చే అన్ని రాయితీలను పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కల్పిస్తామని స్పష్టంగా వివరించారు. భేటీ అనంతరం పలువురురాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ఆసక్తిని కనబరిచారు. మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట, ఏపీ టూరిజం అథారిటీ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ నోడల్ ఆఫీసర్ సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి తిరుమల లడ్డూలు 70వేలు ప్రత్యేక ప్యాకింగ్

**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ఏకశిలానగరం కడపజిల్లా ఒంటిమిట్టలోని కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం సాయంత్రం జరిగే కల్యాణోత్సవానికి తిరుమల వెంకన్న లడ్డూలు అందజేయనున్నారు. 70వేల లడ్డూలను ప్రత్యేకంగా తయారుచేసిన తిరుమల ఆలయ పోటు కార్మికులు వీటిని ప్రత్యేక అట్టబాక్సుల్లో ఉంచి ప్యాకింగ్ చేశారు. తిరుమలలోని శ్రీవారిసేవాసదన్-2లో బుధవారంఉదయం నుండి 300మంది శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూలు ప్యాకింగ్ చేపట్టారు. ఈ లడ్డూలను మూడు విడతలుగా ఒంటిమిట్టకు వాహనాల్లో పంపారు. 11వతేదీ రేపు సాయంత్రం సీతారాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు ఈ తిరుమలలడ్డూలు సిద్ధమయ్యాయి. డిప్యూటీ ఇఒ జనరల్ శివప్రసాద్, ఎఇఒ బాలరాజు ఆధ్వర్యంలో రాష్ట్రపండుగగా జరిగే సీతారాముల కల్యాణంలో లడ్డూప్రసాదాలను పంపిణీ చేస్తారు. భక్తులు ఎంతో ప్రీతికరంగా, భక్తితో లడ్డూప్రసాదాలు స్వీకరిస్తారు.

# తిరుపతిలో పారిశుధ్యం మెరుగుపరచండి

## టిటిడి బోర్డుసభ్యుడు భానును ఆశ్రయించి వైసిపి నేతలు



**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాత వార్తప్రతి నిధి:** అంతర్జాతీ యస్థాయిలో తిరుపతి నగరం అభివృద్ధిచెం దిందని, ప్రపంచ యాత్రాస్థలం కూడా కావడంతో ఇక్కడ స్వచ్చత, పారిశుధ్యానికి ప్రాధాన్యత నివ్వా లని లక్ష్యంతో గత టిటిడి పాలక మండలి కార్మికులను కేటాయిం చింది. 1,700మంది పారిశుధ్య కార్మికులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు పంపే విషయంలో గత టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నిర్ణయం తీసుకుని ఆమోదించారు. తిరుపతి నగరం పారిశుధ్యం మెరుగుపరిచే ఉద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయాలపై అప్పటి బిజెపి నేత, ప్రస్తుత టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి హైకోర్టు లో వేసిన కేసును వెనక్కుతీసుకోవాలని వైసిపి నేతలు ఆయన కాళ్ళు మొక్కి వినూత్న నిరసన తెలిపారు. బుధవారం ఉదయం తిరుపతి తిలక్‌రోడ్డులో బిజెపి భానుకాళ్ళను వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్ రాయల్, రాష్ట్రమహిళ విభాగం ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నల్లానిబాబు, రాష్ట్రబిసిసెల్ అధి కారప్రతినిధి లవ్‌లీ వెంకటేశ్, ఉమ్మడి చిత్తూరుజిల్లా అధికా ప్రతినిధి పసుపులేటి సురేష్, వాసుయాదవ్, మోహన్‌రాజ్, వైసిపి నేతలు అరుణ్‌యాదవ్, పద్మజ, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ అమరనాధరెడ్డి, సాయికుమారి, అనిల్‌రెడ్డి, రమణారెడ్డి, కోదండ, గోలి విజయలక్ష్మి, పునీత, ఉష,జ్యోతి, చందు, కిశోర్, మల్లంరవి, రుద్రగోపి, వరదరాజన్ ,సుబ్బు, ప్రదీప్ తదితరులు బిజెపి నేత భానుప్రకాశ్‌రెడ్డి కాళ్ళు పట్టుకుని పారిశుధ్యంకు వ్యతిరేక నిర్ణయంపై వినూత్న నిరసన తెలిపారు. వైసిపి యువనేత భూమన అభినయ్ రూపొందించిన తిరుపతి పారిశుధ్యం మెరుగు ప్రణాళికను కోర్టులో కేసు వేసి అడ్డుకున్న బిజెపి భానుప్రకాశ్‌రెడ్డి మంచి మనసుతో కేసు వెనక్కుతీసుకోవాలన్నారు. 1,700మంది కార్మికులను టిటిడి నుండి తిరుపతి నగరపాలక సంస్థకు రానీయకుండా చేయడం మంచిదికాదన్నారు. తిరుపతి మంచికోరి, పారిశుధ్యంగా మెరుగు పడేందుకు టిటిడి,మున్సిపల్ కార్పొరేషన్‌పై కేసును వెనక్కుతీసుకోవాలని ప్రాధేయపడ్డారు.

# నృసింహుని వసంతోత్సవాలకు వేదమంత్రాలతో అంకురార్పణ



**పెంచలకోన(రాపూరు),ఏఫ్రిల్9ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి వసంతోత్సవాలకు మంగళవారం సాయంత్రంవేదమంత్రోచ్ఛరణలతో అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బాగంగా సాయంత్రం 6 గంటలకు అనుజ్ఞ, విష్వక్షేనారాధన, పుణ్యాహావచనం, అగ్నిఆరాధన,రక్షాబంధనం, మృత్సంగ్రహణం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉద్యానవనం నుండి పుట్టమన్ను తీసుకోని వచ్చి ఆలయ అర్చక స్వాములు,వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మద్య వసంతోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఎఇ వినోద్, సిబ్బంది వెంకటసుబ్బయ్య, నరసింహా, హర్షా,ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వినోద్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వర్ధన్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులున్నారు.

## లోకకల్యాణం కోసమే మహాపాదయాత్ర

### - పెనుగొండక్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానందసరస్వతి

**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** లోకకల్యాణం,హిందూ ధర్మపరిరక్షణకోసం గోవిందుని పదసేవలో తెనాలి నుండి తిరుమలకు మహాపాదయాత్ర చేపట్టామని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానందసరస్వతి స్వావి ు(బాలస్వామి) తెలిపారు. ఇందులో భాగంగానే తిరుమలకుచేరుకుని కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగిందన్నారు. తెలుగురాష్ట్రాలు



పాడిపంటలతో, రైతులు సంతోషంగా ఉండాలనే ఈ మహాపాదయాత్ర చేపట్టామన్నారు. శ్రీవారి కల్యాణాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం పీఠం ప్రతినిధులతో కలసి స్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎపిలో చంద్రబాబు పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చారు

## పోలీసులపై జగన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణం : ఎపి మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పోలీసులకు పూర్తి స్వేచ్చన ఇచ్చాంని చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు అవకాశాలు కల్పించారని, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా పర్యటనలో పోలీసుల మీద చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని, ఆ విధమైన భాషను ఓ మాజీ ముఖ్యమంత్రి మాట్లాడటం ఆయన సంస్కారం ఏమిటన్నది అర్థం చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. అనంతపురం జిల్లా విడపనకల్లులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న జిల్లాలో కులాల మధ్య, మతాల మధ్య ఫ్యాక్షన్ చిచ్చు రేపుందుకు వైసిపి యత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒక గ్రామంలో జరిగిన సంఘటనను ఆధారంగా చేసుకుని రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్.జగన్ ఆరోపించడం శోచనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ కక్ష సాధింపు చర్యలు లేకుండా రాజ్యాంగ పరిపాలన అందిస్తున్నారన్నారు. తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారని, తప్పు చేసిన వారిని జైళ్లకు కూడా పంపుతున్నామని, అలాంటి వారికి బెయిల్ కూడా రావడం లేదని ఆయన వెల్లడించారు.




# పెనుబర్తి అంగన్‌వాడీలో పోషణ్ ఫక్వాడా

**పెనుబర్తి(రాపూరు),ఏఫ్రిల్9ప్రభాతవార్త** రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గోనుపల్లి సెక్టార్ లోని పెను బర్తి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ ఫక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ అధికారిణి సునంధ ఆదేశాలతో సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ చిన్నారులలో పోషణా లోపం లేకుండా వుండేందుకు ఈ పోషణ్ ఫక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్ వాడీ కార్యకర్తలు,ఆయాలు, చిన్నారులు,వారి తల్లితండ్రులు తదితరులున్నారు.

## అందరికీ మంచి జరగాలి:నేపాల్ జడ్జి



**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం తిరుమలేశుని తెలంగాణ ఎస్సీ ఎస్టీకమిషన్ ఛైర్మన్ బక్కివెంకటయ్య, ఎంపి కృష్ణప్రసాద్, ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్, నేపాల్ దేశం న్యాయమూ ర్తులు జస్టిస్ ప్రకాశ్‌మామ్‌సింగ్‌రౌత్, జస్టిస్ హరిప్రసాద్‌ఫయుల్, మరో ముగ్గురు బృందం ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఘాటుగా రైల్వే వినియోగదారుల సమావేశం

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 9,ప్రభాతవార్త** సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే ప్రయాణికుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రైల్వే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ 156వ వినియోగదారుల సమావేశం బుధవారం డిఆర్ఎం కార్యాలయంలో జరిగింది. ఓపక్క వేసవి ఉష్ణోగ్రతలు హాట్‌హాట్‌గా ఉంటే మరోపక్క సమావేశంలో పాల్గొన్న సభ్యులు లేవనెత్తిన ప్రజా సమస్యలతో ఘాటుఘాట్‌గా సమావేశం సాగింది. వినియోగదారుల కమిటీ ఛైర్మన్/డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, కార్యదర్శి సీనియర్ డిసిఎం మనోజ్‌లు పాల్గొన్న సమావేశంలో ముందుగా డివిజన్ నైసర్గిక స్వరూపాన్ని, డివిజన్ సాధిస్తున్న ప్రగతిని, అభివృద్ధి పనులను సమావేశానికి వివరించారు. మొత్తం 16మంది సభ్యులు పాల్గొన్న సమావేశంలో ఎంఎల్‌సి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుంతకల్లు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా రైల్వే ప్రయాణికులు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.


**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ**
**ఇ-వేలం ప్రకటన**

No.PSO(C)-II/e-auction/1/2024-25 తేది: 07.04.2025

ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే అనే ప్రాతిపాదికన వనికిరాని వాహనాలు (15 సం.లలోపు వాహనాలు) /బస్ బాడీస్/టైర్లు/మెటీరియల్ మొదలగు వాటి ఇ-వేలం M/s NCDEX e-Markets Ltd, Hyderabad వారిచే నిర్వహించబడును. (ఫోన్ నెం. 8121156977 & 7569819838). 1. కరీంనగర్ (KRMR) తేది: 14.05.2025. 2. ఉప్పల్ (HZ/UPL) తేది: 21.05.2025. రిజిస్ట్రేషన్ మరియు ఇతర వివరములకు www.neml.in మరియు TGSRTC వెబ్‌సైట్ https://tgsrtc.telangana.gov.in (Tenders) ను చూడగలరు.

సం/-. చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్.

DIPR.NO. 204-PP/CL/ADVT/1/2025-26 తేది: 09.04.2025

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpeta, Vijayawada-520002 (AP)

**E-PROCUREMENT TENDER NOTICE**

Tender invites the following bids which can be downloaded on AP e- Procurement portal as per the scheduled dates stated below.

| Sl.No | NIT NO | NAME OF THE WORK |
|---|---|---|
| 1 | 07/MAU61-ADMN0IS(INEU)/5/2025-IS,Dt:08.04.2025 | Supply & Installation of Trimble R980LT GNSS Rover Setup with Controller and Accessories (30 sets) for Lands Survey @ Amaravati" - Estimate Contract Value: Rs.3,41,25,000/-(Excl.of all taxes) |
| 2 | 08/CRDA-14023(34)/1/2025-ESM, Dt:08.04.2025 | Expression of Interest for Rejuvenation of waterbodies in Amaravati Capital City |
| 3 | 09/CRDA-14023(41)/3/2018-AEO-LSE1-APCRDA, Dt:08.04.2025 | Expression of Interest for Engagement of Consultant for preparation of Detailed Project Report (DPR) for Establishment of Integrated solid Waste Management facility in Amaravati Capital City. |

The bids can be downloaded on AP e-procurement portal from **10.04.2025** to **25.04.2025** up to **14:00 Hrs**. Due date for submission of Bid 25.04.2025up to 15.00 Hrs, Technical bid opening **25-04-2025@16.00Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, **APCRDA**, Vijayawada

వార్త

నైతిక విలువలు విడిచిపెట్టి పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా, అది భక్తి కాదు, రాక్షసభక్తి. కనుకనే రావణాదులు నాశనమయ్యారు.

-బెర్నార్డ్ షా

# న్యాయ చికిత్స

ఏవరికీ ఆట వస్తువు కాకుండా హుందాతనం కాపాడాల్సిన గవర్నర్‌గిరి ఇప్పుడు సుప్రీం ధర్మాసనం ముందు వెలవెలబోయింది. శాసన కర్తలు సభాముఖంగా తీసుకొచ్చే నిర్ణయాలను దాదాపుగా సమర్థించడమే గవర్నర్ పని. అలాకాకుండా శాసన సభ సంస్కరణలను బిల్లులను నెలల తరబడి తొక్కిపట్టి శాసనం అమలు కాకుండా చేయడంలో తమిళ నాడు గవర్నర్ ప్రవర్తించిన తీరును సుప్రీం ధర్మాసనం తప్పుపట్టింది. అంతేకాదు ఇన్నాళ్లూ తొక్కిపెట్టి అటకెక్కిం చిన నిర్ణయాలన్నీ తక్షణమే అమలులోకి తెచ్చి ఆమోద ముద్ర వేయడం విశేషం.గతంలో గవర్నర్ అధికారాలపై చర్చించ డమే జరిగేది. కానీ ఈసారి అలాకాదు ఏకంగా గవర్నర్ ధోరణిని పక్కనపెట్టేశారు. రాష్ట్ర అసెంబ్లీ నుంచి వచ్చిన బిల్లులను పక్కన బెట్టే వీటో అధికారం గవర్నర్ కు లేదని సుప్రీం స్పష్టంచేయడం విశేషం. బిల్లులో వైరు ధ్యమంటే దాన్ని తిరస్కరించవచ్చు. అయితే తమిళనాడు విషయంలో గవర్నర్ విచిత్రంగా ప్రవర్తించారు. తిప్పి పం పనూ లేదు. ఏకంగా పది బిల్లులను గవర్నర్ రిజర్వులో ఉంచ కున్నారంటే పాలనా సంస్కరణల్లో తీసుకొచ్చిన మార్పులు అవసరమా? లేదా?వాటిని అమలు చేయాలా? వద్దా అనే అంశంపై గవర్నర్ స్పష్టతనివ్వలేదని అర్థమ వుతోంది. బిల్లులపై నిర్ణయం చెప్పకుండా తన వద్దనే ఉంచుకోవడమంటే అప్రజాస్వామికమైన రాజ్యాంగవ్యతిరేకమై నదనుని గవర్నర్ చర్యలను అనుమతించలేదు. సదరు బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన నాటి నుండి వాటికి క్లియరెన్స్ ఇచ్చినట్లు భావించాలని సుప్రీం హుకుం జారీ చేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గవర్నర్ల పాత్ర చురుకుగా ఉండాలి. గవర్నరంటే ప్రభుత్వానికి ఓ స్నేహి తుడిగా తత్వవేత్తగా ఉండాలేతప్ప రాజకీయ ప్రేరణతో పనిచేయరాదని హితవు పలికింది. గవర్నర్ల పాత్రపై ఆయా ప్రభుత్వాలకు పొసగని లక్షణాలుంటుంటాయి. వైరుధ్యాలు ఏర్పడిన సంగతులు ఈనాటివి కావు. అసలా గవర్నర్ వ్యవస్థే అనవసరమనే అభిప్రాయాలు దాదాపు 50,60 ఏళ్లుగా వ్యక్తమవుతున్నదే. ఇటీవల కాలంలో పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభుత్వానికి, పాలకులకు పొత్తు పొసగలేదు. అలా ఉన్నాయని ప్రభు త్వం ఎన్నడూ కావాలని గవర్నర్ వ్యవస్థను చిన్నచూపు చూడలేదు. కొంతకాలం క్రితం తెలంగాణలో గవర్నర్‌కు పాలకులకు మధ్య వంతాలు, పట్టింపులు వ్యవస్థ కొన సాగింది. ప్రస్తుతం సజావుగానే నడుస్తోంది. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది కనుక వారి మడుగు లొత్తే వ్యవస్థగా గవర్నర్ వ్యవస్థను తన కనుసన్నల్లో కేంద్రం నడిపించుకుంటోందనే ఆరోపణలున్నాయి. కొన్ని సందర్భాల్లో తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో స్థానిక పాలకులకు కేంద్ర పాలకులకు మధ్య వైరుధ్య భావనలు ఉండడం, గవర్నర్లు కూడా వాటిలో మమేకమయ్యారా? అనిపించే విధంగా వారి ప్రవర్తన ఉండేది. ఇలా జరగడం ఇప్పుడేదు. గతంలోనూ ఇలాంటి సందర్భాలుండనే ఉన్నాయి. అయితే గత కొద్ది రోజులుగా పలు రాష్ట్రాల్లో పాలకులకు, గవర్నర్లకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమం టోంది. నిజానికి శాసనసభకు ఎగువన ఉండే గవర్నర్‌కు పాలకుల మీద కార్పణ్యం తెచ్చుకునే అవకాశమే కాన రాదు. ఎందుకో దాదాపు 15యేళ్ల నుంచి గవర్నర్లపై పాలకులు సుప్రీం కోర్టు గుమ్మం ఎక్కాల్సి వస్తోంది. ఏది ఏమయినా ఈసారి మాత్రం గవర్నర్ వ్యవస్థ మీద పాల కులు ఎదురు తిరగడం సుప్రీం ధర్మాసనం ఎదుట తమ వాదనను కూలంకషంగా వినిపించడం, అదే స్థాయిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ అంశంపై తీర్పును చేశారు.మంత్రిమండలి సలహామేరకు తనకు వచ్చే ఏ బిల్లు నైనా రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సి వస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల రోజులు మాత్రమేని ధర్మాసనం తేల్చేసింది.కానీ గవర్నర్ పదవితో ప్రభుత్వాలను ఇబ్బందిపెట్టే చర్యను ధర్మాసనం సమ్మతించలేదు. ఏకపక్ష చర్యగానే భావించింది. జస్టిస్ జె.బి పర్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం పెండింగ్‌లో ఉన్న పది బిల్లులను గవర్నర్ ఆమోదం పొందినట్లే భావించాలని తీర్పుచెప్పింది. శాసన సభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ తొక్కిపెట్టే చేసేందు కున్న గడువు అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. రాజ్యాంగంలోని 200 అధి కరణం బిల్లులపై చర్యలు తీసుకోకుండా ఆలస్యం చేయడ మంటే రాష్ట్రంలో శాసన నిర్మాణ వ్యవస్థను గవర్నర్‌కు అవరోధించవచ్చునన్న భాష్యం చెప్పుకోరాదన్నది వారి ఉద్దే శం. గవర్నర్ తమకు సంక్రమించిన కాలనిర్దేశిత వ్యవధు ల్ని పాటించకపోతే తప్పనిసరిగా కోర్టులు 'న్యాయసమీక్ష' చేయాల్సి వస్తుంది. గవర్నర్‌కు ప్రత్యేక విచారణాధికారాలు ఏవీ లేవన్నది అదే అధికరణ స్పష్టంచేస్తోందని వెల్లడించా రు. తొలిసారి సమర్పించిన బిల్లును పూర్తి సమాచారం కోసం తిప్పి పంపడం గవర్నర్ విధి కాని మరోసారి అదే బిల్లు ప్రభుత్వంనుంచి వస్తే అనుమతించడం తప్ప గవ ర్నర్‌కు ప్రత్యేక అధికారాలులేవు. సుప్రీంకోర్టు ఈ వ్యవహా రాన్ని తేల్చనట్లయితే ఇప్పటికే మూడేళ్లుగా నాన్చివేతలో ఉన్న బిల్లులన్నీ మరోమూలకి చేర ఉండేవి. కానీ సుప్రీం కోర్టు ఈ వ్యవహారాన్ని కొలిక్కితెచ్చి తమకున్న విశేషాధి కారాలతో నిర్ణయం ప్రకటించింది. రాజ్యాంగం ఎంత ప్రయోజనకారియైనా దాని అమలు చేసేవారిని బట్టే అ దేంతో తేలుస్తుందని డా.అంబేద్కర్ సూక్తిని సుప్రీం కోర్టు తన తీర్పులో ఉదహరించింది.గవర్నర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కట్టుబడే ఉండాలన్న ఒక సూచన తో సుప్రీం గవర్నర్ పాత్ర తీర్పును విశ్లేషించగలగడం ఇకపై పాలకులకు గవర్నర్‌కూ మధ్య ఇలాంటి వైరుధ్యాలు తలెత్తవని ఆశిద్దాం.

మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనలను అంచనా వేస్తారు.



జేన్ పోర్టర్

మనిషి జ్ఞానం కోసం అన్వేషించాలి తప్ప, జ్ఞానం అతని కోసం అన్వేషించదు.



పాస్కల్

# ప్రజావాక్కు



## ట్రంప్ దెబ్బకు కంపించిన మార్కెట్

నిన్న ప్రపంచ మార్కెట్ ఏనుగులు కుమ్మేసిన అరటి తోటలా తయారైంది. ఒక్క భారత్ స్టాక్ మార్కెట్‌లోనే పదమూడు లక్షల కోట్ల రూపాయల మేరకు మదుపరులు నష్టపోయారు. మిగతాదేశాల పరిస్థితి కూడా ఇదే. కోవిడ్ తర్వాత మార్కెట్ ఈ రేంజ్‌లో నష్టపోవడం ట్రంప్ నిర్ణ యాలప్రభావమే.ఆయన సొంత దేశంకూడా ఇలానే నష్టా న్ని చవిచూసింది. అమెరికాలో పలుచోట్ల ఆయనకు వ్యతి రేకంగా ప్రదర్శనలు జరిగాయి. బ్లాక్ మండేగా చరిత్రలో నిలిచిపోయేలా నిన్నటి మార్కెట్ దివాళాకు కర్త, కర్మ, క్రియగా ట్రంప్ ఒక్కడే నిలవడం విశేషం. అయినా అం దుకు ఆయన గర్వపడినట్టే ఉన్నారు. మళ్లీ చైనాను బెదిరి స్తున్నారు. మరిన్ని సుంకాలు ఆ దేశపు ఎగుమతులపై పెంచుతానంటూ. అమెరికా మొదలెట్టిన సుంకాలపెంపు, వాటికి ప్రతిగా పలుదేశాలు తలపెట్టిన ప్రతీకార సుంకాల పెంపుతో వాణిజ్యం ఒడిదుడుకులకు లోనయింది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## రుణ యాప్‌లతో పెరుగుతున్న ఆత్మహత్యలు

**తెలుగురాష్ట్రాలలో** సులభ లోన్‌యాప్‌ల హవా యధేచ్ఛగా సాగుతోంది. తక్కువ్వవడ్డీ,ఎలాంటి షూరిటీఅవసరం లేకుం డా సులభతర విధానంలో క్షణాలలో ఋణాల మంజూరు వంటి కారణాల వలన యువత సులభంగా ఈ యాప్‌ల ఉచ్చులోపడిపోతున్నారు. ఋణాలను మంజూరు చేశాక, అసలు వడ్డీవిధానాన్ని బయటకు తీసుకువచ్చి ఒక రూపా యికి నాలుగింతలు వసూలుచేస్తున్నారు. ఒకవేళ వడ్డీనీ సకాలంలో చెల్లించకపోతే, ఫోన్లుచేసి అసభ్యకర, విచక్షణార హిత సంభాషణలతో మనోవేదనకు గురిచేస్తున్నారు. ఇటు వంటి వేధింపులకు తట్టుకోలేక కొంతమంది మహిళలు ఆత్మ హత్యలకు పాల్పడిన ఘటనలు కుడా ఉన్నాయి.

-సి. హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పుస్తకాలపై ఆసక్తి పెంచాలి

**ఈ రోజుల్లో** యువత పుస్తకాలు చదవడం లేదు. విద్యా ర్థులు వ్యక్తిత్వ వికాసం కొరకు ఇకిగై, ద సీక్రెట్, ది అల్ కెమిస్ట్, ఆటమిక్ హాబిట్స్, కాంపౌండ్ ఎఫెక్ట్ వంటి పుస్త కాలు చదవాలి. తెలుగుగీక్స్, తెలుగు బడి వంటివి చాన ల్స్ చూడాలి.గొప్పవ్యక్తులఆత్మకథలుచదవాలి. పుస్తకాలు చదవడం వలన తెలివితేటలు పెరుగుతాయి.

-పి. నర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

## ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలి

**జాతీయ** దర్యాప్తుసంస్థ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని 2013 ఫిబ్రవరిలో దిల్‌సుక్ నగర్ జంట పేలుళ్ల నిందితుల అర్జీలను తెలంగాణా రాష్ట్రహైకోర్టును తిరస్కరించి బాంబుదాడికి పాల్పడి పద్దెనిమిది మంది మరణానికి, అనేక మంది గాయపడడానికి కారణమైన అయిదుగురికి ఉరిశిక్ష వేయడం న్యాయం, ధర్మ సమ్మతమే.దేశాన్ని అస్థిరతచేయడానికి అనేకఉగ్రవాద సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఈపేలుళ్లకు చెందిన సూత్రధారిగా చెప్పు బడుతున్న కర్ణాటకకు చెందిన రియాజ్ భత్కల్ పాకిస్థాన్‌కు పారిపోయి తలదాచుకున్నాడని వార్త. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో సవాల్ చేయడానికి దోషుల తరఫు న్యాయవాదులు తయారుగాఉన్నారు.అక్కడ ఇంకెంతకాలం గడుస్తుందో. కాలా యాపన చేయడం మన కోర్టులకు అలవాటే. ఆలస్యమైనా హై కోర్టు తీర్పుమిక్కిలి హర్షించదగినది. పరాయి దేశాల దాడుల కంటే దేశంలోని ఉగ్రవాద సంస్థల వల్ల ముప్పు ఎక్కువై శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఎప్పటికి అప్రమత్తతో ఉండాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## స్థానికులకే ఉద్యోగాలు

**అమెరికా** తమ స్వీయ పొరపాట్లతో తను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్నది.అమెరికాలో వలసదారులను పంపాలని స్థానికత కలిగిన జనానికి ఉద్యోగాలు ఇవ్వాలి అని ట్రంప్ వేసిన పన్నాగం రివర్స్ కొట్టింది. అక్కడ స్థానికులు ఆందోళన బాట పట్టడం ట్రంప్‌కు మింగుడు పడకపోగా ఆహార పదార్థాల రేట్లు నిత్యావసర వస్తువుల ధరలు మిన్నంటుతున్నాయి. ఇప్పుడు అమెరికా ట్రంప్ చేయాల్సిందేమిటి అక్కడి పౌరులకు స్వేచ్ఛను కల్పించడమే. ఏ దేశమైన అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగాభావించిముందుకుపోవాలి.అయినాఅమెరికా వలస దారులకష్టాన్నివాడుకొనిఅభివృద్ధిచెందిందిఅని గుర్తుంచుకోవాలి.

-భారత అవినాష్, జనగామ

## స్టడీ మెటీరియల్ సరఫరా చేయాలి

**తెలంగాణ** రాష్ట్రంలో ఉన్న ప్రతి ప్రభుత్వ కళాశాలలోని లెక్చ రర్‌లకు వివిధ గురుకులల్లోని ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ గురు కులాలలోని లెక్చరర్లకు వారి సబ్జెక్టులను బట్టి స్టడీ మెటీరియల్ రూపొందించాలి. ఆడియో వీడియోలను కూడా రూపొందిం చాలి. ఈవేసవి సెలవుల్లో సబ్జెక్టు మెటీరియల్ రూపొందించా లి. దృష్టిలోపం కలిగిన లెక్చరర్లకు రీడర్ అలవెన్స్ పెంచాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇల్లు, ఒళ్లు గుల్ల.. తాగుడు మానడం కల్ల!

*ఈ ఏడాది ఎలాగైనా మద్యం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.60వేల కోట్లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్ర ఆర్థిక తోడ్పాటుకు మద్యం ఆదాయంపైనే భారం వేసుకున్నారు. బడ్జెట్లో 20శాతం ఆదాయం లిక్కర్ ద్వారానే సమకూర్చుకోవాలని జిల్లాల వారీగా టార్గెట్ విధిస్తూ ధరల పెంపు కొత్త కంపెనీలకు అనుమతితో ముందుకు సాగుతుంది.ఈ పరిణామాలను బట్టి చూస్తే ప్రభుత్వా(పాలకు)లు మారినా వారి విధానాలలో పెద్దగా మార్పు కనిపిం చడం లేదని, ప్రజా ఆరోగ్యానికి గొడ్డలి పెట్టుగా మారిన మద్యం మహమ్మారిని నియంత్రించాల్సింది పోయి అధిక ఆదాయ వనరుగా ఎంచుకోవడం ఎంత మాత్రం సమాజాని కి శ్రేయస్కరం కాదు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి ఇచ్చిన మద్య నియంత్రణ హామీకి తిలోదకాలు ఇచ్చినట్లే అవుతుందని మేధావులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మద్య మహమ్మారి బాధితులు వెలకట్టలేని మనోవేదనకు లోనవుతున్నారు.*



మేకిరి దామోదర్

తెలంగాణ రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోంది. వేసవిలో తాగునీరుకు కొరతుంది కానీ మద్యా నికి కొరతనేది లేదు గాకలేదు. 'కవి తకేదీ కాదు అనర్హం' అని ఓ కవి అన్నట్లు మద్యం తాగుడు కెవరు కారు అనర్హం అన్నట్లుగా మారింది నేటి పరిస్థితి. తెలంగాణ సబ్బండ జాతి ఆర్థిక పరిస్థితితో సంబంధమే లేదు. (ఏదో కొద్ది మంది తప్ప). అందరి దారి ఆ(మద్యం)వైపే అన్న ట్లుగా ఉంది. మద్యం షాపుల ముందు మాత్రం నిబంధనల బోర్డులు పేరుకే వేలాడుతుంటాయి. అంతేకాదు పాలనకు ధనం, రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు అధిక ఆదాయాన్ని సమకూర్చే ఇంధనం కూడా ఇదే అనేది ఎవరు కాదనలేని వాస్తవం.పల్లె నుండి పట్నం వరకు వాడ వాడలా గల్లి గల్లీలో మద్యం షాపులు స్వాగతిస్తూనే ఉంటాయి. ఇందులోనూ రాయితీల వల విసిరి అమ్మకాలు పెంచుకోవడం, దేవతల పేరుతో షాపులు పెట్టి ఆకర్షించుకోవడంలో మార్గాలు అనేకం. పొద్దు స్తమానం, రాత్రింబవళ్లు మద్యం విక్రయాలకు విరామం ఉండదు. దీనితో బలిసినోడు క్లబ్బుల్లో, బారుల్లో బొర్ల బట్టే, పేదోడు చీప్ లిక్కర్ తాగి ఇల్లు, ఒళ్లు, మరిచి చిందులేయ బట్టే!. అలా ఆరోగ్యాన్ని లెక్కచేయక సమాజంలోని అన్ని వర్గాల (కొందరుమినహా) పరిస్థితి ఎంతగా తయారైందంటే!. పుట్టుక చావు, పెండ్లి పేరంటం, శుభ అశుభ కార్యమేదైనా మద్యం (మందు) తాగాల్సిందే, తాగి ఊగాల్సిందే. అది లేకపోతే ఆ కార్యాలకు విలువే లేదు అన్నట్లుగా సమాజం తయారైంది. దీనికి వ్యక్తుల బాధ్యత, పాలకుల బాధ్యత లేదా! పాలితులు, పాలకులు ప్రజారోగ్యం గురించి పట్టించు కునే నాథుడే లేడు. దీనికి బానిసై ఎన్నో కుటుంబాలు, ఎంతోమంది జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయి, కు టుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రధానంగా యువత జీవితాలను నిర్వీర్యం చేస్తోంది. అలాగే సమాజంలోని అక్రమాలకు, దుర్మార్గాలకు, హత్యలకు, హత్యాచారాలకు, దోపిడికి, ప్రయాణ ప్రమాదాలకు వెరిసి సమాజాన్ని చీడ పీడలా పట్టిపీడిస్తున్న ఈమద్యాన్ని నియంత్రిం(నిర్మూలిం) చకపోగా ఎవరు పట్టనట్టుగా ప్రవర్తిస్తున్న తీరు అమానుషం కాదా?అయినా నిర్లజ్జగా మద్యం అమ్మకాలు నానాటికి పెరి గిపోతున్నాయి. ఈ పాపంలో గత, నేటి పాలకుల పాత్ర అన్నట్లుగానే ఉంది. అలా అమ్మితేనేకదా రాష్ట్ర ఆర్థిక ప్రగతి పరుగులు తీసేది అని చెప్పకుండానే ఒప్పుకుంటున్నారు.

తాడిచెట్టు తల్లి కాదు/ తాగినోడు మొగుడు కాదు/ ఈత చెట్టు ఇల్లు కాదు/ ఇవ్వనోడు దేవుడు కాదు/ ఓ గువ్వల చెన్న అనే.. ఈ యదార్థ మౌఖిక గేయం పట్టించుకోవడం లేదు నేటి ఆధునిక సమాజం. 2015 నుంచి తెలంగాణ లిక్కర్ ఆదాయ వివరాలుచూస్తే 2015-16 సం. ఆదాయం (కోట్లు)రూ.12,706.35, 2016-17సం.రూ.14,184.83 2025-26సం.రూ.60,000.00 కోట్ల(టార్గెట్)గా ప్రస్తుత ప్రభుత్వం ముందుకు వెళ్లుతోంది. దక్షిణ భారతదేశంలో మద్యం విక్రయాల్లో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్పీ) ప్రకారం రాష్ట్రంలో గతేడాది ఒక్కోవ్యక్తి సగ టున మద్యంకోసం రూ.1,623ఖర్చుచేశారు. నేటిప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని మార్చుతామని ఎన్నికల ముందు నేతలు అనేక సభల్లోచెప్పారు. కానీ వీరి పాలనలో కూడా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు పెరిగాయే తప్ప తగ్గ లేదు. పైగా రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపుల సంఖ్య కూడా పెరిగిందని చెప్పున్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని ఆశిస్తున్నదే



తప్ప ప్రజల ఆరోగ్యాన్ని, వారి ఆర్థిక స్థితిగతులనుచూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు మద్యం తీసుకోవద్దని ఆరోగ్యాలు పాడు కాకుండా కాపాడుకోవాలని ప్రకటనల ద్వారా ప్రచారం చేస్తూ,మరోవైపున దాని విని యోగాన్ని పెంచుతుండటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ద్వంద్వ విధానంపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదిత బడ్జెట్లో20శాతం (60వేలకోట్లు) ఆదాయం మద్యం ద్వారా రాబట్టాలని సర్కారు నిర్ణయిం చింది. గత ఏడాది ఈ రూపంలో రూ.39,500 కోట్లు ఆదాయం సమకూరగా ఈసారి మరో 20 వేల కోట్ల వరకు అదనంగా లిక్కర్ ద్వారా సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది. ఆ మేరకు ఆబ్కారీ శాఖ ఆదాయ వనరుల పెంపుపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ధరల నిర్ణయ కమిటీ సిఫారసులకు తీసుకున్న ఆశాఖ మూడు ప్రతిపాదన లను సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తుంది. ధరల పెంపు, కొత్త కంపెనీలకు అనుమతి, సాధారణ బార్ల తోపాటు ఎలైట్ బార్లు వైన్స్‌ల సంఖ్య పెంచాలని ప్రతిపా దించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,620మద్యం దుకాణాలు, 1000కి పైగా బార్లు, క్లబ్బులు టూరిజం హోటళ్లు ఉన్నా యి. 12,769 గ్రామపంచాయతీలు ఉండగా ఒక్కోగ్రామం లో అధికారికంగా ఐదు నుంచి పది వరకు బెల్ట్ షాపులు ఉన్నాయి. మొత్తంగా చూస్తే తెలంగాణ వ్యాప్తంగా దాదాపు లక్షకు పైగా బెల్టుషాపులు ఉంటాయని గణాంకాలు చెప్తున్నా యి. వీటి ద్వారా ఖజానాకు అన్ని శాఖల కంటే ఎక్కువ మొత్తం ఆదాయం సమకూరుతుంది. గత పదేండ్లలో దాదా పు రూ.2.5 లక్షల కోట్లకు పైగా ఆదాయం ఈ విభాగం నుంచిసర్కారుకు వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం సైతం ఆదా యం పెంపుపై ప్రత్యేక దృష్టిపెట్టింది.అందుకు సంబంధించి తగుచర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. పైన నిర్ణయించి న మేరకు ధరలతోపాటు వైన్స్, బార్లసంఖ్య పెంచడం కొత్త కంపెనీలకు అనుమతులు ఇవ్వాలనే మూడు ప్రతిపాదనలు సర్కారు నిర్ణయంమేరకు గతంలో బీర్లపై 15శాతం ధరలను ఆబ్కారీశాఖ పెంచింది. 5శాతం పన్నులతో కలుపుకొని 19 శాతం వరకు బీర్లపై ఆదాయం రానుంది. అలాగే లిక్కర్‌పై 20నుంచి 25శాతం పెంచనుంది. ఇదిలా వుంటే తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త లిక్కర్ బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రంలోఉన్న 2,620 మద్యం దుకాణాలు,1000పైగా బార్ల సంఖ్యను 25 శాతం వరకు పెంచాలని ప్రతిపాదించారు. అలాగే గుడుంబా, గంజాయి నియంత్రణ పకడ్బందీగా అమలు చేయాలని అధికా రులు సర్కార్‌కు నివేదించారు. వీటిని అరికడితే గ్రామీణ ప్రాంతాల్లో చీప్‌లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. ఇలా జిల్లాలవారీగా ఆబ్కారీశాఖ అధికారుల కు ప్రతినెలా నిర్ణయించిన టార్గెట్లను చేరుకునేలా ఉన్నతాధి కారులు పర్యవేక్షి ంచాలని ప్రతిపాదించారు. ఈ ఏడాది ఎలాగైనా మద్యం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.60వేల కోట్లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్ర ఆర్థిక తోడ్పాటుకు మద్యం ఆదాయం పైనే భారం వేసుకున్నారు. బడ్జెట్లో 20శాతం ఆదాయం లిక్కర్ ద్వారా నే సమకూర్చుకోవాలని జిల్లాల వారీగా టార్గెట్ విధిస్తూ ధరల పెంపు కొత్త కంపెనీలకు అనుమతితో ముందుకు సాగుతుంది.ఈ పరిణామాలను బట్టి చూస్తే ప్రభుత్వా(పాల కు)లు మారినా వారి విధానాలలో పెద్దగా మార్పు కనిపిం చడం లేదని, ప్రజా ఆరోగ్యానికి గొడ్డలి పెట్టుగా మారిన మద్యం మహమ్మారిని నియంత్రించాల్సింది పోయి అధిక ఆదాయ వనరుగా ఎంచుకోవడం ఎంత మాత్రం సమాజాని కి శ్రేయస్కరం కాదు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి ఇచ్చిన మద్య నియంత్రణ హామీకి తిలోదకాలు ఇచ్చినట్లే అవుతుందని మేధావులు, విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మద్య మహమ్మారి బాధితులు వెల కట్టలేని మనోవేదనకు లోనవుతున్నారు.

# సహజ సురక్షిత వైద్యం హోమియో!


రామ కిష్టయ్య సంగన భట్ల

హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ హానీమాన్ జ్ఞాప కార్థం ప్రతి సంవత్సరం ఆయన జన్మించిన ఏప్రిల్ 10న ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటారు. నేడు ప్రపంచంలోని వందకు పైగా దేశాలలో హోమియో పతి వైద్యపద్ధతిని అనుసరిస్తున్నారు. హోమియోపతి రం గంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నదేశం భారతదేశం. మలేరియావ్యాధి నివారణకు సింకోన బెరడుతో చేసిన మందువాడుతారని తెలుసుకున్న హానీమన్ ఆ బెరడు మలే రియాను ఏవిధంగా నివారిస్తుందో తెల్సుకోవాలనుకున్నాడు. అందుకోసం సింకోనా బెరడుతో కషాయం తయారు చేసు కొని తనమీద తన స్నేహితులమీద ప్రయోగాలు జరిపి, ఏ ఔషధమైతే ఆరోగ్యవంతునిలో ఒకవ్యాధి లక్షణాలను కలుగ జేస్తుందో ఆ లక్షణాలున్న వ్యాధికి ఆ ఔషధం ఇచ్చినప్పుడు వ్యాధి నయమవుతుందని తెలుసుకున్నాడు. తన ప్రయోగ ఫలితాలను గురించి 1976లో లాన్సెట్ జర్నల్‌లో ప్రచురిం చడంతో పాటు, ఈ నూతన వైద్యవిధానానికి హోమియో పతిగా నామకరణం చేశాడు. హోమియోపతి అనేది గ్రీకు పదాల హోమియో నుండి ఉద్భవించింది. ఒక పదార్థం ఏబాధని కలిగిస్తుందో ఆ బాధని నివారించటానికి అదే పదార్థాన్ని మందుగావాడాలి అన్నది హోమియోపతి మూల సూత్రం. సారూప్య లక్షణ వైద్యం. హోమియోపతి నేడు పాటిస్తున్న అత్యంత ఆధునిక వైద్యవిధానం, ఇది వ్యాధి మూల కారణాన్ని పరిష్కరించడం ద్వారా రోగులకు లోపలి నుండి చికిత్సచేయగలదు. హోమియోపతి మందు లు బాహ్య లక్షణాలను అదుపులో పెట్టటానికి ప్రయత్నిం చవు. బయటకి కనిపించే లక్షణాలకు మూల హేతువు ఏదో వాటిమీద పని చేస్తాయి.ఉదాహరణకు జ్వరం, దగ్గు మొద లైనవి బయటకి కనిపించే లక్షణాలు. ఈ లక్షణాలు పొడ చూపగానే వాటిని వెంటనే అణచిపెట్టటానికి మందు వేసు కుంటే అసలు కారణంపై ప్రభావంచూపి, నయం కాగలదని ఆధునిక వైద్య శాస్త్రం కూడా అంగీకరిస్తుంది. హోమియో పతి మందులు ప్రకృతిలో లభించే మూలాల నుండి తయా రు చేయబడతాయి. హోమియోపతి అనేది సురక్షి తమైన, సున్నితమైన సహజమైన వైద్యం, హానిమన్ కనిపెట్టిన వైద్య సూత్రాలు నాలుగువి 1.సారూప్య ఔషధ సిద్ధాం తం, 2.దీర్ఘ వ్యాధుల చికిత్స (మయాజమ్స్), 3.ఔషధాలను పొటెన్సీలుగా మార్చు ట (పొటెంటైజేషన్), వ్యాధితీవ్రతను బట్టి ఎంత పొటెన్సీలో మందును ఇవ్వాలి, 4. డోసులను ఎప్పుడు ఎక్కడఎలాగ ఎన్ని ఇవ్వాలి. ప్రపంచంలోని వైద్యవిధానాలలో అల్లోపతి అనే ఆధునిక వైద్యం (ఇంగ్లీషు వైద్యం) మొదటి స్థానం ఆక్రమించింది. దాని తర్వాత ఆయుర్వేద, హోమియోపతి, యునాని, నేచురోపతి, ఆక్యు పంక్చర్ ఇలా అనేక వైద్య విధానాలున్నాయి. హోమియో పతి వైద్యం 2వ స్థానంలో ఉంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ హోమియోపతి వైద్యాన్నిరెండవ అతి పెద్ద వైద్యవిధానంగా గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా,రెండు వందల మిలియన్ల మందికిపైగా హోమియోపతిని రోజూ వైద్యంకోసం ఉపయో గిస్తారు. ఈ చికిత్సా విధానం స్విట్జర్లాండ్, పాకిస్థాన్, మెక్సి కో, ఇండియా, చైనా వంటి అనేక దేశాల జాతీయ ఆరోగ్య పద్ధతుల్లో పొందుపరచబడింది. 66దేశాల్లో ఈ హోమియో పతి వైద్యం ప్రాచుర్యంలో వుండగా, భారతదేశ జనాభాలో 38 శాతం ప్రజలు ఈవైద్యాన్ని పొందుతున్నారు. భారత దేశంలో వంద మిలియన్ల మంది వ్యక్తులు వ్యాధులను నయం కాగలవనే విశ్వాసంతో హోమియోపతి వ్యవస్థపై ప్రత్యేకంగా ఆధారపడుతున్నట్లు ఒక నివేదిక చెపుతోంది. ప్రస్తుతం రెండు లక్షల వేలకు పైగా రిజిస్టర్డ్ హోమియో వైద్యులు ఉన్నారు. హోమియోపతి భారత దేశంలోఅత్యంత ప్రాచుర్యం పొందిన వైద్యవ్యవస్థలలో ఒకటి, వాస్తవానికి, ఆయుష్ (ఆయుర్వేదం, యోగా ప్రకృతివైద్యం, యునాని, సిద్ధ,హోమియోపతి) సేవలలో రెండవది.అకాడెమిక్ హోమి యోపతి ఇన్స్టిట్యూట్స్ ఆయుష్ కాలేజీలలో 35.8శాతం, హోమియో పతి ప్రాక్టీషనర్లు మొత్తం ఆయుష్‌లో 37 శాతం ఉన్నారు. మన దేశంలో హోమియోపతిలో అతి పెద్ద ఔషధ తయారీవ్యాపార రంగంగా ఉంది.గొంతునొప్పి, మైగ్రేన్లు, చెవి ఇన్ఫెక్షన్లు, జలుబు వంటి తీవ్రమైన రోగాల ను ఉబ్బసం వంటి దీర్ఘకాలిక పరిస్థితులతో పరిష్కరించ డానికి ఇది ఉపయోగ పడుతుందని చెపుతారు.

# సుంకాలతో ఆర్థిక మాంద్యం ఏర్పడనుందా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

స్టాక్ మార్కెట్లన్నీ ప్రపంచ కుబేరుల చేతుల్లో ఉన్నప్పుడు, ప్రజలకు ఆదాయాలు, ఉపాధి అవకాశాలు, కొనుగోలు శక్తి లేనప్పుడు అశేష ప్రజానీకానికి సంబంధం లేని సంపద కొద్ది మంది చేతుల్లో ఉండడం వలన ఆర్థికవ్యవస్థలో సార్థక డిమాండ్ లేక సప్లై డిమాండ్ల మధ్య అసమతల్యం ఉన్నప్పు డు ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ నేడు బిలియనీర్ల కోటీశ్వరుల మయం. వీరి మధ్య పోటీతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఆర్థిక మాంద్యంలోకిపోతున్నది. రాజ కీయాల్లో వీరే ఉత్పత్తి కార్యక్రమాల్లోనావీరే. ప్రపంచ ఆర్థిక శక్తులుగా వీరే. ఇంక ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. ఈ బిలియనీర్లను ఎలా ఉపయోగించుకోవాలి అనేది ప్రపంచ నాయకుల ఆరాటం. ప్రజలకు ఏమి ఇస్తున్నాము అనే రోజు లులేవు. వీళ్లైతే ఈ ప్రపంచ నాయకులే బిలియనీర్లవుతారు. కొద్ది మంది చేతుల్లోకి సంపద పోతున్న స్థితిని కల్పించింది నేటి పాలకుల ఆర్థికవిధానాలు.డెమోక్రసీ నేడు ప్రపంచంలో ప్లూటోక్రసీగా ఉన్నది. ప్రపంచ జిడిపిరీత్యా అమెరికా 25 శాతం వాటా కలిగి మొదటి స్థానంలోనూ 20శాతం వాటా తో చైనా రెండవ స్థానంలోనూ అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశంగా ఉన్నాయి. పది మిలియన్ డాలర్ల అనగా 87 కోట్ల రూపాయలు మించి ఆదాయాలుంటే వారిని అధికసంపన్ను లుగా కోటీశ్వరులుగా గుర్తించి 2024లో నైట్ ఫ్రాంక్ అంత ర్జాతీయ స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ నివేదిక ప్రకారం అమె రికాలో 905413 మంది కోటీశ్వరులు మొదటి స్థానంలో ఉండగా చైనాలో 471634మంది రెండవ స్థానంలో, జపా న్లో 122119 మంది మూడో స్థానంలో, నాలుగో స్థానంలో ఇండియా 85698మంది కోటీశ్వరులు ఇలా వరుసగాజర్మనీ కెనడా బ్రిటన్ ఫ్రాన్స్ ఆస్ట్రేలియా హాంకాంగ్ మొదటి పది స్థానాల్లో అధిక సంపన్నులుగా ఉన్న దేశాలుగా ఉన్నాయి. హురున్ బిలియనీర్ల జాబితాలో అమెరికా అధ్యక్షుడు అత్యం త సంపన్నుడిగా నిలిచారు. 78ఏళ్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 500 బిలినియర్ల జాబితాలో అగ్రస్థానంలోనిలిచారు. అమెరికాలో 2024నాటికి 770మంది బిలియనీర్లున్నారు. వీరిలో 96మంది కొత్తగా వచ్చిన చేరారు. చైనాలో 823 మంది ఉంటే రెండోస్థానంలో అమెరికా ఉంది.284 మంది బిలియనీర్లతో భారత్ మూడో స్థానంలో నిలిచింది. సంపద కేంద్రీకరణతో ప్రపంచమంతా ఆకలికేకలు మారుమోగుతుం టే ప్రపంచ ధనిక దేశాలలో నెంబర్‌వన్‌గా ఉన్న అమెరికాకు ఇప్పుడు ఆర్థిక స్వాతంత్రం వచ్చిందట. ప్రపంచవ్యాప్తంగా కోటీశ్వరులలో 40శాతం మంది అమెరికాలోనే ఉన్నారు. ప్రపంచ జిడిపిలో25శాతం అమెరికా అగ్రరాజ్యందే. 2024 లో అమెరికా వాణిజ్యలోటు 918బిలియన్ డాలర్లు. ఈ వాణిజ్య లోటును తగ్గించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాలపై అధిక మోతాదులో టారిఫ్స్ విది స్తున్నారు. వెనుకబడిన దేశాలపై వీటి ప్రభావం ఉద్యోగిత,



ఉత్పత్తులపై,పరిశ్రమలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. ట్రంప్ ప్రకటించిన పరస్పర సుంకాలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలను ఆరంభించినట్లయింది.చైనా,కెనడా పలు యూర ప్ దేశాలు సైతంప్రతీకార సుంకాలను ప్రకటించినాయి. ఫలి తంగా పలుదేశాలలో ముఖ్యంగా అమెరికాలోఆర్థికమాంద్యం ఏర్పడుతుందా అని అనుమానాలున్నాయి.ముఖ్యంగా భారత దేశంలో కీలకరంగాలపై ఈ ప్రభావం పడింది. మన దేశ ఎగుమతులపై సుంకాలు పెంచడం వలన భారత్ ఎక్కువగా ఎగుమతి చేయలేం. కావున మనదేశంలో ఉత్పత్తులు తగ్గిం చుకోవాలి. ఫలితంగా ఉన్న ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యో గిత పెరుగుతుంది. ప్రజల ఉత్పాదక తగ్గి ఆదాయాలు పడిపోయి ఆదాయ అసమానతలు పెరిగిపోతాయి. మ్యాను ఫ్యాక్చరింగ్ రంగం కుదేలవుతుంది. 2023లో చైనా మన దేశం నుండే ఎక్కువగా వస్తువులు దిగమతి చేసుకోగా తర్వాత స్థానంలో అమెరికా ఉండేది.2024 డిసెంబర్ కల్లా భారత్ ఎక్కువగా అమెరికాకు వస్తువులు ఎగుమతిచేసి చైనా నుండి ఎక్కువగా దిగుమతి చేసుకోవడం జరిగింది. 2023 -24లో అమెరికాతో మనకువిదేశీ వాణిజ్యం మిగులు 36.8 బిలియన్ డాలర్లుగా ఉండేది. ఇంజినీరింగ్ వస్తువులు ఎలక్ట్రానిక్ వస్తువులు, రత్నాలు ఆభరణాలు,మందులు ఔష ధాలు ఎగుమతి జరిగేవి. నేడు అమెరికా అధ్యక్షుడు భారత్ పై కూడా సుంకాల విధించడంవలన భారత్ నుండి రొయ్య లపై సుంకం ఏకంగా మూడు నుంచి 26 శాతానికి పెంచి నారు. ఫలితంగా క్రాప్‌హాలిడే ప్రకటించాల్సి దుస్థితి ఏర్పడు తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్టీల్ ఎగుమ తులు దెబ్బతినడం ఖాయం. ముఖ్యంగా సూక్ష్మ చిన్న,మధ్య తరహా పరిశ్రమలలో తయారయ్యే గార్మెంట్స్ హ్యాండీక్రాఫ్ట్ ఎగుమతులు తగ్గిపోయి భారీస్థాయిలో నిరుద్యోగిత ఏర్ప డుతుంది. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ పరికరాలు ఎగుమతులు ఈ సుంకాలవలన గణనీయంగా తగ్గిపోతాయి.ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు ప్రధానంగా దెబ్బతింటాయి. ఇప్పటివరకు ఫార్మా క్యాపిటల్‌గా పేరుగాంచిన భారత్, ఆ పేరు కోల్పో వాల్సి వస్తుంది. పెంచిన సుంకాలు అమలులో కావడంతో ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు అన్ని పడిపో యాయి. 2008 తర్వాత ఇలా జరగడం మొదటిసారి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన పరస్పర సుంకాల ప్రభావం వంద దేశాలపైనే కాకుండావేల కోట్ల ఆదాయం ఉన్న సంపన్నులపైనా పడింది. రెసిప్రోకల్ టారిఫ్ కారణంగా అంతర్జాతీయ అనేక దేశాల మార్కెట్లతో పాటు అమెరికా మార్కెట్లలోనూ కుదుపులు ఏర్పడ్డాయి. దానివల్ల ప్రపంచ సంపన్నులు కూడా తమ సంపదలో భారీ నష్టాలను చూడక తప్పలేదు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, ప్రపంచంలోని 500 మంది అత్యంత సంపన్నులకు టారిఫ్ ప్రభావం వల్ల 208బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ఇది గడిచిన 13 ఏళ్లకాలంలోనే అత్యధిక నష్టమని బ్లూమ్‌బర్గ్ అభిప్రాయపడింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చేందుకు కృషిచేసిన టెస్లా అధినేత ఎలన్ మస్క్ సైతం ఈనష్టాన్ని ఎదుర్కొనక తప్పలేదు. ఆదాయ అసమానతలు పెరిగి సంపద కొంతమంది చేతుల్లోకిపోవడం వలన మిలియనీర్లో బిలినియర్లు కావచ్చుగాని, ట్రంపులాంటి పాలకుల వాణిజ్య విధానాలతో నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యం లోకిపోతున్నాయి.

# వక్ఫ్ సవరణ చట్టం ఎన్డీయే చారిత్రక విజయం!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** దేశవ్యాప్తంగా ఎంత నిరసనలు వెల్లువెత్తినా, విపక్షాలు గగ్గోలుపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2025 వక్ఫ్ సవరణ చట్టాన్ని విజయవంతంగా ప్రారంభించింది. ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపడం దానిని పక్కన పెట్టడానికి ఒక సూక్ష్మమైన మార్గం అని కొందరు ఊహించినప్పటికీ, భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) పార్లమెంటులో చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. అయితే, ఈ విజయాన్ని ఎలా అంచనా వేయాలి? ఈ చట్టం ఆర్టికల్ 370 మరియు 35 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం మరియు గత దశాబ్దంలో ప్రవేశపెట్టబడిన అనేక ఇతర సంస్కరణల కంటే చాలా ఎక్కువ మందిని మరియు సంస్థలను ప్రభావితం చేస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు. దురదృష్టవశాత్తు, 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం చివరి నెలల్లో సవరించబడిన వక్ఫ్ పర్యావరణ వ్యవస్థ, రాష్ట్రం యొక్క అధికారం మరియు ఆధిపత్యాన్ని సవాలు చేసి అంతర్లీనంగా చట్టపరమైన సమస్యను సృష్టించింది. ఈ కుతంత్రమైన చట్టపరమైన చట్టం వక్ఫ్ కోసం భూసేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది, ఇది 2013 నుండి దాని భూస్వాములు 21 లక్షల ఎకరాలు పెరగడానికి దారి




తీసింది. ఇది అంతర్లీన సమస్య కాబట్టి, ఇది ఎప్పుడూ ప్రధాన చర్చగా మారలేదు చాలా మంది ప్రజలు 2025 చట్టంలో ప్రవేశపెట్టిన సవరణల ప్రభావాన్ని విస్మరించారు. మొదట, కొత్త సవరణలు ముస్లిమేతరులపై వక్ఫ్ ప్రభావం ఎంతమాత్రం ఉండదు. 2013లో, వక్ఫ్‌కు నిర్వచనం ఉద్దేశ పూర్వకంగా 'ఏ వ్యక్తి అయినా'గా మార్చబడింది, తద్వారా 140 కోట్లకు పైగా జనాభా మొత్తం దీని పరిధిలోకి వచ్చింది. 2025 సవరణ దీనిని సరిదిద్దింది. ఇప్పుడు, ఆస్తికి నిజమైన యజమానిగా కాకుండా ఎవరైనా కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ప్రకటిస్తూ ఉండాలి. వక్ఫ్ బోర్డు ఇకపై ముస్లిమేతరులకు పీడకల కాదు. అయితే, మిలియన్ డాలర్ల ప్రశ్న మరోటి వస్తోంది. వివాదాస్పద సెక్షన్ 40 ఇక్కడే అమలులోకి వస్తుంది. 1995 వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 వక్ఫ్‌కు తమకు చెందినదని వారు విశ్వసించే ఏదైనా ఆస్తిని దర్యాప్తు చేయడానికి అధికారం ఇచ్చింది. గ్రామాలు, ప్రభుత్వ భవనాలు మరియు మెట్రోపాలిటన్ ప్రాంతాలలోని ప్రధాన ఆస్తులను కూడా క్లెయిమ్ చేసుకునేలా చేసింది.

2025 కొత్తచట్టం సవరణలు సెక్షన్ 40ని పూర్తిగా తొలగించాయి. కొత్త సవరణలద్వారా గణనీయంగా నిస్తేజం చేసిన మరోఅంశం 'వినియోగదారుడి ద్వారా వక్ఫ్' అనేభావన. 'వినియోగదారుడి ద్వారా వక్ఫ్' నిబంధనకు 1954 చట్టంలో చట్టపరమైన ఆమోదం లభించింది. సరళంగా చెప్పాలంటే, "వినియోగదారుడి ద్వారా వక్ఫ్' అనేది చరిత్రలో ఏదో ఒక సమయంలో మతపరమైన లేదా దాతృత్వ ప్రయోజనాల కోసం అంకితం చేయబడిందని వారు విశ్వసించే ఏదైనా భూమి లేదా ఆస్తిని ఎటువంటి దస్తావేజు లేదా డాక్యుమెంటేషన్ అవసరం లేకుండా క్లెయిమ్ చేయడానికి వక్ఫ్‌కు అనుమతి ఇచ్చింది. అందువల్ల, కాగితపుపత్రాలు లేకుండా మరియు కేవలం మౌఖిక అంకితభావం ద్వారా, వక్ఫ్‌బోర్డు 'వినియోగదారుడి ద్వారా వక్ఫ్' అనే ముసుగులో ఒక ఆస్తిని తనదిగా క్లెయిమ్ చేయవచ్చు. 2025 సవరణ ఈ అంశాన్ని తొలగించింది. వక్ఫ్ ఏ ప్రభుత్వ ఆస్తులను, గతాన్ని దృష్టిలో ఉంచుకుని కూడా క్లెయిమ్ చేయలేరు. కాగితపు పత్రాలు లేకుండా ఇప్పటికే క్లెయిమ్ చేయబడిన ఆస్తులకు, జవాబుదారీతనం కోసం సమయం ఆసన్నమైంది. 2025 సవరణలలోని ఒక నిబంధన ప్రకారం, చట్టం ప్రారంభానికి ముందు లేదా తేదీన 'రిజిస్టర్ చేయబడిన' ఆస్తులు మాత్రమే 'వినియోగదారుడి వక్ఫ్' ఆస్తులుగా అంగీకరించబడతాయి. 37 లక్షల ఎకరాల వక్ఫ్ భూమిలో, 22 లక్షల ఎకరాలు 'వినియోగదారుడి వక్ఫ్' కిందకు వస్తాయి దాదాపు 45 శాతం వక్ఫ్ ఆస్తులు సరైన కాగితపు పత్రాలతో ఈ రిజిస్ట్రేషన్ అవసరం చాలా మందికి అసంపూర్ణంగా ఉన్నాయి. 2013 సవరణలలో, 'ఆక్రమణదారు' అనే పదానికి నిర్వచనం ప్రభుత్వం చేర్చింది. అందువల్ల పాతకాలంలో వక్ఫ్ బోర్డు చెప్పిందే వేదంగా రాష్ట్రాల్లో నడిచింది. కొత్త చట్టంతో ఈపరిస్థితులకు బ్రేక్‌పడింది.

# రాచరిక వ్యవస్థవైపు కదులుతున్న నేపాల్!

**ఖాట్మండు, ఏప్రిల్ 9:** భారత్ పొరుగున్న ఉన్న హిమాలయ రాజ్యం నేపాల్ పురాతన దేవాలయాలు, పోరాట యోధులు, ఆకాశాన్ని తాకే శిఖరాలకు నిలయం. రాచరికాన్ని రద్దు చేసి ప్రజాస్వామ్యన్ని స్థాపించాక దేశం గాడిన పడుతుందని ఆ దేశ ప్రజలు భావించారు. అయితే ఏళ్ల తరబడి కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, అవినీతి, అమలుకాని హామీల కారణంగా హిమాలయ రాజ్యంలో ప్రజలు తిరిగి వీధుల్లోకి వచ్చారు. రాచరికాన్ని తిరిగి పునరుద్ధ రించడంతో పాటు హిందూరాజ్యంగా ప్రకటించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాదని రాచరికాన్ని నేపాల్ ప్రజలు పదేపదే కోరుకుంటున్నారు. మళ్లీ హిందూ రాజ్యంగా నేపాల్ రాజకీయ ప్రయాణం నాటకీయంగా సాగింది. 1769 నుంచి 2008 వరకు దాదాపు 240 ఏళ్ల పాటు షా రాజవంశీయులు నేపాల్‌ను పాలించారు. రాజు సర్వోన్నత అధికారిగా ఉంటూనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నెలకొనాలని 1990లో ప్రజాందోళన ఉద్యమం నడిచింది. అందుకు అప్పటిరాజు బీరేంద్ర అంగీకరించారు. అయితే 2001లో జరిగిన సంఘటన నేపాల్‌లో రాచరికం పోవడానికి కారణమైంది. బీరేంద్ర కుమారుడు దీపేంద్ర తన తండ్రి, తల్లితో పాటు సోదరులు, సోదరిమణులను హతమార్చారు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన తర్వాత బీరేంద్ర సోదరుడు జ్ఞానేంద్ర షా సింహాసనాన్ని





అధిష్టించారు. 2005లో జ్ఞానేంద్ర నిరంకుశంగా పార్లమెంటును రద్దుచేసి అధికారం చేజిక్కించుకోవడాన్ని నేపాలీలు నిరసించారు. దీంతో 2006లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. అనంతరం 2008లో రాచరికం రద్దయి లౌకిక, గణతంత్ర రాజ్యంగా నేపాల్ అవతరించింది.

**నిలకడలేని ప్రజా ప్రభుత్వాలు**

నేపాల్‌లో ప్రజాస్వామ్య స్థాపన జరిగినా అధికార మార్పిడి నిత్యకృత్యమయింది. దీంతో ప్రజల్లో ప్రస్తుతమున్న పార్టీలపై అసహనం మొదలైంది. రాజకీయ అస్థిరత, అవినీతి, ఆర్థిక వెతలను నిరసిస్తూ రోడ్డెక్కారు. రాచరికాన్ని పునరుద్ధరించాలంటూ నినదించారు. ప్రజల ఆందోళనలకు రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ సారథ్యం వహించింది. ప్రపంచంలో రాచరికం మనుగడలో ఉంది. యునైటెడ్ కింగ్‌డంలో రాచరికాన్ని మనంచూసాం. అధికారాలులేని రాచరికం మాకు కావాలి. బహుళ రాజకీయపార్టీల ప్రజాస్వామ్యంఉండాలి. అదిదేశాన్ని అభివృద్ధి, స్వేచ్ఛ వైపుగా తీసుకెళుతుంది. పశుపతి షమ్‌షేర్, ఆర్‌పీపీ నాయకుడు 2008 మే 28న నేపాల్‌లో రాచరికం రద్దయ్యాక 17ఏళ్లలో 13ప్రభుత్వాలు మారాయి. ఇటీవల ఖాట్మండూలోజరిగిన హింసాత్మక ఘటనల వెనక మాజీ రాజు జ్ఞానేంద్ర షా హస్తం ఉందని నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ ఆరోపించారు. ఆ ఘటనను తీవ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. స్వార్థ ప్రయో జనాల కోసం జ్ఞానేంద్ర షా ప్రజల మధ్య విభజన తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఆ ఘట నలో ఇద్దరు పౌరులు మృతిచెందగా, 77 మంది భద్రతా సిబ్బంది సహా 110మంది గాయపడ్డారు.

**మాజీ రాజుకు భద్రత కుదింపు**

కాఠ్‌మాండూలో హింసాత్మక ఘటన తర్వాత మాజీ రాజు జ్ఞానేంద్ర షా భద్రతను నేపాల్ ప్రభుత్వం కుదించింది. భద్రతా సిబ్బందిని 25 మంది నుంచి 16కు తగ్గించింది. కాఠ్‌మాండ్‌లో ప్రజా ఆస్తులను ధ్వంసం చేసిందుకు జ్ఞానేంద్ర షాకు ఆ నగర మున్సిపల్ అధికారులు 5వేల 900 డాలర్ల జరిమానా విధించారు. రాజరికమే బెస్ట్ రాజుల కాలంలో సుస్థిరతతో పాటు దేశం స్వయం సమృద్ధిగా ఉండేదని నిరసనకారులు అంటున్నారు. ప్రస్తుతం రాజకీయ అస్థిరతతో పాటు ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. మతం కూడా ప్రస్తుత ఆందోళనలకు మరో ముఖ్యకారణం. హిందూ రాజ్యంగా ఉన్న నేపాల్ 2008లో లౌకికదేశంగా అవతరించింది. ఫలితంగా తమ సాంస్కృతిక అస్థిత్వాన్ని కోల్పోయామని ఒకవర్గం ప్రజలుఆరోపిస్తున్నారు. నిరసనల్లో భాగంగా పురాతన రాచరిక జెండాలను ప్రదర్శిస్తూ రాజునుతిరిగి సింహాసనంపై కూర్చోబెట్టాలని నినాదాలు చేస్తున్నారు. రాజకీయ నాయకుల అవినీతితో విసుగెత్తిపోయినఅక్కడి ప్రజలు షారాజవంశీ యుల పాలనలో మెరుగైన పాలనఉంటుందని ఆశిస్తున్నారు.



## చైనాపై అమెరికా 104% ప్రతీకార సుంకాలు!

**బీజింగ్, ఏప్రిల్ 9:** అమెరికా, చైనామధ్య వాణిజ్య యుద్ధం తారాస్థాయికి చేరింది. డ్రాగన్‌పై భారీ స్థాయిలో సుంకాలతో అగ్రరాజ్యం విరుచుకు పడింది. చైనా వస్తువులపై టారిఫ్‌లను ట్రంప్ సర్కార్ 104 శాతానికి పెంచింది. ఏప్రిల్ 9 నుంచే ఇవి అమల్లోకి వస్తాయని శ్వేతసౌధం ఓ ప్రకటనలో వెల్లడించింది. తొలుత ట్రంప్ విధించిన 34 శాతం టారిఫ్‌లకు ప్రతీకారంగా చైనా 34 శాతం సుంకాలను ప్రకటించింది. అందుకు స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదనపు సుంకాల నిర్ణయాన్ని చైనా వెనక్కి తీసుకోవాలని లేదంటే ప్రతీకార సుంకాలను మరింత పెంచుతానని బెదిరించారు. ఇందుకు ధీటుగా స్పందించిన చైనా సొంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి అమెరికాను వ్యతిరేకంగా చివరి వరకు పోరాడతామని స్పష్టం చేసింది. ఈ ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే చైనాపై భారీగా ప్రతీకార సుంకాలను 50 శాతం పెంచింది. దీంతో చైనా వస్తువులపై విధించిన సుంకాలు 104 శాతానికిచేరాయి. వారంవ్యవధిలోనే చైనాపై సుంకాలు 10శాతం నుంచి 104 శాతానికి చేరుకున్నాయి. గతనెల వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకం విధించేది. ఏప్రిల్ 2న చైనాపై 34శాతంప్రతీకార సుంకాన్ని ప్రకటించడం వల్ల 44 శాతానికి చేరింది. కొద్దిసేపటి తర్వాత అదనంగా మరో 10 శాతం ప్రతీకార సుంకాలను వసూలు చేస్తున్నట్లు శ్వేత సౌధం ప్రకటనతో చైనా సుంకాలు 54 శాతానికి చేరుకున్నాయి. తాజాగా ప్రతీకార సుంకాలను అదనంగా మరో 50 శాతం విధించడం వల్ల చైనా వస్తువులపై టారిఫ్‌లు 104 శాతానికి ఎగబాకాయి. మరోవైపు, అమెరికా విధిస్తున్న సుంకాలపై చైనా ప్రీమియర్ లీ కియాంగ్ తీవ్రంగా స్పందించారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, తగిన విధంగా బదులిచ్చేందుకు తమ వద్ద విధానపరంగా అన్ని ఆయుధాలు ఉన్నాయని వెల్లడించారు.

ఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డర్‌లేయన్ ఫోన్ కాల్ సందర్భంగా లీ కియాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "సుంకాల పేరుతో అమెరికా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోంది. దీనిపై మేం చివరి వరకు పోరా డుతాం. ఎలాంటి అనిశ్చితులనైనా తట్టుకునేలా మా ఆర్థిక విధానాలను రూపొందించాం. వాణిజ్య భాగస్వాములందరిపై ట్రంప్ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు అమెరికా ఏకపక్షవాదం, రక్షణవాదం, ఆర్థికపరంగా బలవంతపు చర్యలను అద్దం పడుతున్నాయి. దీనికి మేం తప్పకుండా ప్రతిస్పందిస్తాం. సొంత ప్రయోజనాల కోసమే గాక అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను కాపాడేందుకు పోరాడుతాం" అని చైనా ప్రీమియర్ వెల్లడించారు.



## తోకలేని విమానం తెచ్చిన చైనా!

**బీజింగ్, ఏప్రిల్ 9:** చైనా రూపొందించిన ఒక యుద్ధవిమానం విడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఈ విమానానికి మూడు ఇంజిన్లతో పాటు తోకలేకపోవడం విశేషం. పశ్చిమదేశాలకు చెందిననిపుణులు దానిని ఆరోతరానికి చెందిన జె-36గా పేర్కొంటున్నారు. గతేడాది చివరిలో తొలిసారి జె36 ఫోటోలు ఇంటర్నెట్‌లో వచ్చాయి. తర్వాత ఈ ఏడాది మార్చిలో మరోసారి బయటకు వచ్చాయి.

ఈ విమానంలోచైనా ఇంజనీర్లు అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీని ఏవియానిక్స్, పవర్‌ప్లాంట్; ఎయిర్‌ఫ్రేమ్‌ను అమర్చినట్లు నిపుణులు చెపుతున్నారు. అంతే కాకుండా రెండు ఎయిర్ ఇన్‌టేక్స్‌తో ట్రైజెట్ ఇంజిన్‌ను అమర్చారని చెపుతున్నారు. దీనిలో ఆయుధాలను అంతర్గతంగా భద్రపరుచుకు నేందుకు ఏర్పాట్లుచేసారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను కూడా అమర్చే అవకాశాలున్నట్లు అమెరికా సైనిక నిపుణులు చెపుతున్నారు. ప్రస్తుతం అమెరికా వద్ద ఐదో తరానికి చెందిన రెండు ఇంజిన్ల ఎఫ్ 22, ఒక ఇంజిన్‌తో ఉన్న జె 35లు ఉన్నాయి. అయినా ఇంతవరకూ యుద్ధరంగంలోకి రాలేదు.

# డికె మార్పు అనివార్యం అయితే ఈశ్వర్ ఖండ్రేకు పిసిసి!

**బెంగళూరు, ఏప్రిల్ 9:** డీకే మార్పు అనివార్యమైతే.. కొత్త సారథి ఈయనేనట కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) కొత్త సారథి నియామకం త్వరలోనే జరగనుందనే వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ డికె శివకుమార్ మార్పు అనివార్యమైతే ఆయన స్థానంలో మంత్రి ఈశ్వర్ ఖండ్రెకు అవకాశం దక్కనుందని అభిప్రాయాలు జోరందుకున్నాయి. డికె మార్పు అనివార్యమైతే.. కొత్త సారథి ఈయనేనట. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డికె శివకుమార్ మార్పు అనివార్యమైతే సీనియర్ నేత, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు అవకాశం దక్కనుందని అభిప్రాయాలు జోరందుకున్నాయి. పార్టీ అధిష్ఠానం కూడా ఆచితూచి వ్యవహరిస్తోంది. డికె శివకుమార్ కెపిసిసి అధ్యక్షుడిగా నాలుగేళ్లు కొనసాగారు. రెండో విడత కొనసాగించే అవకాశం లేదని తెలుస్తోంది. అయితే కొంతకాలం జాప్యం జరిగే అవకాశాలు ఉండ వచ్చు నని పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం డీకే శివకుమార్ కెపిసిసి అధ్యక్ష పదవితోపాటు ఉపముఖ్య మంత్రి, బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి, జలవనరులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఒకరికి ఇన్ని పదవులు సమంజసం కాదని పార్టీ



వర్గాలలో తీవ్ర వ్యతిరేకత ఉంది. అయితే అధ్యక్ష పదవి చేపట్టాక పార్టీ ప్రగతికి ఆయన చేసిన సేవలను అధిష్ఠానం గుర్తించింది. ఒక పర్యాయం పూర్తి కాకుండా తొలగించడం సాధ్యం కాదని పలు సందర్భాలలో అగ్రనేతలు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీలో అంతా సమైక్యమని అనుకుంటున్నా సిఎం, డిసిఎం డీకే శివకుమార్‌ల గ్రూపులు తారస్థాయిలో కొనసాగుతున్నాయి. ఇటీవలే ఢిల్లీ వెళ్లిన సమయంలో ఈ ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది. అధిష్ఠానం వద్ద పలువురి పేర్లు ఉన్నా ఈశ్వర్ ఖండ్రెవైపు మొగ్గ చూపుతున్నట్లు తెలుస్తోంది. అందుకు పలు కారణాలు ఉన్నాయి. పార్టీలో సీనియర్‌గా ఉన్నా మంత్రిగా కొనసాగుతున్నా ఎక్కడా వివాదాలకు గురి కాలేదు. పైగా రెండు గ్రూపులకు తటస్థంగా ఉన్నారు. రెండు గ్రూపుల వారితోనూ సత్సంబంధాలు కొనసాగిస్తుండడంపై అధిష్ఠానం సానుకూలత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఈశ్వర్‌ఖండ్రె ఢిల్లీలో కుమారుడు, బీదర్ లోక్‌సభ సభ్యుడు సాగర్‌ఖండ్రెతో కలసి పార్టీ అగ్రనేత కెసి వేణుగోపాల్‌ను భేటీ అయ్యారు. ఇద్దరూ సుదీర్ఘ సమయంపాటు వారు చర్చించుకోవడం అనుమానాలకు తావి స్తోంది. ఈశ్వర్‌ఖండ్రెను కెపిసిసి అధ్యక్ష పదవికి ఎంపిక చేసేందుకు అధిష్ఠానం పలు అంచనాలు వేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో జనాభా కల్గిన వీరశైవలింగాయత్ సమాజానికి చెందినవారు కావడం, సామా జికవర్గంలో పట్టు ఉండడం, అఖిలభారత వీరశైవమహాసభ కార్యాధ్యక్షులుగా ఉండడం పార్టీకి క్రమశిక్షణ కల్గినవారు కావడం, వివాదాలు లేని వారుకావడం, పార్టీలో అనుభవం ఉండడం, ఇప్పటికే కెపిసిసి ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడుగా కొనసాగడం, కార్యకర్తలు నాయకులతో మంచి సంబంధాలు కలిగి ఉండడం కారణలుగా ఉన్నాయి. ఆయన తండ్రి భీమణ్ణ ఖండ్రెకు మంచి పేరుఉండడం వంటివి సానుకూలతలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.

## విక్టరీ పెరేడ్‌కు రావాలని మోడీకి పుతిన్ ఆహ్వానం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి మరోసారి ఆహ్వానం అందింది. మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోడీకి క్రెమ్లిన్ ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆండ్రీ రుడెంకో వెల్లడించారు. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా మే 9న రష్యా విక్టరీ డే పరేడ్ నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తన మిత్రదేశాలకు ఆహ్వానం పంపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోడీకి కూడా ఆహ్వానం పంపింది. విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోడీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు ఆండ్రీ రుడెంకో తెలిపారు.

కాగా, గతేడాది జూలైలో ప్రధాని మోడీ రష్యా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించారు. గత పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాది



మిర్ పుతిన్‌ను భారత్ సందర్శించాలని ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ కూడా అంగీకరించారు. అయితే, తేదీలు మాత్రం ఇంకా ఖరారు కాలేదు. 'పుతిన్ భారత పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి. మోడీఆహ్వానాన్ని ఆయన అంగీకరించారు. గతేడాది మోడీ మాస్కోలో పర్యటించారు.. ఇప్పుడు మా వంతు' అని రష్యా రాయబార కార్యాలయం గత నెల వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక పుతిన్, మోడీలు తరచూ ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారు. వివిధ అంశాలపై సంభాషించుకుంటున్నారు. అంతేకాదు పలు అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతున్నారు.

# 64 యేళ్లతర్వాత అహ్మదాబాద్‌లో ఎఐసిసి భేటీ!

**అహ్మదాబాద్, ఏప్రిల్ 9:** ప్రధాని మోడీ పాలనతో దేశంలో ఏ వర్గం సంతోషంగా లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జై రాం రమేశ్ విమర్శించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా రెండు రోజుల పాటు జరుగుతోన్న ఎఐసిసి సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సమావేశంలో పార్టీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి జై రాం రమేశ్ మాట్లాడుతూ.. సమర్పణ్, సందర్ష్ నినాదంతో న్యాయ్ పథ్ పేరుతో ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు ఆయన వివరించారు. న్యాయ పథం (న్యాయ్ పథ్) గా పోరాటం, గుజరాత్‌లో కాంగ్రెస్ ఎందుకు అనే రెండు అంశాలపై చర్చించి.. తీర్మానం చేశామన్నారు. ఇండియా కూటమి భవిష్యత్తులో ఎలా పోరాడాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. అలాగే దేశంలో రైతాంగం పలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుందని తెలిపారు. ఇక విద్య, వైద్య రంగాల్లో ఎన్నో సమస్యలున్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అభివృద్ధి శూన్యమని ఆయన పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో పోలిస్తే.. కేరళ, తమిళనాడు, కర్ణాటకలు మెరుగైన ఫలితాలు ఇస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి జై రాం రమేశ్ సోదాహరణగా వివరించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా రెండు రోజులు పాటు ఎఐసిసి విస్తృత స్థాయి సమావేశాలను కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దాదాపు 64 ఏళ్ల అనంతరం ఆ పార్టీ అహ్మదాబాద్ వేదికగా ఈ సభ నిర్వహించిందని ఈ సందర్భంగా ఆ పార్టీ అగ్రనేతలు స్పష్టం చేశారు. ఏప్రిల్ 8,9 తేదీల్లో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, ఆ పార్టీ సీనియర్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీతోపాటు పలువురు కీలక నేతలు హాజరయ్యారు. ఈ సమావేశాలకు దాదాపు 1200 మందికి పైగా ఎఐసిసి సభ్యులు హాజరయ్యారు. ఇక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులకు ఫుల్ పవర్స్ ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఎంపికలో సైతం వారిదే కీలక భాద్యత తీసుకోనున్నారు. ఎఐసిసి నిర్ణయమని ఈ సందర్భంగా మల్లిఖార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. ఇక గతేడాది జరిగిన మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమిని చవి చూసింది. అయితే భవిష్యత్తులో జరగనున్న వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ.. ప్రజల్లోకి ఎలా చొచ్చుకెళ్లాలనే అంశంపై చర్చించారు. ఈ ఏడాది 2025 చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది అంటే 2026లో అసోం, తమిళనాడు, కేరళతోపాటు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఏడాది అంటే 2027లో పంజాబ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2028లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక 2029లో లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిశా, ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గుజరాత్‌లో బీజేపీని ఓటమి పాలు చేయడం



ద్వారా కాంగ్రెస్ పార్టీని ఆ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకు రావడం కోసం ప్రయత్నాలు చేపట్టాలని ఈ సమావేశాల సాక్షిగా నిర్ణయం తీసుకున్నట్లు సుస్పష్టమవుతోంది. గుజరాత్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ద్వారా.. ఢిల్లీ పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు ఆ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని.. ఈ సమావేశంలో పార్టీ నేతల వ్యవహార శైలిని బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## బెంగాల్‌లో వక్ఫ్‌చట్టం అమలు చేయబోం: సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కత్తా, ఏప్రిల్ 9:** బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అన్ని వర్గాల మైనారిటీలతోపాటు వారి ఆస్తులను రక్షిస్తానని హామీ ఇచ్చారు. రాజకీయం కోసం కొందరు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తారని, వాటిని వినవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కోల్‌కతాలో జైన సమాజం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, కీలక వ్యాఖ్యలు చేశారు. "వక్ఫ్ చట్టం అమలు కారణంగా మీరు బాధపడుతున్నారని నాకు తెలుసు. నమ్మకంగా ఉండండి. అందరూ కలిసి ఉంటామని సందేశం ఇవ్వండి. విభజించు పాలించు అనేది జరగదు. వక్ఫ్ అమలు చేయడం కన్నా ముందు బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతుందో చూడండి. అందుకే వక్ఫ్ చట్టం అమలు చేయబోం "అని మమత అన్నారు.

మనవారికి రక్షణ కల్పించడం మా పని "బెంగాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారతదేశం అన్నీ కలిసి ఉన్నాయని చరిత్ర చెబుతోంది. విభజన తరువాత వారు ఇక్కడ నివసిస్తున్నారు. వారిని రక్షణ కల్పించడం మా పని. మనం జీవించు, జీవించనివ్వు అనే సందేశాన్ని ఇవ్వాలి. ఎవరైనా మిమ్మల్ని రాజకీయంగా సమావేశమవ్వమని రెచ్చగొడితే, దయచేసి అలా చేయవద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దీదీ మిమ్మల్ని, మీ ఆస్తిని రక్షిస్తుందని దయచేసి గుర్తుంచుకోండి. మనం కలిసిఉంటే, ప్రపంచాన్ని జయించగలం" అని దీదీ తెలిపారు. "అందరూ ఐక్యంగా ఉందాం. ఐక్యత నుంచి నన్ను ఎవరూ వేరు చేయలేరు. ప్రతి మతం, కులం మానవత్వం కోసమే ప్రార్థిస్థాయి. దుర్గా పూజ, కాళీ పూజ, జైన, బౌద్ధ దేవాలయాలు, గురుద్వారా, చర్చి, గురు రవిదాస్ ఆలయానికి నేను వెళ్తాను. రాజస్థాన్‌లో అజ్మీర్ షరీఫ్‌తో పాటు పుష్కర్‌లోని బ్రహ్మ ఆలయాన్ని కూడా సందర్శించాను" అని ఆమె గుర్తు చేశారు.

ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్‌సవరణ చట్టం, 2025 మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చట్టం అమల్లోకి తీసుకొస్తున్నట్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు చట్టంగా మారింది.



గేటు తెరవకపోవడంతో జల్‌పల్లిలోని మంచు మోహన్‌బాబు ఫాంహౌస్ నివాసం ముందు బుధవారం బైఠాయించిన మంచు మనోజ్

# మంచు కుటుంబంలో మళ్లీ ప్రకంపనలు

## ఈ సారి కారు దొంతనంపై రచ్చకెక్కిన వివాదాలు

## ఇంట్లోకి రానివ్వకపోవడంతో గేటు ముందు మనోజ్ బైఠాయింపు

## సోదరుడు విష్ణుపై పహాడీషరీఫ్ పిఎస్‌లో ఫిర్యాదు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబంలో చెలరేగిన వివాదాల ప్రకంపనలు ఇప్పట్లో ఆగే సూచనలు కనబడడం లేదు. తాజాగా కారు విషయమై మంచు ఫ్యామిలీలో రగడ మొదలైంది. నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కారు చోరీకి సంబంధించి మనోజ్ డ్రైవర్ ఫిర్యాదు చేయగా ఏకంగా మనోజ్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధి కిందకు వచ్చే మంచు టౌన్‌షిప్‌లోని మోహన్‌బాబు నివాసం ముందు బైఠాయించి ఆందోళన చేయడం కలకలం రేపింది. ఊహించినట్లే మనోజ్ తన తండ్రి మోహన్‌బాబుకు సంబంధించిన జల్‌పల్లి ఫాంహౌస్ నివాసానికి రాగా అక్కడ గేటు తెరవకపోవడంతో ఆగ్రహించిన ఆయన అక్కడే బైఠాయించారు. భారీ సంఖ్యలో మోహరించిన పహాడీషరీఫ్ పోలీసులు అక్కడి పరిస్థితిని సమీక్షించారు. తన సోదరుడు మంచు విష్ణు జల్‌పల్లిలోని నివాసంలోకి పెద్ద సంఖ్యలో అనుచరులతో వచ్చి తమకు సంబంధించిన కార్లను టోయింగ్ వాహనంతో ఎత్తుకెళ్ళి రోడ్డుపై వదిలేశారనీ అంతే కాకుండా తమ వస్తువులను, సామగ్రిని ధ్వంసం చేశాడని ఆరోపించారు.

తన కారును సైతం దొంగిలించి విష్ణు తన ఇంటికి తీసుకెళ్లాడని మనోజ్ ఆరోపించారు. ఆస్తుల కోసం గొడవ కాదనీ ఆత్మగౌరవ సమస్య అవుతున్నదని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. గత కొన్ని నెలలుగా గొడవలు జరిగి తాను అన్యాయానికి గురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మనోజ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన వద్ద ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయని ఆయన పేర్కొంటున్నారు. అయితే తాజాగా జరిగిన పరిణామాలపై పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మనోజ్ ఫిర్యాదు చేశారు.



బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

# ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

## లేదంటే ప్రభుత్వాన్ని స్తంభింపచేస్తాం: ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికి ప్రభుత్వం ఇంత వరకు 14 లక్షల ఎస్సీ,ఎస్టీ,బిసి విద్యార్థుల ఫీజుల బకాయిలను చెల్లించకపోవడం దారుణమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అగ్రహాం వ్యక్తం చేశారు. తక్షణమే ఫీజుల బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని, అసెంబ్లీని ముట్టడిస్తామని, ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బిసిసంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వైపు వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని, మరొక వైపుకళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వడంలేదని, విద్యార్థులు పరీక్షలు రాస్తామా? లేదా? అనే సందిగ్ధంలో పడి తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిసిసంఘం నాయకులుసి.రాజేందర్‌ముదిరాజ్, రాందేవ్, మణి కంఠ, కట్టె లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో అన్నను మట్టు పెట్టిన తమ్ముడు

**వాజేడు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మద్యం మత్తులో అన్నను మట్టుపెట్టిన తమ్ముడు సంఘటన ములుగుజిల్లా వాజేడు మండలం కొత్తటేకులగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి వాసం బుల్లబ్బాయి తన అన్న వాసం విజయబాబు(30)తో ఘర్షణ పడి పదునైన ఆయుధంతో దాడి చేయగా నుదుటి పైన, ఎడవైపు కన్నుపై మూడుచోట్ల పొడవుగా గాయాలు కావడంతో తీవ్ర రక్త స్రావం జరిగి ఆపస్మారక స్థితిలోకి వెళ్ళగా కుటుంబ సభ్యులు 108కికాల్ చేయగా వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మరణించినట్లు నిర్ధారించి వెళ్లిపోయారు. మృతుని చిన్న తమ్ముడు వాసం రాజేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాపురం సిఐ బండారుకుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**హత్య కేసులో బిగ్ ట్విస్ట్:** మంగళవారం రాత్రి టేకులగూడెంలో జరిగిన హత్య కేసులో బుధవారం సాయంత్రం పెద్ద ట్విస్ట్ జరిగింది. మృతుడని తమ బంధువులు చంపారని భూతగాదాల వల్లనే



విజయబాబు(ఫైల్)

చంపారని ఆరోపించిన కొద్ది గంటలలో తర్వాత తన చిన్నన్న వాసం పుల్లబ్బాయి తన పెద్దన్న వాసం విజయ బాబుని హత్య చేసినట్లు వాసం రాజేంద్ర ప్రసాద్ పేరూరు పోలీస్ స్టేషన్ కివెళ్లిఫిర్యాదు చేశాడు.

**24 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు :** హత్య జరిగిన 24 గంటల్లోనే పేరూరు పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేసును చేదించారు. వెంకటాపురం సిఐ బండారు కుమార్, పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ తమ సిబ్బందితో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి కేసును చేదించారు. మృతుడు విజయ్ బాబు సౌమ్యుడిగా పేరు ఉండడంతో శత్రువులు ఉండరని గ్రహించిన పోలీసులు అనుమానం రాకుండా గ్రామంలో అన్ని కోణాలలో పరిశీలించి హత్యచేసిన వాసం బుల్ల బ్బాయిని అరెస్ట్ చేశారు.

# విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి

## ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ వేడుకలు



బుధవారం గాంధీభవన్‌లో జరిగిన ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ వేడుకల దృశ్యం

**హైదరాబాద్ ఏప్రిల్ 9,ప్రభాతవార్త:**విద్యార్థులు లౌకిక భావాలు అలవర్చుకొని శాస్త్రీయంగా ఆలోచించాలని అలౌకిక అంశాల పునాదులపై దేశాన్ని నిర్మించలేమని డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యుఐ 55వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం గాంధీభవన్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. గాంధీభవన్‌లో డిసిసి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి ఎన్ఎస్‌యుఐ జెండా ఎగరవేశారు. అనంతరం కేక్‌కట్ చేయడం జరిగింది. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కమిటీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడగా సుమారు వెయ్యిమందికిపైగా రక్తం దానంచేశారు. ఈరక్తదానం శిబిరంలో నేషనల్ లీగల్ కమిటీ మెంబర్ అక్బర్ మరియు రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్ రాష్ట్ర ఇంచార్జ ఫిరోజ్ ఖాన్ జాతీయ లీగల్ సెల్ మెంబర్ అక్బర్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితేష్ రావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచనా రెడ్డి, శ్రీరామ్ యాదవ్, వర్ధన్ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి కరుణాకర్, రాకేష్ మరియు జాయింట్ సెక్రెటరీ సుమన్, ఎన్ఎస్ఐ రాష్ట్ర జిల్లా నాయకులు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం జరిగింది. దేశంలో మత చాందస భావాలు పెరిగిపోతున్నాయని రోహిన్‌రెడ్డి అన్నారు.

# భూ కుంభకోణాల వెనుక ఉన్నది బిఆర్ఎస్, కాంగ్రెస్ పెద్దలే

## ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్



**హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:**భూకుంభకోణాల వెనుక ఉన్నవి బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల పెద్దలేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ, బిజెపి కాంగ్రెస్ కలిసి హైదరాబాద్‌లో భూకుంభకోణాలపై నిజాలు బయటపెడతానని చెప్పారు.కానీ వాస్తవానికి ఆ కుంభకోణాల వెనుక ఉన్నది వాళ్లే అన్నారు. తమపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మళ్లించేందుకే కెటిఆర్ బిజెపిని బద్నాం చేసేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఎక్కడ వాళ్ల మధ్య ఉన్న అవినీతి, కుంభకోణాల వ్యవహారాల్లో సంబంధాలన్నీ బయటపడతాయేమోననే భయంతో ఆ ఆరోపణల నుంచి పక్కదారి పట్టించేందుకే కెటిఆర్ మాట్లాడారని అన్నారు. గతంలో పిసిసి చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఆగ్రహంగా మాట్లాడారు. కానీ ఇప్పుడు మాత్రం ఏ మాట్లాడటం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని, అధికారంలోకి వచ్చాక ఆ డబ్బు రికవరీ చేస్తామన్నారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం జరిగిన అవినీతి, స్కాంల విషయంలో ఏ కేసు రిజిస్టర్ కాలేదు. ఏ నాయకుడు అరెస్ట్ కాలేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంతో మిలాఖత్ అయి గతంలో జరిగిన అవినీతి బయటపడకుండా రాజకీయాలు చేస్తుందన్నారు. ధరణి పోర్టల్ ద్వారా బిఆర్ఎస్ నేతలు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు, రైతుల భూములను తమ పేర్లకు మార్చుకున్నారని రేవంత్‌రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవినీతి బయటపెడతామని చెప్పినా ఒక్క ఎకరం కూడా తిరిగి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తూ బిజెపిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. హెచ్‌సియు భూముల విషయంలోనూ ఇదే కుతంత్రం జరిగిందన్నారు. గతంలో బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు విలువైన భూములను అమ్ముతున్నాయి. భారతీయ జనతా పార్టీ బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై గళమెత్తిందన్నారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను తాకట్టుపెట్టి రాష్ట్రాన్ని అంధకారంలో నెడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎండగట్టిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో భూముల అమ్మకాలపై కూడా పోరాటం చేస్తుందన్నారు. హెచ్‌సియు భూములను ఈరోజు కాపాడగలిగామంటే అది విద్యార్థులు, మేధావులు, తెలంగాణ ప్రజల అండతోనే. కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీకి వ్యతిరేకంగా బిజెపి నిక్కచ్చిగా పోరాటం చేస్తున్నదని అన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీవంటి వారు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారే. ఇప్పుడు వారిని రక్షించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఎంఐఎంను గెలిపించేందుకు కాంగ్రెస్ మజ్లిస్ చేతులు కలిపాయని అన్నారు. తెలంగాణ ప్రజలు బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నారని, కాంగ్రెస్‌కు ఇచ్చిన 60 నెలల సమయంలో 15 నెలల పాలన పూర్తయింది. ప్రజలకు మేలు చేయాలని భావించాలి. కాని బిజెపిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తే అది మీమూర్ఖత్వమే. తెలంగాణలో రానున్న రోజుల్లో బిజెపి అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయన్నారు.

# ఇప్పటికే తెలంగాణలో అడుగుపెట్టాం,నిన్ను సాగనంపడమే మిగిలింది

## సిఎం రేవంత్ వ్యాఖ్యలకు బిజెపి ఎంపీ రఘునందన్‌రావు కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏపిల్9:** తెలంగాణలో బిజెపిని అడుగుపెట్టనిచ్చేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బిజెపి ఎంపి రఘునందన్‌రావు స్పందించారు. ఇప్పటికే తాముతెలంగాణలో అడుగుపెట్టామని,ఇక మిగిలింది తమరిని సాగనంపడమేనని అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే ఎనిమిది ఎంపి స్థానాలలో,ఎనిమిది అసెంబ్లీ స్థానాలలో పాగా వేశామన్నారు. ఎంపి ఎన్నికలలో రేవంత్ స్వంత జిల్లా మహబూబ్‌నగర్ సీటును, రేవంత్ ఇన్ ఛార్జీగా వ్యవహరించిన చేవేళ్ల స్థానాన్ని, గతంలో రేవంత్ ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి లోక్ సభ సీటు కూడా బిజెపి కైవసం చేసుకుందని గుర్తు చేశారు. సాక్షాత్తు బిఆర్ఎస్‌అధినేత, అప్పటి ముఖ్య మంత్రి కెసిఆర్‌ను కామారెడ్డిలో సాగనంపింది తామేనన్నారు. ఇక తెలంగాణకు కాంగ్రెస్‌పార్టీ తరుపున రేవంత్‌ఆఖరి ముఖ్యమంత్రిగా మిగిలిపోనున్నారనిఅన్నారు.వచ్చేఎన్నికలలో అధికారంలోకి వచ్చేది తామేనని జోస్యం చెప్పారు.

# అఖిల భారత పోలీస్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏడు పతకాలు సాధించిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఇటీవల జరిగిన అఖిల భారత పోలీసు స్పోర్ట్స్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్ర పోలీసు విభాగం ఏడు పతకాలు సాధించింది. ఇందులో వ్యక్తిగత విభాగంలో ఒక రజత పతకం, టీం ఈవెంట్ మహిళల విభాగంలో మూడు రజత పతకాలు, టీం ఈవెంట్ పురుషుల విభాగంలో మూడు కాంస్య పతకాలు రాష్ట్ర పోలీసు క్రీడాకారులు సాధించారు. కాగా అఖిల భారత పోలీసు స్పోర్ట్స్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను డిజిపి జితేందర్ బుధవారం నాడు తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. వారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రీడల విభాగం ఐజి రమేష్‌తో పాటు డిఎస్‌పి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్‌ల కేసుల విచారణపై సమావేశమైన సిట్ బృందం

## దర్యాప్తు వేగవంతం చేసేందుకు ఎస్‌ఓపి ఏర్పాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌ల కేసుల విచారణకు సర్కారు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) బుధవారం భేటీ అయ్యింది. ఐజి రమేష్ రెడ్డి నేతృత్వంలోని అధికారుల బృందం డిజిపి కార్యాలయంలో భేటీ అవగా ఈ సందర్భంగా బెట్టింగ్‌యాప్‌ల కేసుల విచారణకు సంబంధించి అనేక నిర్ణయాలు తీసుకుంది. బెట్టింగ్ యాప్‌ల కేసుల విచారణ వేగంగా సాగేందుకు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్ (ఎస్‌ఓపి)ని ఏర్పాటు చేయాలని సిట్ నిర్ణయించింది. త్వరలో ఇది ఏర్పాటు కానుంది. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులు ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్‌లో నమోదవడం తెలిసిందే. ఈ కేసుల్లో సినీ ప్రముఖులతో పాటు టివి నటులు, సెలబ్రిటీలు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయంజర్లు వుండడంవిదితమే. ఇందులో కొందరిని పోలీసులు ఇప్పటికే విచారణ చేయగా మలిదఫా విచారణకు సిద్ధమవుతున్న తరుణంలో సర్కారు సిట్‌ను ఏర్పాటు చేసింది. కాగా ఈ కేసుల విచారణకు కావాలసిన న్యాయ సహాయం అందించేందుకు న్యాయ నిపుణులను సిట్ ప్రత్యేకంగా నియమించుకోవాలని భావిస్తోంది. చట్టపరంగాఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, బల హీనపడకుండా వుండేందుకు సిట్ ఈ నిర్ణయం తీసుకుందని తెలిసింది.

# 12వ తేదీ వరకు బిజెపి వ్యవస్థాపక దినోత్సవాలు: కాసం వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 12 వరకు పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో గావ్‌ఛలో - బస్తీఛలో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామన్నారు. ఈ మూడు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, బస్తీల్లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి పదాధికారులు, మాజీ ఎంపిలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు భాగస్వాములవుతారని తెలిపారు. ప్రతి గ్రామంలో పార్టీ పరంగా ఐదు ముఖ్యమైన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. గ్రామాలు, బస్తీల సందర్శన, హాస్పిటల్, దేవాలయం/పాఠశాల వంటి ప్రదేశాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులలో కనీసం 10 మందిని కలవడం, పార్టీ జెండాలతో ఊరేగింపు కార్యక్రమాలు చేపడతామన్నారు. అదేవిధంగా గ్రామంలో చిన్న స్థాయి సభ నిర్వహించి ఈ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద స్థాయిలో ఉద్యమాలను చేపట్టేలా సన్నాహాలు జరుగుతాయని, ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేలా ప్రజలందరూ సహకరించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర నాయకులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని జాతీయస్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు.

# సిఎం వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం: కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** బ్రిటీషర్ల కంటే బిజెపి ప్రమాదకరమంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. జాతీయవాద సిద్ధాంతాలు, నిలువెల్లా దేశభక్తిని పుణికిపుచ్చుకున్న పార్టీ భారతీయ జనతా పార్టీని దేశాన్ని దోచుకున్న బ్రిటీషర్లతో పోల్చడం సిగ్గు చేటు అంటూ మండిపడ్డారు. అవకాశవాద రాజకీయాలకు, అవినీతి పాలనకు నిలువెత్తు రూపం కాంగ్రెస్ పార్టీ. కరోనా కంటే ప్రమాదకరమైన పార్టీ కాంగ్రెస్ అన్నారు. తెలంగాణలో బిజెపిని అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకుంటామంటూ రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతరించిపోతున్న జాతిలాంటిదన్నారు. బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఎంతటి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందో 15 నెలల కాంగ్రెస్ పాలనలో అంతకు రెట్టింపు వ్యతిరేకతను మూటగట్టుకున్న విషయాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోయారా? అంటూ ప్రశ్నించారు. తన సొంతజిల్లా మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించలేకపోయారని, సిట్టింగ్ సీటైన మల్కాజ్‌గిరి స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయారన్నారు. అక్కడ సైతం బిజెపి గెలిచింది. స్వయంగా పోటీ చేసిన కామారెడ్డిలో బిజెపి చేతిలో ఓడిపోయి మూడో స్థానానికి పడిపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓడిపోయారన్నారు. ఎంపి ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 50 శాతానికిపైగా ప్రాతినిధ్యం బిజెపి కలిగి ఉందనే విషయాన్ని విస్మరించవద్దన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ చేసే అభ్యర్థులే కరవయ్యారు. దిక్కులేక హైదరాబాద్‌ను మజ్లిస్ చేతిలో పెట్టేందుకు సిద్ధమైన మీరు బిజెపికంచుకోటైన గుజరాత్‌కు వెళ్లి తెలంగాణలో బిజెపి అడ్డుకునే శక్తిఉందనడం ఈ శతాబ్దపు పెద్దజోక్ అన్నారు. కాంగ్రెస్‌కు అంటిన బురదను తుడుచుకోలేని వారు దేశం మొత్తాన్ని క్లీన్ చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రిజర్వేషన్ల ముసుగులో మతవిద్వేషాలు రెచ్చగొట్టేది, మత రాజకీయాలు చేసేది కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలేనన్న సంగతి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. మీరెన్ని డ్రామా లాడినా తెలంగాణలో అధికారం రావడం పక్కా. మిగిలిన కర్నాటక,హిమాచల్‌ప్రదేశ్ అధికారం కోల్పోకుండా చూసుకుంటే బెటర్ అన్నారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం

## వక్ఫ్‌బోర్డు పేరిట బడా నేతలు, ముతావల్లీలు ఆస్తులను కబ్జాచేస్తే చట్టపరంగా చర్యలు: మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు పేరిట బడా నేతలు, మతావల్లీలు ఆస్తులను కబ్జా చేశారో వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ టైగర్ ఆలే నరేంద్ర వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులర్పిస్తున్నాం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశం, ధర్మం, డెవలప్‌మెంట్ అంశాలతో పరిపాలన అందిస్తున్నామన్నారు. దేశంలో అత్యధిక కుటుంబాలు జీవిస్తున్నది ఎంఎస్ఎంఈ సెక్టార్‌పై ఆధారపడే ఈ రంగమే జిడిపిలో ప్రధానపాత్ర పోషిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు మెన్నుముకలాంటిది ఎంఎస్ఎంఈ సెక్టార్ అన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో భాగంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా ముద్ర లోన్లను ప్రవేశపెట్టారన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వంలో 52 కోట్ల మంది చిన్న పారిశ్రామికవేత్తలకు రూ. 32 లక్షల కోట్లు సెబీ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడంతో కోట్లాది మంది ఉపాధి పొందడంతో పాటు మరికొంత మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగారన్నారు. ఈ రుణాల్లో 55 మేర ఓబిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు లబ్ధి చేకూరిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 71 సంవత్సరాల పాలనలో ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూసిందని, మోడీ మాత్రం శక్తీకరణ చేస్తున్నారన్నారు. ముద్రలోన్ల ద్వారా 2231 మైనారిటీ వర్గాలు లబ్ధి పొందాయి. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం వర్గాల్లో విశ్వాసాన్ని పెంపొందించారు. ప్రతిపక్షాలు పార్లమెంటులో విఘాతం కలిగించేందుకు యత్నించినా, పస్మందా వర్గాలు, ముస్లిం మహిళలు మోదీకి మద్దతు పలికి నీరాజనం పలికారన్నారు.

# దేశవ్యాప్తంగా కులగణ చేపట్టాలి

## ప్రధాని, ఆర్ఎస్ఎస్ కులగణకు వ్యతిరేకం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**హైదరాబాద్,ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని , దీనిపై పార్లమెంటులో బిల్లు తేవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన సిడబ్ల్యుసి సమావేశంలో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే వెంటనే తమ ఆమోదం తెలిపుతామని చెప్పారు. తెలంగాణలో కులగణనతో విప్లవాత్మక అడుగు వేశామని మేం దేశంలోకి అధికారంలోకి వచ్చాక కులగణన చేసి అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు లభించేలా నిర్ణయాలు తీసుకొంటామని చెప్పారు. దేశ జనాబాలో 90శాతం మంది జనాభాకు సరైన ప్రాతినిధ్యంలేదని ఆవేదన చెందారు. సామాజికంగా ఆర్థికంగా బలవంతులు కొంత మంది మాత్రమే అణగారిణకులాల అవకాశాలను ఇతరులు లాగేసుకుంటున్నారని రాహుల్ అన్నారు. కులగణనతో దేశంలో దళితులు, గిరిజనులు, ఒబిసి సంఖ్య తేలుతుందని అప్పుడే సహజవనరులు వారికి దక్కుతాయని అన్నారు. తెలంగాణలో కులగణ చేసిన కొద్ది నెలల ముందు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రధానిమంత్రి నరేంద్ర మోదీని పార్లమెంటులో అడిగాను. గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల వారికి దక్కాల్సిన నిజమైన వాటా దక్కుతోందా అనేది తెలుసుకోవాలని అనుకుంటున్నట్టు చెప్పారు. ప్రధాని, ఆర్ఎస్ఎస్ చాలా స్పష్టంగా కులగణనను వ్యతిరేకిస్తున్నాయని అన్నారు.

మైనారిటీలకు దక్కుతున్న వాటా ఎంతో వెల్లడించేందుకు వారికి ఎంతమాత్రం ఇష్టం లేకపోవడమే ఇందుకు కారణం అని తెలిపారు. పార్లమెంటులో వారికి చాలా స్పష్టంగా కూడా చెప్పాను. కులగణన బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే ఇప్పటికిప్పుడు తామంతా ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశాను అని రాహుల్ అన్నారు.

# రూ.6.50లక్షల విలువైన గంజాయి పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త :** ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీమ్‌లు నగరంలో నాలుగు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి రూ.6.50లక్షల విలువ చేసే 12.78 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ముసారాంబాగ్ ప్రాంతంలోని పీవీఆర్ సినిమా కాంప్లెక్స్, మెట్రోపేట్ స్టేషన్ సమీపంలో ఏపీ నుంచి గంజాయిని తీసుక వస్తున్నారనే సమాచారం మేరకు హైదరాబాద్ ఎన్ ఫోర్స్ మెంట్ టీమ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. విశాఖ గాజువాక ప్రాంతం నుంచి షేక్ సాహెబ్‌ఖాన్ అనే వ్యక్తి 9.012 కేజీల గంజాయిని తీసుకు వచ్చాడు.నగరంలో నివాసం ఉంటూ పలు ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలను జరుపుతున్న మహ్మమద్ అలీకి గంజాయి అందిస్తున్న సమయంలో ఇద్దరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సభ్యులు అరెస్టు చేసి నిందితుల వద్ద ఉన్న 9.012 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను కూడ స్వాధీనం చేసుకున్నారు.గాజువాకకు చెందిన ఈ ఇద్దరు వ్యక్తులు ఒకరి గంజాయిని తీసుక వస్తే.. మరొక అమ్మకాలు జరుపుతుంటారు. గంజాయిని అరకులో తక్కువ ధరలకు తీసుకవచ్చి హైదరాబాద్ ఎక్కువ ధరల కు అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు.పట్టుబడిన ఇద్దరు నిందితులను, గంజాయిని మల్కాజ్‌కపేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.అమీర్‌పేట్‌లో గుంటూరు జిల్లా బాపట్ల ప్రాంతానికి చెందిన చుక్కా అనంద్‌బాబు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ఎస్ జిఎఫ్ సి టీమ్ సీఐ వెంకట్, ఎస్సై శివ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. నిందితుడిని, గంజాయిని అమీర్‌పేట్ ఎక్సైజ్‌స్టేషన్‌లో అప్పగించారు. సికింద్రాబాద్‌రూరల్ జీఆర్‌పీ షేర్‌లింగంపల్లి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఏపీ రంగారెడ్డి ఎన్ ఫోర్స్ టీమ్ 1.06 గంజాయిని కనిమర్ల సాయి ప్రవీణ్ వ్యక్తి వద స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. ఇదే టీమ్ మరో 1.113 కేజీల గంజాయిని అదిల్ పాషా స్వాధీనం చేసుకున్నారు.వీరిద్దరు మహారాష్ట్ర నుంచి గంజాయిని దిగుమతి చేసుకొని హైదరాబాద్‌లో అమ్మకాలు జరుపుతారని అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపారు.

# ఉన్నత విద్యామండలి ముట్టడికి యత్నించిన వర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్

## అక్రమ అరెస్టులు సరికాదు: టిజియుసిటిఏ జేఏసీ

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త :** సమస్యల పరిష్కారంలో భాగంగా ఉన్నత విద్యామండలి ముట్టడి కార్యక్రమానికి వస్తున్న రాష్ట్రంలోని 12 యూనివర్శిటీల్లో పని చేస్తున్న తెలంగాణ స్టేట్ యూనివర్శిటీస్ కాంట్రాక్టు టీచర్స్‌ను (టిజియుసిటిఏ జేఏసీ)ఎక్కడిక్కడే అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని జేఏసీ నాయకులు పరుశురామ్,ధర్మతేజ,ఉపేందర్‌లు ఒక ప్రకటనలో ఖండించారు.ఉద్యోగ భద్రత కల్పించకుండా జీవో నెం 21 తీసుకు రావడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమన్నారు. ప్రజాపాలనలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రిన్సిపాళ్ళను,అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేయడం దుర్మార్గమని వారు దుయ్యబట్టారు.ప్రశ్నించే గొంతుకలు ఉండాలని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి తమ డిమాండ్ల నెరవేర్చాలని కోరితే ఇటువంటి అరెస్టులకు పాల్పడటం మంచిది కాదని వారు హితవు పలికారు.గత ప్రభుత్వంలో జూనియర్ లెక్చరర్‌లను, డిగ్రి లెక్చరర్‌లను రెగ్యులర్ చేసిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఇతర రాష్ట్రాలలో యూనివర్శిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేసినప్పుడు అడ్డురాని నిబంధనలు మన రాష్ట్రంలోనే ఎందుకు వస్తున్నాయని వారు ప్రశ్నిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డిని కావాలనే కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యంగా నిరనస తెలియజేసేందుకు వచ్చిన తమను ఈ విధంగా అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఎన్ని నిర్భందాలు చేసినా మా ఉద్యమం ఆగదన్నారు.

## రోనాల్డ్‌రాస్‌కు క్యాట్‌లో ఊరట

### తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్9:** సీనియర్ ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రాస్‌కు క్యాట్(కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ )లో ఊరట లభించింది. ఆయనను తెలంగాణకు కేటాయించాలంటూ డీఓపీటీని క్యాట్ బుధవారం ఆదేశించింది. ప్రస్తుతం ఆయన ఏపీలో విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఐఏఎస్ అధికారి శివశంకర్ క్యాట్‌లో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఏపీకి కేటాయించాలంటూ క్యాట్ ఆదేశాలు జారీ చేసినా డీఓపీటీ అమలు చేయలేదంటూ ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. శివశంకర్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ క్యాట్ శివశంకర్‌ను ఏపీకి కేటాయించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను 4 వారాల్లోగా అమలు చేయాలని స్పష్టం చేసింది. కొంత గడువు ఇవ్వాలని డీఓపీటీ తరఫు న్యాయవాది కోరినప్పటికీ దాన్ని పరిగణనలోకి తీసుకోని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ 4 వారాల్లో అమలు చేయాలంటూ నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా అఖిల భారత సర్వీసు అధికారులను ఏపీ, తెలంగాణకు కేటాయిస్తూ డీఓపీటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కొంత మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు క్యాట్ ను ఆశ్రయించారు. తమ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోకుండా డీఓపీటీ కేటాయింపులు చేసిందని పిటిషన్లలో కోరారు. ఏపీ నుంచి తెలంగాణకు కేటాయించాలని కొంతమంది అధికారులు కోరగా తెలంగాణ నుంచి ఏపీకి కేటాయించాలని మరికొంత మంది అధికారులు కోరారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తి మేరకు క్యాట్ ఆదేశాలు జారీ చేసింది. సుదీర్ఘ వాదనల తర్వాత అఖిల భారత సర్వీసు అధికారుల వినతులను మరోసారి పరిగణలోకి తీసుకొని కేటాయింపులు చేయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో అధికారులు మరోసారి డీఓపీటీకి విజ్ఞప్తి చేశారు. స్థానికత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని తాము కోరుకున్న రాష్ట్రంలో కేటాయించాలని కోరారు.కానీ డీఓపీటీ మాత్రం ఈ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర విభజన సందర్భంగా చేసిన కేటాయింపుల ఆధారంగానే కొనసాగాలని మరోసారి ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో రోనాల్డ్ రోస్ తెలంగాణ నుంచి ఏపీకి, శివశంకర్ ఏపీ నుంచి తెలంగాణకు వచ్చి విధుల్లో చేరారు. విధుల్లో చేరినప్పటికీ డీఓపీటీ ఉత్తర్వులను క్యాట్‌లో మరోసారి సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ వారు కోరుకున్న రాష్ట్రాల్లో కేటాయించాలని డీఓపీటీని ఆదేశించింది.

## పేదల కోసం పని చేసిన మహనీయుడు చంద్ర రాజేశ్వరరావు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 ,ప్రభాతవార్త :**పెద్ద భూస్వామ్య కుటుంబంలో పుట్టి కూడా కమ్యూనిస్టు పార్టీలో చేరి పేద ప్రజల కోసం పనిచేసిన మహనీయుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి అన్నారు. సిపిఐజాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వర రావు 31వ వర్ధంతి బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దం భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా చాడా వెంకటరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ మార్క్స్ లెనిన్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై ఏఐఎస్ఎఫ్‌లో చేరారన్నారు. విశాఖ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేసి ఎర్రజెండా చేత పట్టి బ్రిటిష్ వలస పాలనను, సామంతుల అంతానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, శంకర్ నాయక్, చందు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలకు పాల్పడిన భార్యభర్తలు

**హైదరాబాద్ (హయత్‌నగర్),ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** భార్య, భర్తల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి ఘర్షణతో క్షనికావేశానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకోగా మరుసటి రోజు మనస్థాపంతో భర్త భవనం పైనుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం. హయత్ నగర్ డివిజన్ ముదిరాజ్ కాలనీలో నివాసముండే సంపంగి శిరీష, నా గేష్‌లకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి 11నెలల బాబు కలడు. ఇరువురు స్వచ్ఛ ఆటోలతో చెత్త సేకరిస్తుంటారు. రెండు రోజుల క్రిౌత ఇరువురు గొడవ పడ్డారు. ఈ క్రమంలో శిరీష(20) ఈ నెల 8న ఉదయం 11 గంటలకు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మరణానికి అల్లుడు, అతని కూటుంబ సభ్యులు కారణమని శిరీష తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నాగేష్‌ను అదే రోజు విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిచారు. రాత్రి 10 గంటలకు నగేష్ కుటుంబ సభ్యుల ష్యూరిటీపై విడుదల చేయడం జరిగింది. ఇదిలా ఉండగా భార్య మరణంతో మనస్థాపానికి గురైన నాగేష్ మరుసటి రోజు ఉదయం 5.30గంటల సమయంలో హయత్‌నగర్‌లోని రిలయన్స్ డిజిటల్ భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య, భర్తల అంత్యక్రియలు ఒకేసారి జరపారు. ఇద్దరి మరణంతో చిన్నారి బాలుడు ఆనాదగా మిగిలిపోయాడు.

## ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

**హైదరాబాద్ (అల్వాల్),ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న ముగ్గురిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. బెట్టింగ్‌కు సంబంధించి ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్‌లో చెప్పులు దుకాణం నడుపుతున్న కచ్వా నవరతన్, సీతాఫల్ మండీలో స్వీటు దుకాణం యజమాని అజిత్‌సింగ్, బేగంబజార్‌కు చెందిన నిఖిల్ సాంఖ్లాలు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు బెట్టింగ్‌కు సంబంధించి విషయం తెలిసింది. స్థానిక పోలీసులు సహకారంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న 2.45వేలు రూపాయలు ఫ్రీజ్ చేయడంతో పాటుగా మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## భారత వాహిణి యాప్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 9 ,ప్రభాతవార్త :**భారత వాహిణి మొబైల్ యాప్‌ను కేంద్ర హోమ్ శాఖ సహాయశాఖ మంత్రి బండి సంజయ్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఆధునిక సమాజంలోని యువతీ యువకులకు సనాతన ధర్మంలోని ఎన్నో సూక్ష్మ విషయాలను వివరణాత్మకంగా అందిచేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. ఈ యాప్ హిందూ బంధువులందరు సనాతన ధర్మాన్ని గురించి తెలుకు నేందుకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం భా రతి సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్. శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... సనాతన హిందూ సంప్రదాయంలో భాగమై ఈ ఆధునిక సమాజానికి తెలియని, 50 మందికి పైగా భారతీయ ఋషి శాస్త్రవేత్తల చరిత్రలతో పాటు,భగవద్గీత 18 అధ్యాయాలు, వాల్మీకి రామాయణం 7 కాండలు, మహాభారతం 18 పర్వాలు మరియు అష్టాదశ పురాణాలు, హిందూ దేవీ దేవతల స్తోత్రాలు ఈ "భారత వాహిణి" మొబైల్ యాప్" లో అందుబాటులో ఉన్నట్లుగా తెలిపారు. అంతే కాకుండా అ యాఫ్‌కి పైగా, యోగాసనాల వివరణ , ప్రాక్టీస్ వీడియోలు, అనేక వ్యాధుల నివారణకు ఉపయోగపడే ఆయుర్వేద చిట్కాలు ఈ "భారత వాహిణి మొబైల్ యాప్" లో పొందు పరచినట్లుగా తెలిపారు. ఈ యాప్ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళ భాషలలో ఈ"భారత వాహిణిమొబైల్ యాప్ అందుబాటులో ఉందన్నారు. ఈ యాప్‌నుగూగుల్ ప్లే స్టోర్ నుండి ఇన్ స్టాల్ చేసుకోవచ్చన్నారు.

## జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో వాయిదాలపర్వం

**జమ్మూ:** వక్ఫ్ బిల్లుపై చర్చ చేపట్టాలని జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మూడు రోజులగా వాయిదాల పర్వం నడుస్తోంది. అయితే ఇవాళ కొందరు ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణంలో ఘర్షణ పడ్డారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. అసెంబ్లీలో లోపల ఆప్ ఎమ్మెల్యే మెహరాజ్ మాలిక్, పీడీపీ ఎమ్మెల్యే వహీద్ పారా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండు వర్గాలుగా మారిన ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకున్నారు. గత రెండు రోజుల నుంచి కూడా అసెంబ్లీని స్పీకర్ అబ్దుల్ రహీమ్ వాయిదా వేశారు. ఇవాళ కూడా అధికార నేషనల్ కాన్ఫరెన్స్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లిన నినాదాలు చేపట్టారు.

## కెసిఆర్‌ది సాగు భాష. రేవంత్ రెడ్డిది చావు భాష

### 27న బీఆర్ఎస్ పార్టీ వరంగల్ సభను విజయవంతం చేయండి: హరీష్‌రావు



బుధవారం పటాన్‌చెరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**పటాన్ చెరు,ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ది సాగు భాష అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది చావు భాష అని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. బుధవారం పటాన్ భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి మొక్కులో భాగంగా ఆదర్శ్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ తరపున పటాన్ చెరు నియోజకవర్గం కో ఆర్డినేటర్ గా నియమించిన సందర్భంగా బీరంగూడ స్వగృహం నుండి రుద్రారం గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవాలయం వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు, సింధు ఆదర్శ్ రెడ్డిలతో కలిసి సిద్ధి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదల స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తున్నదని అన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో నీళ్ళేవో అర్థం అయిపోయిందని చెప్పారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవు అన్నది ప్రజలకు అర్థమయిపోయిందని అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. పార్టీ కొరకు కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం లభించే విధంగా ఆ బాధ్యత నేను తీసుకుంటాను, కష్టపడ్డ ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుందని తెలిపారు. ఏప్రిల్ 27 వరంగల్ మీటింగ్ ను విజయవంతం చేయాలని, పటాన్ చెరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు కదిలి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదన చారి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

## కేశరావును కలిసిన ఉద్యోగ సంఘాల జెఎసి

**హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జేఏసి పని చేస్తుందని జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం ప్రభుత్వ సలహాదారుల కేశవరావు, జిఏడీ కార్యదర్శి రఘునందన్‌లు కలిసి ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 37 డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. జేఏసీ వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన కేశవరావు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే నిర్వహించనున్న క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యలను సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం పరిష్కరించేలా ప్రయత్నం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంతకు ముందు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కార్యాలయంలో బుధవారం జేఏసీ చైర్మన్



వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై వివిద ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీకలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీపీయూఎస్ ప్రెసిడెంట్ హన్మంత్ రావు, తెలంగాణ ఎంప్లా యిస్ యూనియన్ ప్రెసిడెంట్ దర్శన్ గౌడ్, టీఈఏ ప్రెసిడెంట్ డా.జి.నిర్మల పాల్గొన్నారు.

## సొంతమైదానంలో చెలరేగిన గుజరాత్ టైటాన్స్

### 58పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ఓటమి



**అమ్మదాబాద్, ఏప్రిల్ 9:** ఐపిఎల్ 2025లో 23వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ సునాయాసంగా విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌పై 58 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన నిర్ణీత 20 ఓవర్లలో 217 పరుగులుచేసి ప్రత్యర్థికి 218 పరుగుల టారెగట్ ఇచ్చింది. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. గుజరాత్ జట్టుకు వరుసగా ఇది నాలుగో విజయం కావడంతో జట్టు సంబరాల్లో మునిగిపోయింది. దీనితో ముందుగా గుజరాత్ టైటాన్స్ టేబుల్‌టాపర్‌గా నిలిచింది. నాలుగు మ్యాచ్‌ల్లో గుజరాత్ ఆరుపాయింట్లతో ఉంటే ఈ మ్యాచ్‌గెలిచి టేబుల్‌టాపర్‌గానిలిచింది. రాజస్థాన్ రాయల్స్ 4 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లు సాధించగా సంజుసామ్‌సన్‌కెప్టెన్సీలోని జట్టు గడచిన రెండుమ్యాచ్‌ల్లో విజయం సాధించి నాలుగుపాయింట్లు సాధించింది. మంచుప్రభావం ఉంటుందన్న కారణంతోకెప్టెన్‌స ంజూశాంసన్ బౌలింగ్‌నిర్ణయించాడు. ఇకగుజరాత్ ఇన్ని ంగ్స్ లో సాయిసుదర్శన్ 53 బంతుల్లో 8 ఫోర్లు, మూడు సిక్స్‌రలతో 82 పరుగులుచేసి అద్భుతం సృష్టించాడు.

మరోవైపు జోస్‌బట్లర్ 36 పరుగులతో ఆకట్టుకున్నాడు. షారుఖ్‌ఖాన్ 20 బంతుల్లో 36 పరుగులుచేయగా రాహుల్ తేవాటియా చివరిలో 12 బంతుల్లో24 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రషీద్‌ఖాన్ 4బ ంతుల్లో 12 పరుగులుచేసాడు. మొత్తంగా గుజరాత్ టాప్ ఆర్డర్, బిడిలార్డర్ బ్యాటర్లు మంచి ప్రదర్శనతో మ్యాచ్‌సులువుగా గెలిచింది. ఇక బౌలింగ్‌పరంగా రాజస్థాన్ బౌలర్ తుషార్ దేశ్‌పాండే 4 ఓవర్లలో 53 పరుగులిచ్చి 2 వికెట్లుతసాడు. మహీశ్ తీక్షణ కూడా 54పరుగులు ఇచ్చి రెండు వికెట్లుతీసారు. జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్‌తీసి కట్టుదట్టింగా బౌలింగ్‌చేసాడు.

సందీప్‌శర్మకు ఒక వికెట్ దక్కింది. రాజస్థాన్ బౌలింగ్ విభాగం ఎక్కువ విసిరిన వౌడ్‌బాల్‌లకు17 వైడ్స్‌సహా మొత్తం 18 ఎక్స్‌ట్రాలవరకూ ఉన్నాయి. ఆరార్‌పరిస్థితిని చూస్తే గుజరాత్‌కు బాగా కలిసివచ్చింది.

## పార్టీ నిర్మాణంపై రాహుల్‌గాంధీ ఫోకస్ పెంచారు: డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్9:** పార్టీ నిర్మాణంపై రాహుల్‌గాంధీ ఫోకస్ పెంచారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో బుధవారం నిర్వహించిన ఎఐసిసి సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కులగణనను రాహుల్‌గాంధీ ప్రస్తావించడం సంతోషకరమన్నారు. సంపద అందరికీ సమానంగా పంచాలని కాంగ్రెస్ అభిమతం అని చెప్పారు. దండి సత్యాగ్రహ స్ఫూర్తితోనే కాంగ్రెస్ జనంలోకి వెళ్తుందని, సబర్మతి ఒడ్డు నుంచి మరొక్కసారి ఈ దేశానికి సందేశం ఇవ్వాలనే న్యాయ్‌పథ్ ఈ ప్లీనరీలో తీసుకోవడం జరిగిందన్నారు.

# వేసవి వేడికి అల్లాడుతున్న ప్రజానీకం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** దేశవ్యాప్తంగా ఎండలు దంచికొ డుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే భారీగా నమోదవుతున్నాయి. భానుడి భగభగలకు జనాలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలను మంగళవారం వేడిగాలులు వణికించాయి. దేశరాజధాని ఢిల్లీ సహా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌లోని బార్మర్‌లో దేశంలోనే అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడ మంగళవారం 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైటనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది సాధారణం కంటే 7.6 డిగ్రీలు ఎక్కువ అని పేర్కొంది. బార్మర్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జైసల్మేర్‌లో 45 డిగ్రీల సెల్సియస్, చిత్తోర్‌గఢ్‌లో 44.5 డిగ్రీల సెల్సియస్, బికనీర్‌లో 44.4 డిగ్రీల సెల్సియస్, గంగానగర్‌లో 44.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా



ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 7 నుంచి 9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ అని ఐఎండీ తెలిపింది. ఇక దేశరాజధాని ఢిల్లీలోని ప్రాథమిక వాతావరణ కేంద్రం సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధానిలో ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం సఫ్దర్‌జంగ్‌లో ఉష్ణోగ్రతలు 40.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు ఐఎండీ పేర్కొంది. ఇది సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువ. గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్ర దేశ్ రాష్ట్రాల్లోని మొత్తం 27 స్టేషన్లలో 43 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. వాటిలో కనీసం 19 స్టేషన్లలో వేడిగాలులు నుండి తీవ్రమైన వేడిగాలులు నమోదైనట్లు పేర్కొంది. మరోవైపు గుజరాత్‌లోని సురేంద్ర నగర్‌లో 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజ్‌కోట్‌లో 44 డిగ్రీల సెల్సియస్, అమ్రేలిలో 43.8 డిగ్రీల సెల్సియస్, మహువ, కాండ్లాలో 43.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహువలో సాధారణం కంటే 8.3 డిగ్రీలు ఎక్కువ అని ఐఎండీ పేర్కొంది. మహారాష్ట్రలోని అకోలాలో 44.1 డిగ్రీల సెల్సియస్, నందూర్‌బార్‌లో 43.5 డిగ్రీల సెల్సియస్, జల్గావ్‌లో 43.3 డిగ్రీల సెల్సియస్, అమరావతిలో 43 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని గుణ, రత్లామ్‌లలో ఉష్ణోగ్రతలు వరుసగా 43.4, 43.2 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఏప్రిల్ 10, 11 తేదీల్లో గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేడిగాలుల పరిస్థితుల నుంచి ఉపశమనం లభించొచ్చని ఐఎండీ అంచనా వేసింది.

## కొత్త ఆర్థికంలో తొలి సారి రూ.2 వేల కోట్ల రుణం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం 2వేల కోట్ల రూపాయల మేర రుణం సేకరించింది. రిజర్వ్‌బ్యాంక్ నేతృత్వంలో బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ రుణాన్ని సమకూర్చుకుంది. ఇందుకుగాను 6.87 శాతం వార్షిక వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణం 2 వేల కోట్ల రూపాయల్లో 22 ఏళ్ల కాల పరిమితితో 1000 కోట్ల రూపాయలు, అలాగే 6.87శాతం వార్షిక వడ్డీ కింద 30 ఏళ్ల కాల పరిమితితో మరో 1000 కోట్ల రూపాయల చొప్పున ఈరుణాన్ని తీసుకుంది. బహిరంగ మార్కెట్ పాటు, అన్ని మార్గాల ద్వారా 69,639 కోట్ల రూపాయల మేర రుణాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రవేశ పెట్టిన 2025-26 వార్షిక అంచన బడ్జెట్‌లో పేర్కొంది.

## మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు

### రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సారెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేసి 2,500 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు కొనుగోలు కేంద్రాలను అధికారులు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులు, పౌల్ట్రీ నిర్వాహకులు గ్రామాల్లో తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా రైతులు దోపిడీకి గురవుతూ నష్టపోతున్నారనీ చెప్పారు.

## వాణిజ్య శాఖకు రూ.75 వేల కోట్ల ఆదాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** వాణిజ్య పన్నుల శాఖ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరింది. గత 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 75,149 కోట్ల రూపాయల చొప్పున ఆదాయం వచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం కంటే ఈ సారి దాదాపుగా 5 వేల కోట్ల రూపాయలు ఎక్కువగా వచ్చినట్లుగా వెల్లడించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం 2023-24లో జీఎస్టీ ద్వారా రూ.39,295 కోట్ల ఆదాయం రాగా, 2024-25లో అది రూ. 42,468కోట్లకు భారీగా పెరుగుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించి ఒక్క జీఎస్టీ ద్వారానే దాదాపుగా 3,173 కోట్ల రూపాయల మేర ఆదాయం పెరిగినట్లు అధికారిక వర్గాలు వెల్లడించిన లెక్కల ద్వారా స్పష్టమవుతున్నది.

## దేశ వ్యాప్తంగా బొగ్గు అధికారులకు ఒకే యూనిఫాం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు, ఆఫీసర్లకు ఒకే రకమైన డ్రెస్ కోడ్ అమలు కానుంది. బొగ్గు గనిలో పని చేస్తున్న కార్మికుడి నుంచి ఛైర్మన్ వరకు ఒకే రకమైన దుస్తులు వేసుకునేలా చర్యలు చేపట్టాలని కోలిండియా నిర్ణయించింది. కోలిండియా, సింగరేణి తదితర సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ఒకే రకమైన వేతనాలు, ప్రయోజనాలు పొందుతున్నారు. అదే విధంగా డ్రెస్ కోడ్ కూడా ఒకే రకంగా ఉండాలని కోలిండియా స్థాయి ప్రత్యేక కమిటీ భావించింది. పురుషులకు నేవీ బ్లూ ప్యాంట్, స్కైబ్లూ షర్ట్, మహిళా సిబ్బందికి మెరూన్ కలర్ కుర్తా, బ్లాక్ కలర్ సల్వార్, దుపట్టా లేదంటే మెరూన్ బ్యాక్‌గ్రౌండ్ శారీ, బ్లాక్ కలర్ బ్లౌజ్ ధరించాలని తెలిపింది. దీంతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు డ్రెస్ కోడ్ కూడా అమలు చేయనున్నారు. ప్రత్యేక కమిటీ సూచించిన రంగులో దుస్తులను కొనుగోలు చేసుకునే చాన్స్ ఉద్యోగులకు కల్పించింది. కాగా కోలిండియాలో కాం ట్రాక్ట్ కార్మికులతో కలిపి మొత్తంగా 3,69,000 ఉద్యోగులు, ఆఫీసర్లు పనిచేస్తుండగా, సింగరేణిలో సుమారు 44వేల మంది ఉద్యోగులు, ఆఫీసర్లు, మరో 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ డ్రెస్ కోడ్ అమల్లోకి రానుంది.

## రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు పెరగాలి

### రంగారెడ్డి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 3 గ్రామాలు

### రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** తెలంగాణలో ఉద్యాన పంటల సాగుకు సంబంధించిన విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా యాచారం మండలానికి చెందిన మూడు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షపాతం, నీటి వనరులు తక్కువగా ఉంటాయని అందుకోసం నీటి వినియోగం తక్కువగా ఉన్న పంటల సాగుచేయాలని సూచించారు. దానికి తగ్గట్టుగా అధికారులు రైతులకు దిశానిర్దేశం చేయాలన్నారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా కూరగాయలు ఆకుకూరలు పండ్లు పూలతోటల సాగు విస్తీర్ణం పెంచే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధంచేయాలని ఆదేశించారు. ఉద్యాన వన పంటలకు రాయితీలపై యంత్ర పరికరాలు, డ్రిప్ పరికరాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి పైలట్ ప్రాజెక్టు యాచారం మండలంలోని గడ్డమల్లయ్య గూడెం, మొండి గౌరెల్లి, చౌదరి గూడ గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో కూరగాయలు, ఆకు కూరలు పండించే రైతులకు ప్రభుత్వం నుండి ఏ సహాయం అందించాలనేదాన్ని గుర్తించామన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు కమిషన్ ఆధ్వర్యంలో ఒకటిరెండు రోజుల్లో అధికారుల కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ కమిటీ రంగారెడ్డి జిల్లాలో యాచారం మండలంలోని మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు విజయవంతం చేయడానికి పనిచేయనుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గంగాధర్‌తో పాటు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## బిజెపి కార్యాలయంలో టైగర్ నరేంద్ర వర్ధంతి

### ఘనంగా నివాళులు అర్పించిన నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో టైగర్ నరేంద్ర 11వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరేంద్ర చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించారు. బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, మాజీ శాసనసభ్యుడు సైదిరెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలెభాస్కర్, రాష్ట్రప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## డి.శ్రీనివాస్‌కు నివాళులర్పించిన సిడబ్ల్యూసి

**హైదరాబాద్,ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరుగుతున్న ఏఐసీసీ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులుగా వివిధ హోదలలో పనిచేసి స్వర్గస్తులయిన పలువురు నాయకులకు సభ నివాళులు అర్పించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన డి. శ్రీనివాస్, నర్సారెడ్డి,ఏఐసీసీ సభ్యులుగా పని చేసిన ఇంద్రసేనారెడ్డి, టి.నాగయ్యలకు సభలో సంతాపం ప్రకటించి నివాళులు అర్పించారు. మల్లికార్జున అధ్యక్షత సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సూక్విందర్ సింగ్ సుక్కు, ఏసీసీ నాయకులు మనిక్కమ్ ఠాకూర్ తదితరులు పాల్గొని నివాళ్ళు అర్పించారు .

# ప్రతిష్టాత్మక అవార్డు రేసులో శ్రేయస్



**న్యూఢిల్లీ:** ప్లేయర్ ఆఫ్ ద మంత్ (మార్చి, 2025) నామినీస్ పేర్లను ఐసీసీ ప్రకటించింది. పురుషుల విభాగానికి సంబంధించి ఈ అవార్డు రేసులో జేకబ్ డఫీ (న్యూజిలాండ్), రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్) శ్రేయస్ అయ్యర్ (భారత్) ఉన్నారు. అలాగే మహిళల విభాగంలో ఈ అవార్డు కోసం చేతన ప్రసాద్ (యూఎస్ఏ), జార్జియా వాల్ (ఆస్ట్రేలియా), అన్నాబెల్ సదర్ ల్యాండ్ (ఆస్ట్రేలియా) పోటీ పడుతున్నారు. న్యూజిలాండ్ పేసర్ జేకబ్ డఫీ మార్చిలో పాకిస్తాన్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో విశేషంగా రాణించాడు. రెండు 4 వికెట్ల ప్రదర్శనలు సహా 13 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. కివీస్ స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర ఛాంపియన్స్ ట్రోఫీలో 3 వన్డేలు ఆడి 50.33 సగటున 151 పరుగులు చేశాడు.

అలాగే 4.66 ఎకానమీ రేట్‌తో 3 వికెట్లు తీశాడు. ఈ టోర్నీ సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై 108 పరుగులు చేశాడు. ఇక శ్రేయస్ ఆ నెలలో ఆడిన 3 మ్యాచ్‌ల్లో 57.33 సగటుతో 172 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో 79 పరుగులు చేసిన అతడు, సెమీస్‌లో ఆసిస్‌పై 45, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 48 పరుగులు చేశాడు.



### ఐసిసి మహిళ వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో..

## ఐర్లాండ్‌పై పాక్ విజయం

**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్-2025 టోర్నమెంట్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఈ మ్యాచ్‌లు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ రోజు రెండు మ్యాచ్‌లు జరగ్గా, తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై పాకిస్థాన్, వెస్టిండీస్‌పై స్కాట్లాండ్ విజయాలు సాధించాయి. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఛేదనలో చేతులెత్తేసిన ఐర్లాండ్ 44 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా పాకిస్థాన్ 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్‌లో పటిష్టమైన వెస్టిండీస్‌పై స్కాట్లాండ్ సంచలన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 45 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌట్ కాగా, వెస్టిండీస్ 46.2 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌట్ అయి లక్ష్యానికి 12 పరుగుల దూరంలో నిలిచిపోయింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ అజేయ శతకంతో (114 పరుగులు) వీరోచితంగా పోరాడినప్పటికీ విండీస్ గెలుపు సాధించలేకపోయింది. గత వరల్డ్ కప్‌లో (2022) సెమీస్ వరకూ చేరిన వెస్టిండీస్ ఈసారి వరల్డ్ కప్‌కు (2025) నేరుగా అర్హత సాధించలేకపోగా, క్వాలిఫయర్స్‌లోనూ పరాభవాన్ని ఎదుర్కొంది.

# 'ఐపిఎల్'లో ఫాస్టెస్ట్ సెంచరీ



### టాప్ 5లో అగ్రస్థానంలో క్రిస్ గేల్

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటే బ్యాటర్ల ఆధిపత్యం చెలాయించే టీ20 క్రికెట్ అనేది తెలిసిందే. ప్రతి సంవత్సరం అనేక రికార్డులు నమోదవుతుంటాయి. కొన్ని బద్దలవుతుంటాయి. ఈ క్రమంలో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. 2013లో పూణే వారియర్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన సమయంలో క్రిస్ గేల్ 30 బంతుల్లో సెంచరీ చేసిన సెంచరీ ఇప్పటికీ ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీగా నిలిచింది. ఈ ఇన్నింగ్స్ అత్యంత వేగవంతమైనది మాత్రమే కాదు, టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచింది. ఆ మ్యాచ్‌లో గేల్ 175 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇది కూడా ఓ రికార్డు. ఇక గేల్ తర్వాత, యూసుఫ్ పఠాన్ పేరు నిలిచింది. పఠాన్ 2010లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నప్పుడు ముంబై ఇండియన్స్‌పై 37 బంతుల్లో సెంచరీ చేశాడు. పఠాన్ చేసిన ఈ సెంచరీ భారత బ్యాట్స్‌మన్ చేసిన వేగవంతమైన సెంచరీలో మొదటి కావడం విశేషం. అలాగే 2013లో కింగ్స్ 11 పంజాబ్ తరపున ఆడిన డేవిడ్ మిల్లర్ 38 బంతుల్లో సెంచరీ చేయగా, 2024ల సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ ట్రావిస్ హెడ్, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుపై 39 బంతుల్లో ఫాస్ట్ సెంచరీలు చేశారు, ఈ జాబితాలో తాజాగా (2025) జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ప్లేయర్ ప్రియాంష్ ఆర్యచెన్నై సూపర్ కింగ్స్‌పై కేవలం 39 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. దీంతో ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన రెండవ భారతీయుడిగా ప్రియాంష్ రికార్డులకెక్కాడు.



# వరల్డ్ కప్ టోర్నీలో భారత్ షూటర్లు సురుచి, విజయ్‌లకు స్వర్ణం

### నిరాశపరచిన మనూ భాకర్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ షూటర్లు అదరగొట్టారు. రెండు స్వర్ణ పతకాలతో సత్తా చూపించారు. దీంతో ఈ టోర్నీలో భారత్ ఖాతాలో 4 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యంతో కలిపి మొత్తం 6 పతకాలతో అగ్రస్థానంలో ఉంది. అర్జెంటీనాలో జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 18 ఏళ్ల అమ్మాయి సురుచి ఇందర్‌సింగ్, పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్దూ పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సురుచి 244.6 పాయింట్లు స్కోరు చేసి అగ్ర స్థానాన్ని దక్కించుకుంది. సురుచి ధాటికి చైనా ద్వయం కియన్ వె 241.9 పాయింట్లతో రజత పతకానికి పరిమితం కాగా, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ జియాంగ్ రాన్‌జిన్ 221 పాయింట్లతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. 41 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లోనూ సురుచి తన ఆధిపత్యం చాటుకుంది. సురుచి 583 పాయింట్లు స్కోర్ చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఇక భారత్ స్టార్ షూటర్, పారిస్ ఒలింపిక్స్‌లో డబుల్ మెడలిస్ట్ మనూ భాకర్ నిరాశపరచింది.

మనూ 574 పాయింట్లు స్కోరు చేసి 13వ స్థానంతో సంతృప్తి పడి ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. భారత్‌కే చెందిన మరో షూటర్ సయం 572 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచింది. ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో విజయ్‌వీర్ సిద్దూ 29 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ప్రపంచ కప్ చరిత్రలో 22 ఏళ్ల విజయ్‌వీర్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం గెలవడం ఇదే తొలిసారి. కాగా ఇటలీకి చెందిన రికియార్డో మజెట్టి 28 పాయింట్లతో రజత పతకాన్ని నెగ్గగా, చైనాకు చెందిన యాంగ్ యుహావో 23 పాయింట్లతో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. 24 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో విజ‌య్‌వీర్ 579 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచ ఫైనల్‌కు అర్హత సాధించాడు. కాగా భారత్‌కే చెందిన గుర్‌ప్రీత్ సింగ్ 575 పాయింట్లతో 10వ స్థానంలో, అనీశ్ 570 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచారు.

# బిల్లీ జీన్ కింగ్ కప్ టోర్నీలో భారత్‌కు నిరాశ

### గెలిచి ఓడిన రష్మిక.. సహాజ, అంకిత-ప్రార్థన జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్2025 ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భాగంగా సొంతగడ్డపై భారత్‌కు శుభారంభం లభించ లేదు. పుణేలో ప్రారంభమైన ఈ టోర్నీలో భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌లో పరాజయం పాలైంది. న్యూజిలాండ్ జట్టుతోజరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 1-2తో ఓటమిని చవిచూసింది. న్యూజిలాండ్ జట్టులో ప్రపంచ 245వ ర్యాంకర్ లులు సన్ సింగిల్స్ మ్యాచ్‌తో పాటు, డబుల్స్‌లోనూ బరిలోకి దిగి తమ జట్టును విజయతీరాలకు చేర్చింది. ఇక తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి, ప్రపంచ 345వ ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక 6-1, 6-1తో న్యూజిలాండ్‌కు చెందిన ఐశిదాస్‌పై అలవోకగా గెలిచింది. దాంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. కేవలం 57 నిముషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక కేవలం రెండు గేమ్‌లు కోల్పోయింది. ఆరు ఏస్‌లు సంధించిన రష్మిక నాలుగు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేసింది. తొలి సర్వ్‌లో 20 పాయింట్లు నెగ్గిన రష్మిక రెండో సర్వ్‌లో తొమ్మిది పాయింట్లు సాధించింది. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోని రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. రెండో మ్యాచ్‌లో గెలిస్తే భారత్ 2-0తో విజయాన్ని ఖాయం చేసుకునేది కానీ న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ లులు సన్ 6-3, 6-3తో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ అమ్మాయి యామలపల్లి సహజను ఓడించింది. దాంతో స్కోరు 1-1తో సమమైంది. 73 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను మూడుసార్లు చేజార్చుకుంది. ఆరు ఏస్‌లు సంధించిన లులు సన్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. స్కోరు 1-1తో సమం కావడంతో చివరిదైన డబుల్స్ మ్యాచ్ కీలకంగా మారింది. సింగిల్స్‌లో భారతన నవంబర్ వన్ అంకిత రైనా, డబుల్స్‌లో భారత్ నవంబర్ వన్ ప్రార్థన తొంబారే జత కట్టి ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగారు. అయినప్పటికీ భారత్‌కు ఓటమి తప్పలేదు. 83 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన ద్వయం 3-6, 4-6తో లులు సన్-మోనిక్యూ బ్యారీ జోడీ చేతిలో ఓడిపోవడంతో న్యూజిలాండ్ 2-1తో విజయాన్ని అందుకుంది.

# రెపోరేటు 0.25% తగ్గించిన ఆర్‌బిఐ

## వాణిజ్యం



**ముంబై, ఏప్రిల్ 9:** దేశ బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ ఎంపిసి వరుసగా రెండవసారి రెపో రేటును 0.25 శాతం తగ్గించింది. ఆ తర్వాత రెపోరేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఇబ్బంది పడుతున్న సమ యంలో ఆర్‌బిఐ నుండి ఈ నిర్ణయం వచ్చింది. దీని తర్వాత ప్రపంచంలో ద్రవ్యోల్బణం, మాంద్యం పెరిగే అవకాశం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఆర్‌బిఐ తీసుకున్న ఈ నిర్ణయం చాలా మెరుగైనదిగా ఉంది. ఆర్బీఐ ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు 0.25 శాతం కోతను సిఫార్సు చేశారు. ఆ తర్వాత రెపో రేటును ఇంత తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేకత ఏమిటంటే ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వరుసగా రెండోసారి ఆర్‌బిఐ పాలసీ రేటును తగ్గించారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పాలసీ సమావేశంలో కూడా వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించారు. ఈ తగ్గింపు దాదాపు 5 సంవత్సరాల తర్వాత అంటే 56 నెలల తర్వాత కనిపించింది. ఈ తగ్గింపు తర్వాత సామాన్య ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని భావిస్తు న్నారు. బ్యాంకింగ్ రంగంలో గృహ రుణాలు, కారు రుణాలు, రిటైల్ రుణాల ఖర్చు తగ్గుతుంది. దీని నుండి రియల్ రంగం ఎంతో ప్రయోజనం పొందుతారు. గత కొన్ని నెలలుగా మాంద్యం ఎదుర్కొంటున్న ఈ రంగంలో ఇళ్లకు డిమాండ్ పెరగవచ్చు. మార్చి నెల ద్రవ్యో ల్బణ గణాంకాలు వెల్లడికానప్పటికీ, ఫిబ్రవరి నెలలో దేశ ద్రవ్యోల్బ ణం 4 శాతం కంటే తక్కువగా ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, దేశ రిటైల్ ద్రవ్యోల్బ ణం 3.6 శాతంగా ఉంది. ఇది 7 నెలల్లో కనిష్ట స్థాయికి చేరుకుంది. దీనికి ప్రధాన కారణం ఆహార ద్రవ్యోల్బణం తగ్గడమేనని చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఏప్రిల్ నెలలో కూడా రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉండవచ్చు. రాబోయే రోజుల్లో ఈ సమస్య తప్పదు. దానికి ఒక కారణం ఉంది. ఈసారి వేడి తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా.

**ముంబై, ఏప్రిల్ 9:** గృహ రుణ వినియోగదారులకు రిజర్వ్‌బ్యాంకుఆఫ్ ఇండియా మరోమారు గుడ్‌న్యూస్‌చెప్పింది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అంతేకాకుండా ఆర్‌బిఐ తన వైఖరిని సైతం 'తటస్థం' నుంచి 'సర్దుబాటు' ధోరణికి మార్చింది. దీంతో భవిష్యత్‌లో మరిన్ని కోతలు ఉండే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. ఆర్‌బిఐ తాజా నిర్ణయంతో ఎన్నాళ్లగానో ఇఎంఐ భారం మోస్తున్న గృహరుణ వినియోగ దారులకు మరోమారు ఊరట కలిగిందనే చెప్పాలి. ఎవరైతే ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకొని ఉంటారో వారికి ఇఎంఐ తగ్గనుంది.

## తగ్గనున్న గృహా ఇఎంఐ భారం..


ముఖ్యంగా 2019 అక్టోబరు 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి ఆ మేర బ్యాంకులు వడ్డీరేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు, కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బిఐ రెండు దఫాల్లో ఇప్పటి వరకు 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఆ మేర ఇఎంఐ తగ్గుతుంది. ఉదాహరణకు 20యేళ్ల కాలవ్యవధికి రూ.50లక్షల రుణం తీసుకుంటే, ఇంతకుముందు 9శాతం వడ్డీ అనుకుంటే, నెలకు రూ.44,986 చెల్లించాల్సి వచ్చేది. ఆర్‌బిఐ రెండు దఫాల్లో



తీసుకున్న నిర్ణయంవల్ల ఆ మొత్తం రూ.43,391 కు తగ్గనుంది. అంటే దాదాపు నెలకు రూ.1600 వరకు ఆదా అవుతుంది. దీర్ఘకాలంలో మొత్తంగా రూ.4.70 లక్షల మేర ఆదా అవుతుంది. ఆర్‌బిఐ తాజా నిర్ణయంతో వడ్డీ రేట్లు తగ్గి గృహ విక్రయాలు పుంజుకుంటాయని రియల్ ఎస్టేట్ సమాఖ్యలు క్రెడాయ్, నరెడ్కో ఆశాభావం వ్యక్తం చేశాయి. ఆర్‌బిఐ తాజా నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తం చేశాయి. వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి కూడా దన్నుగా నిలుస్తుందని పేర్కొంటున్నాయి.

## ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్: రఘురామ్ రాజన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్ చేసుకొందని ప్రముఖ ఆర్థిక వేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయ పడ్డారు. ప్రస్తుతం అమెరికాచైనా మధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న వాణిజ్యయుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందని పేర్కొన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు తలపడినప్పుడు వాణిజ్యంలో కొంత అస్థిరత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధిపొందుతుందన్నారు. ఆయన మాట్లాడుతూ, ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమయంలో భారత్ చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెరిగేలా.. ఎగుమతులకు ప్రోత్సాహం లభించేలా అమెరికాతో వాణిజ్య చర్చలు జరపాలన్నారు. ట్రంప్ నిర్ణయాలు స్వల్పకాలానికి అమెరికాకు సెల్ఫ్‌గోల్‌లా పనిచేస్తాయని రాజన్ హెచ్చరించారు. ఆ దేశంలో నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించేందుకు సౌకర్యవంతంగా ఉన్న సమయంలో సొంత ఆర్థికవ్యవస్థనే ఆయన పట్టాలు తప్పిస్తున్నారన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని చెప్పారు. వీటితో పోలిస్తే భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం పరిమితిగా ఉంటుందని చెప్పారు. మన జీడీపీతో పోలిస్తే ఎగుమతులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని రాజన్ అభిప్రాయపడ్డారు. మన వృద్ధిరేటు పైనా పెద్దగా ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. భారత్ ఇప్పుడు ఒక్క అమెరికాపైనే కాకుండా, టారిఫ్‌ల విధానాన్నే పూర్తిగా సరళీకరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. భారత్ ఇప్పుడు ఆర్థిక రక్షణాత్మక వైఖరి నుంచి దూరంగా జరిగి వాణిజ్య, పెట్టుబడుల వాతావరణాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని రాజన్ అభిప్రాయపడ్డారు. తూర్పు, ఉత్తర దేశాలతోపాటు ఆర్సీఈపీ, ఆసియాన్ వంటి గ్రూపులు, చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు.



బీజింగ్‌తో న్యూఢిల్లీ వాణిజ్య లోటు ఉన్నా బ్యాలెన్స్‌గా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బను తప్పించుకోవడానికి చైనా నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్న కంపెనీలకు భారత్ ఓ ఆకర్షణీయమైన ప్రదేశమని రాజన్ వెల్లడించారు. మనం సరైన నిర్ణయాలు తీసుకొంటే అమెరికా తక్కువ టారిఫ్‌లు విధించిన దేశాల్లో భారత్ ఉండటం, దేశీయంగా ఉన్న బలమైన మార్కెట్ వంటి భారీగా పెట్టుబడులను తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించే నిర్ణయాలు తీసుకోవడంతో పాటు పన్ను చట్టాలను మరింత సరళీకరించాలి.

## గోల్డ్ లోన్స్‌పై త్వరలో ఆర్‌బిఐ మార్గదర్శకాలు..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి నిబంధనలు కఠినతరం కానున్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి రుణ జారీ సంస్థల షేర్లు భారీగా క్షీణించాయి. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవల విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకొనేందుకు ఆర్‌భిఐ చర్యలకు సిద్ధమవుతోందని కొన్ని రోజుల క్రితమే వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్‌బిఐ తాజాగా స్పందించింది. వివిధ రకాల నియంత్రణ సంస్థలు అనుసరి స్తున్న మార్గదర్శకాలను సమన్వయం చేయడంతో పాటు, సాధ్యమైనంత వరకు రిస్క్ తగ్గించేందుకు త్వరలో సమగ్ర నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది. ఎంపిసి సమావేశ వివరాల వెల్లడి సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బిఐ ప్రకటనతో ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు 10శాతం మేర పతనమయ్యాయి. బిఎస్ఇలో ఆ కంపెనీ షేర్లు రూ.2063కు చేరాయి. ఐఐఎఫ్ఎల్ షేర్లు కూడా 8శాతం మేర క్షీణించాయి. మణప్పురం షేర్లు 3శాతం, చోళమండలం షేర్లు 4.7శాతం మేర పడ్డాయి.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *r esponsible for selection of News under the Pr B Act. r NI No.APTEL/2001/7563.Postal Licence r egd. No. H/KAr /89/12-14